ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 25.07.2026 | సంపుటి : 13 సంచిక : 05 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేసేవరకు
# పోరు ఆగదు
## కాక్రోచ్ జనతా పార్టీ నాయకులతో కేంద్రమంత్రుల చర్చలు

- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి చొప్పన పరిహారం ఇవ్వాలి..
- విద్యార్థులపై పెట్టిన కేసులను భేషరతుగా ఎత్తివేయాలి
- పై మూడు డిమాండ్లను నెరవేర్చాల్సిందేనని కేంద్రమంత్రులకు తేల్చి చెప్పిన సీజేపీ ప్రతినిధులు
- ఇప్పుడు మౌనం వహిస్తే..మరెప్పుడూ ప్రశ్నించలేం..
- విద్యార్థుల భవిష్యత్ కోసమే మా ఆందోళన : అభిజీత్ దీప్కే



కేంద్రమంత్రి జేపీ నడ్డాకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు, చిత్రంలో మరో కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**న్యూఢిల్లీ,జూలై24(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత తీసుకోవాలంటూ పట్టుబడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు కొందరు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా వ్యవస్థలో కీలక అంశాలపై చర్చించారు. దాదాపు గంటన్నరపాటు ఈ చర్చలు జరిగాయి. తమ డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్ర మంత్రులు స్పందిస్తూ తమకు ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో, రేపు మరోసారి భేటీ అయ్యేందుకు ఇరు వర్గాలు నిర్ణయించాయి. కేంద్రం మంత్రులతో సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మీడియా తో మాట్లాడారు. కేంద్రం ముందు మిగతా 2లో..

### పేపర్ లీక్ చేస్తే
## పదేళ్ల జైలు.. రూ.10 కోట్ల జరిమానా!
కీలక బిల్లుకు క్యాబినెట్ ఆమోదం! 2లో

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన
వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ

### రాతపూర్వక హామీ వచ్చాకే..
## దీక్ష విరమించా
సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడి

కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను ముగించిన సామాజిక కార్యకర్త 2లో

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వతీరు సరికాదు
ఇంతజరుగుతున్నా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం శోచనీయం
ప్రధాని మోదీ ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్ ఎంపీ సోనియా

### విద్యార్థులపై కాల్పులు జరిపారు...
## ఇదిగో రుజువు
ఇప్పటికైనా కేంద్రం అబద్ధాల ప్రచారం మానుకోవాలి
మీడియాకు బాధిత విద్యార్థిని చూపిన రాహుల్ గాంధీ
జంతర్ మంతర్ ఆందోళనకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఢిల్లీ యూనివర్శిటీ పిలుపునివ్వడంపై ఆగ్రహం



2లో

### జనావాసాల పరిధిలోనే
# ఇందిరమ్మ ఇండ్లు
## వివిధ శాఖల పరిధిలోని నిరుపయోగ స్థలాలను గుర్తించండి

- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూలై24(జనంసాక్షి):** నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి మిగతా 2లో..

### ట్రాఫిక్ నిబంధనల కంటే క్రమబద్ధీకరణపై
## ఎక్కువ దృష్టి సారించాలి

- ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి
- ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలి
- నగరంలో సిగ్నల్ ఫ్రీ వ్యవస్థకు అవసరమైనచోట అండర్ పాస్, ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలి.. అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

### సీజేపీ ఆందోళనలపై పిటిషన్‌లే లేనప్పుడు
## తిరస్కరించామంటే ఎలా?
- మీడియా కథనాలపై మండిపడ్డ చీఫ్ జస్టిస్



**న్యూఢిల్లీ,జూలై24(జనంసాక్షి):**'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు. గత రెండు రోజులుగా మీడియా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. అత్యవసర పిటిషన్‌ను సీజేఐ విచారణకు స్వీకరించలేదని తప్పుడు వార్తలు ప్రసారం చేస్తోందన్నారు. శుక్రవారం కోర్టు విచారణ ప్రారంభమైన తర్వాత న్యాయవాదులు తమ కేసులను అత్యవసరంగా స్వీకరించాలని విజ్ఞప్తి చేసిన సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సీజేపీ ఆందోళనలకు సంబంధించి ఒక్క పిటిషన్ మిగతా 2లో..

### పరీక్షలకు తాత్కాలికంగా కాదు..
## శాశ్వత ప్రాతిపదికన నిర్వహణ చేపట్టాలి
దీనిపై నివేదిక కోరుతూ కేంద్రం, ఎన్‌టీఏకు సుప్రీం ఆదేశం 2లో

## ఎన్‌టీఏలో భారీ ప్రక్షాళన..
47మంది అధికారులు తొలగింపు

### సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తోనే
## సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- జాతీయ సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలి
- సైబర్ సెక్యూరిటీ, ఈ-జీరో ఎఫ్ఐఆర్, సీసీటీఎన్ఎస్ అమలుపై డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష

**హైదరాబాద్, జూలై 24(జనంసాక్షి):** పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే తెలంగాణ పోలీసులు సాంకేతికతలో ఎప్పటికప్పుడు ముందుండాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని సైబర్ భద్రత ప్రమాణాల్లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరిచి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించేలా అన్ని పోలీసు యూనిట్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు.గురువారం రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్ల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన డీజీపీ, సైబర్ సెక్యూరిటీ, ఈ-జీరో ఎఫ్ఐఆర్ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ మిగతా 2లో..

### ఢిల్లీ ఆందోళన ముసుగులో
## అరాచక శక్తులు
- పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు
- పోలీసులు, జర్నలిస్టులపై దాడులకు తెగించారు
- మీడియా సమావేశంలో బండి సంజయ్

2లో

### విద్యార్థుల పోరు
# చారిత్రాత్మకం
## ఇది ముమ్మాటికీ ఎన్డీయే ప్రభుత్వ వైఫల్యమే

- మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారు
- 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోంది
- ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారు
- ఇందిరాపార్క్ వద్ద కాక్రోచ్ ఆందోళనలకు కేటీఆర్ సంఘీభావం
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్




**హైదరాబాద్(జనంసాక్షి):** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు. యువతపై జరుగుతున్న దాడులను దారుణమని తీవ్రంగా ఖండించారు. ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే ప్రధాని మోదీ పెట్టుకున్నారని.. ఈ జనరేషన్ చావుకు, ఐటీ, ఈడీ సోదాలకు భయపడేది కాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ.. మేక్ ఇన్ ఇండియా అడిగితే లీక్ ఇన్ ఇండియా ఇచ్చారంటూ సెటైర్లు వేశారు. న్యాయం మిగతా 2లో..

## హర్మూజ్‌లోనే నిలిచిన నౌకలు

అందులోనే చిక్కుకుపోయిన 6వేల మంది నావికులు
నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయి దీనస్థితిని ఎదుర్కొంటున్న వైనం
పట్టించుకోని ఆయా దేశాలు, నౌకల యాజమాన్యాలు

**టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికా-ఇరాన్ మధ్య పరస్పర దాడులతో హర్మూజ్ జలసంధిలో కొంతకాలంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వందలాది నౌకలు జలసంధిలోనే నిలిచిపోయాయి. దీంతో వేలాది మంది నావికులు నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయి దీనస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారిని తక్షణమే ఆయా దేశాలకు సురక్షితంగా తరలించాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం పిలుపునిచ్చింది.పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిలో నిలిచిపోయిన వందలాది నౌకల్లో దాదాపు 6 వేల మంది నావికులు చిక్కుకుపోయినట్లు ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. అయితే, కాల్పుల విరమణ సమయంలో వీరిని తరలించలేక పోయారని.. ఇంకా అనేక మంది ఆచూకీ కూడా తెలియడం లేదని పేర్కొంది. చిక్కుకుపోయిన నావికులకు దౌత్య సహాయం అందించడం, అవసరమైన సామగ్రి సమకూర్చడంతోపాటు తక్షణమే వారిని తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా దేశాలు, నౌకల యాజమాన్యాలు, సంబంధిత వర్గాలకు ఐరాస మానవ హక్కుల విభాగం చీఫ్ వోల్కర్ టర్క్ విజ్ఞప్తి చేశారు.



**పట్టించుకోని యాజమాన్యాలు..**
భీకర దాడులతో నావికులు ముప్పు ఎదుర్కొంటున్నారని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు 17 మంది నావికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతోపాటు స్వదేశానికి పంపించకుండా, ఎటువంటి సహాయం చేయకుండా కొందరు నౌకా యజమానులు సముద్రంలోనే వదిలేశారని పేర్కొంది. ఇలా తొమ్మిది నౌకల్లో 93 మంది సిబ్బంది ఉండిపోయారని.. మిగతా 9లో..

## సిక్కింలో ఘోర విషాదం
రహదారిపై విరిగిపడ్డ కొండచరియలు కారుపై పడడంతో 13 మంది దుర్మరణం



9లో

## బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా
అనారోగ్య కారణాలతోనే నిర్ణయం

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

న్యూఢిల్లీ(జనంసాక్షి):లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు. అయితే.. ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

మకరధ్వజ్ గేట్ వద్ద విపక్ష ఎంపిల ఆందోళన

నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేస్తోంది. వరుసగా ఐదో రోజు శుక్రవారం పార్లమెంట్‌లోని 'మకర్ ద్వార్' వద్ద ఇండియా కూటమి ఎంపీలు నిరసన ప్రదర్శన కొనసాగించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, లేదా ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని విపక్ష ఎంపీలు ప్లకార్డులు చేతబూని నినాదాలతో హోరెత్తించారు. గురువారం మకర్ ద్వార్ వద్ద అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు పరస్పర నిరసనలతో ఎదురెదురుగా నిలబడి ఆందోళన చేపట్టడం ఉద్రిక్తతకు దారితీసింది. చర్చను ప్రతిపక్షాలే అడ్డుకుంటున్నాయని ఎన్డీఏ ఆరోపిస్తుండగా, విద్యాశాఖ మంత్రి రాజీనామాకే విపక్షాలు పట్టుబడుతున్నాయి. నీట్ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వీడియో సందేశం విడుదల చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. 'పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రధాని తన వ్యాఖ్యలను సభలోనే వినిపించాలి తప్ప, బయట రాత్రివేళల్లో రికార్డ్ చేసిన వీడియోలతో ఒంటెద్దు పోకడ 'మన్ కీ బాత్' చెప్పడం సరికాదు. ప్రధాని మోదీ.. ఈరోజు పార్లమెంట్‌కు వచ్చేముందు ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించి రండి. ఆందోళనకారులపై లాఠీఛార్జ్, ప్లెలెట్ గన్ల ప్రయోగానికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోండి. ఆ తర్వాతే విద్యావ్యవస్థపై సమగ్ర చర్చకు మేం సిద్ధం' అని ఖర్గే అన్నారు.

## రాతపూర్వక హామీ వచ్చాకే.. దీక్ష విరమించా

న్యూఢిల్లీ(జనంసాక్షి):పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించారు. 26 రోజులుగా దీక్ష చేసిన ఆయన.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో దీక్షను ముగించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోనమ్‌కు ప్రత్యేక సందేశం పంపారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. "వైద్యుల సూచనలు పాటించి సోనమ్‌జీ వేగంగా కోలుకోవాలి. వీలైనంత త్వరగా ఆయన బరువు పెరగాలని కోరుకుంటున్నా. ఆయన ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా" అని ప్రధాని తన ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.దీక్ష విరమించిన అనంతరం సోనమ్ వాంగ్‌చుక్ శుక్రవారం ఉదయం వీడియో విడుదల చేశారు. "నీట్ పేపర్ లీకేజీ, పరీక్షా విధానంలో జవాబుదారీతనం, పరీక్షల్లో విస్తృత స్థాయి సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చిస్తామని కేంద్రం లిఖితపూర్వక హామీ ఇచ్చింది. శాంతియుతంగా ఆందోళన చేస్తోన్న విద్యార్థులపై ఎలాంటి కేసులు పెట్టబోమని కూడా చెప్పింది. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. అందుకే దీక్ష విరమిస్తున్నా" అని సోనమ్ తన వీడియోలో పేర్కొన్నారు. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందిస్తూ.. "సోనమ్‌జీ దీక్ష విరమించడం ఆనందంగా ఉంది. మీ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని మేల్కొలిపారు. మీ అసాధారణ ధైర్యం, త్యాగానికి కృతజ్ఞతలు సర్" అని తెలిపారు. అయితే, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంతవరకు జంతర్ మంతర్ వద్ద తమ ఆందోళన కొనసాగుతుందని దీప్కే స్పష్టం చేశారు. పేపర్ లీక్ ఘటనలపై మరిన్ని తీవ్ర చర్యలుంటాయని ప్రధాని మోదీ నిన్న అర్ధరాత్రి వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. "మోదీజీ.. మన విద్యార్థులు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి వీడియోలతో మీరు వారిని అవమానించకండి. యువతకు క్షమాపణలు చెప్పి.. వారిపై దౌర్జన్యాలకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోండి" అని రాహుల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## ఎన్‌టీఏలో భారీ ప్రక్షాళన..

### 47మంది అధికారులు తొలగింపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జేఈఈ, నీట్ సహా పలు జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)లో భారీ ప్రక్షాళన చేపట్టింది. పరీక్ష పత్రాల లీకేజీతో ఈ ఏజెన్సీ పదే పదే వివాదాల్లోకి రావడంతో అందుకు కారకులుగా గుర్తించిన 47 మంది అధికారులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో పలువురిపై లీగల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఈ చర్యను ఎన్‌టీఏ ప్రక్షాళనలో తొలి అడుగుగా అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. లీకులకు అస్కారం లేకుండా నిపుణుల కమిటీ సూచనల మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

## ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేసేవరకు

# పోరు ఆగదు

3 ప్రధాన డిమాండ్లు పెట్టామని సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ తెలిపారు. మూడింట్లో రెండు డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉందని అన్నారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని తాము కోరినట్టు చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి రేపటి వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు.కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధుల మధ్య చర్చలు ముగిశాయి. ఇందులో భాగంగా కేంద్రం ముందు సీజేపీ మూడు ప్రధాన డిమాండ్లను ఉంచింది. ధర్మేంద్ర ప్రధాన్ (రాజీనామా, పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడం వంటి డిమాండ్లు చేసినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన్ రాజీనామా తప్ప మిగతా రెండు డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌పై రేపు మధ్యాహ్నం వరకు ప్రభుత్వం సమయం కోరిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆయనను పదవి నుంచి తొలగిస్తుందని తాము ఆశిస్తున్నట్లు తెలిపారు.దాదాపు 2గంటలపాటు జరిగిన ఈ సమావేశానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ హాజరుకాగా.. సీజేపీ తరఫున పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా వెళ్లారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని సీజేపీ డిమాండ్ చేసింది. అది నెరవేరకపోతే ఉద్యమం మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది. ప్రధాన్ వైదొలిగే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని పునరుద్ఘాటించింది.

**ఇప్పుడు మౌనం వహిస్తే..మరెప్పుడూ ప్రశ్నించలేం**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ తమ ఆందోళనలు కొనసాగుతాయని కాక్రోచ్ జనతా పార్టీ స్పష్టం చేసింది. అదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపింది. గతంలో తమకు ఆందోళనలు చేసిన నేపథ్యం ఏమీ లేదని.. విద్యార్థుల భవిష్యత్తు కోసమే పోరాటం కొనసాగిస్తున్నామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. విద్యా వ్యవస్థ నాశనమైనందుకు దేశంలో యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులకు భయపడి ప్రశ్నించకపోతే భవిష్యత్తు ఉండదని.. ఇప్పుడు మౌనం వహిస్తే, దేశం ఇంకెప్పటికీ ముందుకు సాగదని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయని.. ప్రజల మద్దతును ఎప్పటికీ మరిచిపోబోమని దీప్కే పేర్కొన్నారు. యువత మద్దతుతోనే ఇన్ని రోజులు జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చర్చల కోసం తాము కేంద్రమంత్రి జేపీనడ్డా నివాసానికి వెళ్లబోమని.. జంతర్‌మంతర్ వద్దే చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చలు తటస్థ వేదికపైనే జరుగుతాయని స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తప్పించడమే.. ఈ విషయంలో తీసుకునే కఠిన చర్య అని పేర్కొన్నారు. విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దమనకాండను ఖండించారు. సీజేపీ నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దకు వేల సంఖ్యలో యువకులు చేరుకుంటున్నారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున భద్రతాబలగాలను మోహరించారు.

## పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు..రూ.10కోట్ల జరిమానా!

– కీలక బిల్లుకు క్యాబినెట్ ఆమోదం!

న్యూఢిల్లీ(జనంసాక్షి):పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. ముఖ్యంగా ప్రశ్నపత్రాల లీక్‌ల ఘటనలో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టానికి కేంద్రం కీలక సవరణలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చట్టం కింద ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. ఈ శిక్షలు, జరిమానాలను భారీగా పెంచుతూ చట్టాన్ని సవరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై శుక్రవారం జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చలు జరిపారు. అనంతరం ఈ ముసాయిదా బిల్లును క్యాబినెట్ ఆమోదించింది.ఇక, పేపర్ లీకులపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఢిల్లీ న్యాయస్థానంలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటవ్వగా.. మరో నాలుగింటిని త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈ న్యాయస్థానాల పరిధిలో.. లీకులకు సంబంధించిన కేసుల విచారణను మూడు నెలల్లో పూర్తిచేసి దోషులకు శిక్ష విధించేలా బిల్లులో ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. వచ్చే వారం ఈ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉంది. నీట్ పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలకు ఉపక్రమించింది. లీకేజీ ఘటనలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్వయంగా ప్రధాని మోదీ గురువారం అర్ధరాత్రి ప్రత్యేక వీడియో విడుదల చేశారు. ఈ బిల్లును వీలైనంత త్వరగా ఆమోదించేందుకు ప్రయత్నిస్తామని ప్రధాని తెలిపారు.

## విద్యార్థుల నిరసనలపై ప్రభుత్వ తీరు సరికాదు

న్యూఢిల్లీ,జూలై24(జనంసాక్షి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోనియాగాంధీ ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా ధ్వజమెత్తారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని ప్రస్తావించారు. జాతీయ పరీక్షల నిర్వహణ వ్యవస్థలో లోపాలపై మోదీ ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాంట్రాక్టర్ల చేతుల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణను ఉంచడం వల్లే ఈ పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని ఆరోపించారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని కూడా సోనియా గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువతను దేశ భవిష్యత్తుగా చూడాల్సిందిపోయి దేశద్రోహులుగా చూస్తున్నారని ధ్వజమెత్తారు. జులై 20వ తేదీన విద్యార్థులపై టియర్ గ్యాస్ ప్రయోగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

## విద్యార్థులపై కాల్పులు జరిపారు...

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రభుత్వం అబద్ధాలు చెప్పడం మానుకోవాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హితవు పలికారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా 'చలో పార్లమెంట్' చేపట్టిన ఆందోళనకారులపై పోలీసులు పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపలేదంటూ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందంటూ ఆయన మండిపడ్డారు. పెల్లెట్లు తగిలి గాయపడిన సాహిల్ అనే బాధితుడిని పక్కన పెట్టుకొని ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.ఆందోళనకారులను అడ్డుకునేందుకు పెల్లెట్ గన్‌లను ప్రయోగించలేదని కేంద్రం వాదిస్తోంది. కానీ, ఇదిగో రుజువు. ఈ విద్యార్థి వాటివల్లే గాయపడినట్లు వైద్యులు కూడా చెబుతున్నారు" అంటూ బాధితుడి గాయాలను మీడియాకు చూపించారు. అతడి కన్ను, మోచేయి, ఇతర శరీర భాగాలపై గాయాలైనట్లు తెలిపారు. "ఈ సోదరుడి కుడి కన్నుకు పెల్లెట్ తగిలింది. ప్రస్తుతం పూర్తిగా కనిపించడం లేదు. భవిష్యత్‌లో చూపు వస్తుందో, రాదో కూడా చెప్పలేం. ఇలాంటి బాధితులు ఎందరో ఉన్నారు. ఒక్కొక్కరుగా తమ గోడు చెప్పుకొనేందుకు ముందుకొస్తున్నారు" అని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. భారత్ భవిష్యత్‌పై ప్రభుత్వం కాల్పులు జరిపిందంటూ మండిపడ్డారు. బాధితులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలన్నారు. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు.

జంతర్ మంతర్ ఆందోళనకు దూరంగా ఉండాలి

జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న సీజేపీ నిరసనలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు ఢిల్లీ విశ్వవిద్యాలయం జారీ చేసిన అడ్వైజరీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించడం అంగీకారయోగ్యం కాదని మండిపడ్డారు. విద్యార్థుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్న వారే భవిష్యత్తులో జవాబుదారీగా నిలవాల్సి వస్తుందని రాహుల్ హెచ్చరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రజాస్వామ్య హక్కులను వినియోగిస్తున్న విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారంటూ ప్రశ్నించారు. సమయం వచ్చినప్పుడు దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఢిల్లీ వర్సిటీని ఎంపీ రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న నిరసనల దృష్ట్యా ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులకు భద్రతా సూచనలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జంతర్‌మంతర్‌లో నిరసనలు కఠిన నియంత్రణలో ఉంటాయని పేర్కొంది. చట్టవిరుద్ధంగా నిర్వహించే సభలు, ఆందోళనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని హెచ్చరించింది. అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల వ్యక్తిగత భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు విద్యాభ్యాసం, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద జరిగే ఆందోళనలకు దూరంగా ఉండి, తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

## సీజేపీ ఆందోళనలపై పిటిషన్‌లే లేనప్పుడు తిరస్కరించామంటే ఎలా?

కూడా దాఖలు కాలేదు. ఈ అంశంపై విచారణ చేపట్టాలని ఎవరో ఒక లాయర్ మాత్రం విజ్ఞప్తి చేశారు. ఓ అభ్యర్థనను పిటిషన్‌గా ఎలా స్వీకరిస్తాం అని సీజేఐ అన్నారు. జులై 20న సీజేపీ చేపట్టిన చలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో అత్యవసరంగా విచారణ చేపట్టాలని న్యాయవాది నరేంద్ర మిశ్రా బుధవారం సుప్రీం కోర్టును అభ్యర్థించారు. పోలీసు దాడులకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది విద్యార్థులే ఉన్నారని, వారి కోసమైనా అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. అయితే, సుప్రీం కోర్టు అందుకు తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని, అలాగే పిటిషనర్ కూడా సమయం వృథా చేసుకోవద్దని సీజేఐ హితవు పలికినట్లు రాసుకొచ్చాయి. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..' మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ అన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది. ఒక వేళ పోస్టు చేయాలనుకుంటే సుప్రీం కోర్టు లేదా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదేశించింది. కోర్టు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం వల్ల దుర్వినియోగమవు తున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వికాస్ సింగ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా అంగీకరించారు. నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై పూర్తి వివరణ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

### పరీక్షలకు తాత్కాలికంగా కాదు.. శాశ్వత ప్రాతిపదికన నిర్వహణ చేపట్టాలి

న్యూఢిల్లీ,జూలై24(జనంసాక్షి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది.

# జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనల కంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలి

హైదరాబాద్(జనంసాక్షి):రోడ్డు భద్రత పర్యవేక్షణకు ప్రత్యేక బ్యూరోను ఏర్పాటు చేయాలి పూర్తి అధ్యయనంతో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ బ్యూరో సంస్థాగత నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అధిసమీక్షలో అధికారులతో ఆయన మాట్లాడుతూ" ట్రాఫిక్ నిర్వహణ, ప్రతీ రెండు లేదా మూడు నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలి. ట్రాఫిక్ విషయంలో నిబంధనల కంటే క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలి. వాతావరణ మార్పులు, పనివేళలు, రద్దీ సమయాల, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం చేయాలి. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి ఔటర్ పై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షించాలి నగరంలో సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకు వచ్చేందుకు అవసరమైనచోట అండర్ పాస్, ఎలివేటెడ్ కారిడార్ లను నిర్మించాలి. సాధ్యమైనంత వరకు సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాలు మూమెంట్ ఉండేలా చూడాలి" అని అన్నారు.

**విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగిస్తే యాజమాన్యాలను బాధ్యులను చేయాలి: సీఎం రేవంత్**

హైదరాబాద్(జనంసాక్షి):డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (ఖీవలజీనిబిష్త్ర ఖీవటటఎ) ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణ, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగిస్తే వాటి యాజమాన్యాలను బాధ్యులను చేయాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనికోసం టోల్‌ఫ్రీ నంబర్, క్యూఆర్ కోడ్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్నారు.

# విద్యార్థుల పోరు చారిత్రాత్మకం

చేయాలని విద్యార్థులు అడుగుతున్నారని, వారికి అండగా నిలబడతామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీపై కొట్లాడితే చోటాభాయ్‌కు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చురకలు అంటించారు. మోదీ అంటే రేవంత్‌కు ఎందుకంత భయమంటూ ప్రశ్నించారు. పాత కేసులు తోడుతారని సీఎం భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తే రేవంత్ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్‌పై ఆయన ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నలు సంధించారు. విద్యార్థులను కొడుతుంటే సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీక్‌కు తనకు సంబంధం ఏంటని, యూత్ కాంగ్రెస్ వాళ్లకు బుద్ధి ఉందా? అంటూ మండిపడ్డారు. వాళ్లు దేశంలో ఏం జరిగినా.. కేసీఆర్, కేటీఆర్‌దే తప్పు అంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి నిద్రలో కూడా కేసీఆరే గుర్తు వస్తున్నారని చురకలు అంటించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు

## ఢిల్లీ ఆందోళన ముసుగులో అరాచక శక్తులు

హైదరాబాద్,జూలై24(జనంసాక్షి): ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో మతతత్వ, కమ్యూనిస్ట్ శక్తులు అరాచకం సృష్టించాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అలాగే పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర కూడా చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు, జర్నలిస్టులపై దాడులతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని వివరించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరిరగ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ సమయంలో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరిగా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశమని అన్నారు. అందుకే ఈ విషయంలో అం దరికంటే ప్రధాని మోదీ ఎక్కువగా బాధపడుతున్నారని చెప్పారు. పేపర్ లీక్ చేసిన నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సీబీఐ ఇప్పటికే 11 మంది ఫ్యాకల్టీతో సహా 17 మందిని అరెస్ట్ చేశారని వివరించారు. విద్యార్థుల ఆందోళనను తాము అర్థం చేసుకున్నామని పేర్కొన్నారు. దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ క్షమాపణలు చెప్పారని అన్నారు.

## సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

అండ్ సిస్టమ్స్ అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు." ప్రగతి " వేదికలోనూ సైబర్ భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, ప్రధానమంత్రి ప్రగతి వేదిక ద్వారా దేశవ్యాప్తంగా కీలక ప్రాజెక్టులు, పాలనకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ మోసాలు, ముఖ్యంగా "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు.కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ రాష్ట్రాల సైబర్ భద్రత పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తోందని డీజీపీ తెలిపారు. మొత్తం తొమ్మిది కీలక పనితీరు సూచికల ఆధారంగా రాష్ట్రాలకు జాతీయ ర్యాంకులు కేటాయిస్తారని, ఆ అన్ని అంశాల్లో తెలంగాణ పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేసి జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించాలని సూచించారు..

## గ్లోబరీనా సంస్థ నిర్వాకంతో 28మంది బలి

### వారందరికి కేటీఆర్ రూ.2 కోట్ల చొప్పన చెల్లించాలి :పీసీసీ చీఫ్

**హైదరాబాద్,జూలై24(జనంసాక్షి):** రిబీఆర్‌ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ విద్యార్థుల చావుకు కారణమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 28 మంది విద్యార్థుల ప్రాణాలు పోయేందుకు ఆ సంస్థ కారణం కాదా? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం బర్త్‌డే రోజైనా కెటిఆర్ అబద్దాలు మాట్లాడకుండా ఉంటే మంచిదన్నారు. గ్లోబరీనా సంస్థ రిపోర్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదన్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. నీట్ పేపర్ లీకైన నెలన్నరకు ఆయన నిద్రలేచారని మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు.

## ఎస్‌బీఐ 'ఆశ' స్కాలర్‌షిప్-2026 దరఖాస్తులు ప్రారంభం

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్లాటినం జూబ్లీ 'ఆశ'స్కాలర్‌షిప్-2026కు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు రూ.15,000, డిగ్రీ విద్యార్థులకు రూ.75,000, పీజీ విద్యార్థులకు రూ.1,50,000, ఐఐటీ విద్యార్థులకు రూ.2,00,000, ఐఐఎం విద్యార్థులకు రూ.5,00,000, వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.2,00,000, అలాగే విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల లోపు ఉన్న భారతీయ విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ మార్కుల మెమో, ఆధార్ కార్డు, ఫీజు చెల్లించిన రసీదు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ ప్రతితో కలిసి సెప్టెంబర్ 4లోపు www.sbifashascholarship.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అన్ని వర్గాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యాకూబ్ పాషా కోరారు. మరిన్ని వివరాల కోసం 85208 60785 నంబర్‌ను సంప్రదించవచ్చని లేదా పై వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

## కార్పొరేట్ శక్తుల చేతికి దేశసంపద

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నాగయ్య.




దుగ్గొండి, జులై 24 (జనంసాక్షి): నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం దేశ సంపదను దేశభక్తి పేరుతో కార్పొరేట్ రంగానికి దారాదత్తం చేస్తుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల నాగయ్య అన్నారు. శుక్రవారం సిపిఎం పార్టీ దుగ్గొండి మండల కమిటీ అధ్వర్యంలో రేకంపెల్లి గ్రామంలో ఈసంపెల్లి బాబు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన జి. నాగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వం లోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెట్టిందనీ, అధికారం లోకి వచ్చే ముందు దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ప్రతి సంవత్సరము రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ హామీలు అమలు చేయకపోగా ప్రజల మధ్య కులాల పేర మతాల పేర విద్వేషాలు రెచ్చగొడుతూ అధికారాన్ని చెలాయిసున్నాడని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతూ పోటీ పరీక్షలు పేపర్లు లీకు చేస్తూ దళారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని పేపర్ లీకులకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల పై మోడీ ప్రభుత్వం చేస్తున్న దాడులను ప్రజలు ప్రజాతంత్ర వదులు ఖండించాలని అన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకు వచ్చిందని, ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరుగు జైలు బరో కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభలో జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమార స్వామి, నమిండ్ల స్వామి, హన్మకొండ శ్రీధర్, దుర్గయ్య, దుగ్గొండి మండల నాయకులు కృష్ణారెడ్డి , నర్సింహ రెడ్డి, చల్ల నర్సింహ రెడ్డి, అక్కపెల్లి సుధాకర్, నర్సింహ స్వామి, కోడేమ్ రమేష్, ఇజ్జగిరి కనక మల్లు, పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయం అద్భుత కట్టడం

- డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి



వెంకటాపూర్ (రామప్ప), జూలై 24(జనం సాక్షి): రామప్ప దేవాలయం అద్భుత కట్టడమని తెలంగాణ డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి అన్నారు. మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమేతంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ వారికి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వారికి ఆలయ విశిష్టత, శిల్పకళ నైపుణ్యత గురించి టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వివరించారు.

## విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీస్ దాడిని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడు రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్నారు. వాళ్లపై మోడీ ప్రభుత్వం పోలీస్ లాఠీ ఛార్జ్ చేయించడం న్యాయంగా ప్రశ్నించే విద్యార్థుల గొంతును పోలీసులతో లాఠీ ఛార్జ్ చేపించి అణిచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తి కి విరుద్ధమని హెచ్చ రించారు. విద్యార్థుల డిమాండ్లపై వెంటనే ప్రభుత్వం స్పందించి వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్క రించాలని భవిష్య త్తులో ఇలాంటి ఘటనలు పునవృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూర స్రవంతి డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం యువతతో పెట్టుకోవద్దని యువతతో పెట్టుకుంటే మోది ని గద్దె దింపుతారని గుర్తుపెట్టుకోవాలన్నారు. పేపర్ లీకేజ్ దోషులంతా బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పేపర్ లీకేజ్ భవిష్యత్తులో ఇంకెప్పుడు జరగకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు.

## అధిక లాభాల పేరుతో కుచ్చుటోపీ

- జిబిఇఎక్స్ టెక్నోకార్ట్ సీఈఓపై కేసు నమోదు

హైదరాబాద్, జూలై24 (జనంసాక్షి) : అధిక లాభాల ఆశ చూపించి మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. జిబిఇఎక్స్ టెక్నోకార్ట్ సీఈఓపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్టుబడి పేరుతో మోసం జరిగిన ఘటనపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్‌కు చెందిన శ్రీకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఓ చిక్కాల రాజా రామ్ మోహన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన కంపెనీలో పెట్టుబడి పెడితే నెలకు 3 శాతం లాభాలు వస్తాయని, మూడు నెలల్లో అసలు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తానని నమ్మించి పెట్టుబడి పెట్టేలా ప్రేరేపించినట్లు బాధితుడు ఆరోపించారు. క్రిప్టో ట్రేడింగ్ ద్వారా భారీ లాభాలు వస్తాయని చెప్పి తనను ఆకర్షించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడి మాటలు నమ్మిన శ్రీకర్ బ్యాంకులో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.8 లక్షలు పెట్టుబడిగా ఇచ్చినట్లు తెలిపారు. మొదట 45 రోజుల పాటు రోజుకు రూ.2,280 చెల్లించిన నిందితుడు.. అనంతరం చెల్లింపులు నిలిపివేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే మరింత సమయం కావాలని చెప్పడంతో పాటు, ఇతరులను కూడా పెట్టుబడులు పెట్టేలా ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. గతంలోనూ ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు, ఎస్‌ఆర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో రాజాపై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మాదాపూర్ పోలీసులు వెల్లడించారు.

# నిర్లక్ష్యం ఖరీదు రెండు ప్రాణాలు

- బోరు బండిని ఢీకొట్టి స్పాట్‌లో యువకుడి మృతి
- చికిత్స పొందుతూ మరో యువకుడు మృతి





పాలకుర్తి, జూలై 24(జనంసాక్షి) : హెల్మెట్ ధరించకపోవడంతో ... బైక్ నడుపడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. బైక్ నడుపుతూ బోరు బండిని ఢీకొని ఓ యువకుడు గురువారం రాత్రి అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ పై కూర్చున్న మరో వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని నర్సింగపురం తండా గ్రామానికి చెందిన బాదావత్ తిరుపతి తల్లి సుగుణమ్మకు జ్వరం రావడంతో పాలకుర్తిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న తల్లికి సుగుణమ్మకు తండాలోని ఇంటి దగ్గరి నుంచి భోజనం తీసుకొని తండాకు చెందిన తన స్నేహితుడు కేతావత్ నరేందర్ (27)తో కలిసి ఆస్పత్రికి వెళ్లాడు. తల్లికి భోజనం అందించాక తిరిగి గురువారం రాత్రి నరేందర్ తో కలిసి తిరుపతి ద్విచక్ర వాహనం పై ఇంటికి బయలుదేరాడు. బమ్మెర, రాఘవాపురం గ్రామాల మధ్య మరమ్మత్తు రావడంతో నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన ఆగి ఉన్న బోర్వెల్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కేతావత్ నరేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తిరుపతిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. తిరుపతి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపారు. ఇరువురు యువకులు వ్యవసాయం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తిరుపతికి భార్య మంజుల, కూతురు, కుమారుడు ఉండగా, నరేందర్ అవివాహితుడు. ఇరువురు మృతి చెందడంతో నర్సింగపురం తండాలో విషాదయ చాయలు అలుముకున్నాయి.

### పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబాల ఆందోళన

తమ కుమారులు బాదావత్ తిరుపతి, కేతావత్ నరేందర్ మృతికి బోరు బండి వాహనం యాజమాని కారణమంటూ వారి నిర్లక్ష్యం వల్లనే మృతి చెందారని ఆరోపిస్తూ. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట గిరిజన సంఘాలు, కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. సుమారు గంట పాటు గిరిజనులు అందోళన చేస్తుండగా కొంత మంది యువకులు పోలీస్ స్టేషన్లోకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. కొద్ది సేపు పోలీస్ స్టేషన్ అవరనలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సీఐ జానకీరాంరెడ్డి, ఎస్సై పవన్ కుమార్ గిరిజనులకు ఎంత నచ్చ చెప్పినప్పటికి ససేమిరా అంటూ బోరు బండి యాజమానుల నిర్లక్ష్యం వల్లనే తమ ఇద్దరు కుమారులు మృతి చెందారని న్యాయం జరిగేంత వరకు ఆందోళన విమరించేది లేదని భీష్మించుకూర్చున్నారు. తర్వాత బోరు బండి యాజమానులను పిలిచి వారితో చర్చలు జరిపారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

## కొప్పుల వెంకటేష్ మీద దాడి చేసిన బీజేపీ నేతలపై టిఆర్పీ ఫైర్

- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే దాడులా?
- దాడికి యత్నించిన బీజేపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి...
- గంగాధర పోలీస్ స్టేషన్‌లో టీఆర్‌పీ నేతల ఫిర్యాదు...
- టీఆర్పీ శ్రేణులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా..



గంగాధర (జనంసాక్షి) : తెలంగాణ రాజకీయాధికార పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్‌పై గురువారం రాత్రి బీజేపీ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాన్ పాషాతో పాటు చొప్పదండి నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేసారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీఆర్‌పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ భిన్నాభిప్రాయాలు సహజమని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, భౌతిక దాడులకు దారితీయడం ఏమాత్రం సహించబోమని అన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న టీఆర్‌పీ నాయకులపై దాడులు చేయడం ద్వారా తమ గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు. మహేష్ గాడ్సే లాంటి వారు కొంతమంది యూట్యూబ్ ఛానల్ యాంకర్లు యూట్యూబ్ వేదికగా పనిగట్టుకొని టిఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారిపై దుర్భర్షాలడడం సరికాదని, అలాంటి చిల్లర గాళ్లకు కేంద్రమంత్రి బండి సంజయ్ సపోర్ట్ చేయడం వారి కార్యాలయాల ప్రారంభోత్సవాలకు వెళ్లడం సిగ్గుచేటని మా నాయకుడు వెంకటేష్ ప్రశ్నించిన తీరులో తప్పేముందని అన్నారు. చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్‌పై జరిగిన దాడిని టీఆర్‌పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులందరూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, శాంతియుత వాతావరణంలో రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని, ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలను ఎదుర్కోలేకనే కొందరు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. తాను ప్రజల తరఫున ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై పోరాడటం ఆపేది లేదని స్పష్టం చేశారు. తనపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా గంగాధర మండల అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, యూత్ ప్రధాన కార్యదర్శి బండ గంగరాజు, శ్యామల అజయ్ కోడిమ్యాల మండల అధ్యక్షుడు దుబ్బాక అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మా జోలికి వస్తే రాజకీయ సమాధి తప్పదు

- మేమే డప్పులు కొడతాం.. దండోరా మోగిస్తాం
- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు మందుల సామేలు హెచ్చరిక

సూర్యాపేట, జూలై24 (జనంసాక్షి) : జిల్లా కాంగ్రెస్ రాజకీయంలో తీవ్ర సంచలనం చోటుచేసుకుంది. తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ సొంత పార్టీకి చెందిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయంలో కోమటిరెడ్డి సోదరుల వైఖరిని తప్పుబడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. మా జోలికొస్తే మీ రాజకీయ సమాధికి మేమే డప్పులు కొడతాం, మా దండోరా మోగుతుంది. అహంకార పూరితమైన రాజకీయాన్ని చావుదెబ్బ తీస్తాం' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ జిల్లా ఎవరి రాజ్యమూ కాదని, ఇది శ్రమజీవుల జిల్లా అని స్పష్టం చేస్తూ, తనతో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజల అభిమానంతోనే గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టామని ధీమా వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో తనకు సమాచారం లేకుండా పర్యటించడంపై ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తుంగతుర్తికి ఒక ఎమ్మెల్యే ఉన్నాడనే విషయం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తెలియడం లేదు. స్థానిక శాసనసభ్యుడినైన నాకు తెలియకుండా నా నియోజకవర్గానికి ఎలా వస్తారు? కనీస ప్రోటోకాల్ పాటించరా?' అని ప్రశ్నించారు. కోమటిరెడ్డికి ఎస్సీ నియోజకవర్గాలంటే చిన్నచూపని, మాదిగలపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. మాదిగలు ఎవరికీ బానిసలు కాదని స్పష్టం చేసిన ఆయన, ఇదే తరహా పద్ధతి కొనసాగితే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ గౌరవానికి భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని, అంతకు అంత ప్రతికారం తీర్చుకుంటామని సామేల్ హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై కూడా మందుల సామేల్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి ఎందుకు వెళ్లారో రాజగోపాల్ రెడ్డి ముందుగా సమాధానం చెప్పాలని నిలదీశారు. మునుగోడు నియోజకవర్గంలో రాజగోపాల్ రెడ్డి తీరుపై తమకు పూర్తి రిపోర్టు వచ్చిందని వ్యాఖ్యానించారు. నాయకులు తమ నియోజకవర్గాలపై దృష్టి సారిస్తే మంచిదని, ఎస్సీ స్థానాలైన తమ సీట్లపై ఇతరుల పెత్తనం ఏంటని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామం 5 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో పాటు 12 లక్షల రూపాయల తో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సామ్యూల్ పాల్గొన్నారు. 6 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమనికి ముఖ్య అతిదులుగా వచ్చి ప్రారంభోత్సవ కార్యక్రమం పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్ధమాన్ కోట గ్రామ సర్పంచ్ బుచ్చి బాబు ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట బిక్షం, మండల నాయకులు మండల సర్పంచులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు సహకరించాలి

- కాలిఫోర్నియా పర్యటనలో మంత్రి సీతక్క పిలుపు





హైదరాబాద్, జూలై24 (జనంసాక్షి) : పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న బాపూజీ స్ఫూర్తితో ప్రవాసులు తెలంగాణ గ్రామీణాభివృద్ధికి సహకరించాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కోరారు. కాలిఫోర్నియా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్‌లో ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. సీఎం కృషికి చేయూతగా ప్రవాసులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మహిళల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఢిల్లీలో సీజేపీ విద్యార్థులకు మద్దతుగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి, ఓవర్‌సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు సందీప్ వంగల, నెమలి మాధవ, శ్రీనివాస్ రామసహాయం, గూడూరు రవీందర్ రెడ్డి, గీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడికి ఖండన

- తెలంగాణ జన సమితి కొమురం భీం జిల్లా కమిటీ

కొమరంభీం ఆసిఫాబాద్ (జనంసాక్షి) : ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై విచక్షణారహితంగా పోలీసులతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న దాడిని తెలంగాణ జన సమితి కొమురం భీం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. జిల్లా అధ్యక్షులు తలాండి మధుకర్ మాటా&ుడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ నీట్ పరీక్ష పత్రాల లీకేజీ కి బాధ్యుడు అయినా,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయించాల్సిన కేంద్ర ప్రభుత్వం, విద్యార్థుల పట్ల పాశవికంగా వ్యవహరించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి విద్యార్థి లోకానికి వెంటనే క్షమాపణ చెప్పి ఆందోళన చేస్తున్న విద్యార్థులతో చర్చించి ఆందోళనను విరమింప చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుడ్మేత శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మందడే దేవ్ రావు, ఉపాధ్యక్షులు మడావి కేశవ రావు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

- నిర్మల్ జిల్లా వాసి దుర్మరణం



నిర్మల్, జూలై 24 (జనం సాక్షి) : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన నిర్మల్ జిల్లా లక్ష్మణ చాంద మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన నిత్యానంద రెడ్డి (24) చికిత్స పొందుతూ మృతి చెందారు. మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో ఉంటున్న నిత్యానందరెడ్డి ఈనెల 18న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన అతడిని స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించారు. జులై 23న నిత్యానందరెడ్డి పుట్టినరోజు కావడంతో అతని స్నేహితులు ఆసుపత్రి బెడ్ పైనే పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాసేపటి తర్వాత పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పుట్టినరోజు నాడే కన్నుమూయడంతో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మూడేళ్ల క్రితం ఎమ్మెస్ చేసేందుకు యూఎస్ వెళ్లిన నిత్యానందరెడ్డి ఇటీవలే ఉద్యోగంలో చేరినట్లు తెలిసింది. మృతదేహం త్వరగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఫ్లయింగ్ బోర్డర్ కన్‌సెల్టెన్సీపై ఫిర్యాదు

హైదరాబాద్, జూలై24 (జనంసాక్షి) : విదేశాల్లో ఉద్యోగాల పేరిట భార్యాభర్తలు పలువురిని మోసం చేశారు. తమను మోసం చేశారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. విజయవాడకు చెందిన సౌజన్య, శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బేగంపేటలో ఫ్లయింగ్ బోర్డర్ కన్స్‌టలెన్సీ ఏర్పాటు చేసి నిరుద్యోగులను టార్గెట్ చేశారని బాధితులు ఆరోపించారు. ఒక్కొక్కరి నుంచి రూ.4లక్షల నుంచి రూ.14లక్షల వరకు వసూలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2వేల మంది వరకు బాధితులు ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే తరహా కేసులో గతవారం విజయవాడలో వారిద్దరూ అరెస్టయ్యారని.. బెయిల్‌పై వచ్చి యువతను మోసం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 జూలై 2026

# నష్టం జరిగాక మేల్కొనే నిర్వాకం

సంపాదకీయం


చేతులు కాలాక ఆకులు పట్టుకున్న సామెత నీట్ వ్యవహారంలో అక్షరాలా నిజమవుతోంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్ష వరుస లీకేజీలతో విశ్వసనీయత కోల్పోతుంటే, ఇప్పుడు కఠిన చట్టం తీసుకొస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఆలస్యంగా వచ్చిన స్పందనగానే కనిపిస్తోంది. ప్రశ్నపత్రాలు లీకై విద్యార్థుల కలలు చిద్రమైన తర్వాత చట్టాల గురించి మాట్లాడటం, ప్రమాదం జరిగాక తాళాలు వేయడంలా ఉంది.

ఇప్పటివరకు 150కిపైగా ప్రశ్నపత్రాలు లీకైనట్లు వివిధ సందర్భాల్లో నివేదికలు వెలువడ్డాయి. అయినా ఈ కుంభకోణాల వెనుక ఉన్న అసలు సూత్రధారుల్లో ఎంతమందికి కఠిన శిక్ష పడింది? ఎంతమంది ఉన్నతాధికారులు జవాబుదారీతనం వహించారు? ప్రతి లీకేజీ తర్వాత విచారణ కమిటీలు, ప్రకటనలు, హామీలు.. చివరకు మౌనమే. ఇదే వ్యవస్థకు అలవాటైపోయింది.

ఒకప్పుడు ఈ దేశంలో నైతిక బాధ్యత అనే విలువ ఉండేది. రైలు ప్రమాదం జరిగితే కేంద్ర మంత్రులు రాజీనామా చేసిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ ఘటనలో అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేశారు. నేడు మాత్రం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు పణంగా పెట్టిన ఘటనల్లో కూడా పదవులు కదలవు, బాధ్యత తీసుకునేవారు కనిపించరు. ఇదే రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో వచ్చిన విలువల పతనానికి నిదర్శనం.

కఠిన చట్టం తీసుకురావడం స్వాగతించదగినదే. కానీ నష్టం జరిగాక చట్టాలు తీసుకురావడం కాదు, నష్టం జరగకుండా వ్యవస్థను కాపాడటమే ప్రభుత్వ అసలు బాధ్యత. పరీక్షలు రద్దు కావడం, మళ్లీ పరీక్షలు రాయాల్సి రావడం, మానసిక ఒత్తిడి, ఆర్థిక భారం.. ఇవన్నీ భరించిన లక్షలాది మంది విద్యార్థులకు న్యాయం ఎవరు చేస్తారు? వారి కోల్పోయిన సమయాన్ని, అవకాశాలను ఎవరు తిరిగి ఇస్తారు? చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, తప్పు చేసిన వారికి శిక్ష లేకపోతే అవి కాగితాలకే పరిమితమవుతాయి. జవాబుదారీతనం లేని పాలనలో కొత్త చట్టాలు ప్రజల్లో విశ్వాసాన్ని కలిగించలేవు. నిజమైన సంస్కరణ అంటే భవిష్యత్తులో లీకేజీలను అరికట్టడమే కాదు; గత వైఫల్యాలకు కారణమైన వారిని చట్టం ముందు నిలబెట్టడం కూడా. లేకపోతే ప్రతి లీకేజీ తర్వాత కొత్త హామీలు, కొత్త చట్టాలు, కొత్త ప్రకటనలు.. కానీ పాత నిర్లక్ష్యమే కొనసాగుతుంది.

## కాలంతో !



ఎప్పుడో
పచ్చిమాంసం
తిన్నారు!
ఇప్పుడు
తింటారా?
ఎప్పుడో
కొండగుహల్లో
నిద్రించారు!
ఇప్పుడు
నిద్రిస్తారా?
నీటికోసం
నదీతీరాల్లో
ఇళ్ల నిర్మాణం!
ఇప్పుడు
నిర్మిస్తారా?
గుర్రం నాటి
ప్రయాణ
సాధనం!
ఇప్పుడు
ప్రయాణిస్తారా?
రూపాయి (డబ్బు)
లేని రోజుల్లో
వస్తువులు
ఇచ్చిపుచ్చుకునే
బార్టర్ విధానం
ఇప్పుడుఉందా?
అన్నిరంగాల్లో
మార్పు
సహజం!
మారింది!
మారుతుంది!
ఆచారాలు
కట్టుబాట్లు
ఆకాలానికి
అనుగుణంగా
మారతాయి!
సనాతనం
గతించినకాలం!
ఆధునికం
అభివృద్ధి
చెందినకాలం!
సనాతనం
అనేవాళ్లెవరు?
అభివృద్ధిని
ఆటంకంగా
భావించేవాళ్ళు!
సనాతనమంటే
సంకుచితం
స్వార్థపరత్వం
వర్ణ వ్యవస్థ
వెనక్కిపోవటం!
అదేదో గొప్ప
ఆధ్యాత్మిక భావంగా
అబద్ధాలు చెప్పి
జనాన్ని బానిసల్ని
చేసుకోవటం!
అబద్ధాలుఛేదించి
అందరం కలిసి
'ఆధునికానికి'
పయనిద్దాం!
'కాలంతో'జీవిద్దాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# విద్యకు బొట్టు పెట్టాలా...?



తెలంగాణలో కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల చేసిన వాక్య రాజకీయ చర్చకు దారితీసింది. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాఠశాలల్లో చదివే అమ్మాయిలకు బొట్టు, గాజులు తప్పనిసరి చేస్తామని ఆయన చెప్పినట్లు వార్తలు వచ్చాయి. సహజంగానే దీనిపై అనుకూల, ప్రతికూల స్పందనలు వచ్చాయి. కానీ ఈ చర్చను కేవలం బొట్టు అనుకూలంబి వ్యతిరేకం అనే స్థాయిలో అర్థం చేసుకోవడం సరిపోదు. ఎందుకంటే ఇక్కడ అసలు ప్రశ్న బొట్టు గురించి కాదు. విద్యా వ్యవస్థ పై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తం అవుతున్న ఈ సమయంలో ఒక రాజకీయ దృక్పథానికి ముందుగా బొట్టు ఎందుకు గుర్తుకు వచ్చింది అనేది. పదాలు యాదృచ్ఛికంగా బయటపడవచ్చు.కానీ ప్రతీకలు యాదృచ్ఛికంగా పుట్టవు. ఎందుకంటే అవి మాటలకంటే లోతుగా పనిచేసే ఒక భావజాలపు మానసిక వేలిముద్రలు..

ఈ వ్యాఖ్యలను కేవలం బండి సంజయ్ వ్యక్తిగత అభిప్రాయంగా చూడలేం. రాజకీయ నాయకులు చాలాసార్లు తమను కాదు, తమ వెనుక నిలబడి ఉన్న భావజాలాన్ని మాట్లాడుతుంటారు. బిజెపి బిఆర్ఎస్ఎస్ ఆలోచనా ప్రపంచంలో విద్య కేవలం జ్ఞానం బదిలీ ప్రక్రియ కాదు. ఒక సనాతన సామాజిక కథనాన్ని, సాంస్కృతిక చిహ్నాన్ని, ఒక గుర్తింపు నిర్మాణాన్ని తరతరాలకు అందించే సాధనం కూడా. అందుకే విద్యా చర్చల్లో సంస్కృతి సంప్రదాయం, మత చిహ్నాలు ప్రవేశిస్తాయి. ఈ కోణంలో చూస్తే బొట్టు అనేది ఒక అలంకార వస్తువు కాదు.ఒక రాజకీయ సాంస్కృతిక ప్రతీక.

తెలంగాణ రాజకీయాల ప్రస్తుత నేపథ్యంలో ఈ వాక్యకు మరో అర్థం కూడా కనిపిస్తుంది. జిహెచ్ఎంసి ఎన్నికల వాతావరణం, సామాజిక సమీకరణల కోసం జరగబోయే పోటీ, సాంస్కృతిక గుర్తింపుల చుట్టూ రాజకీయ చర్చలను నిర్మించే ప్రయత్నాలు, ఇవన్నీ ఈ వాక్యను ఒక రాజకీయ సంకేతంగా చదవాలని సూచిస్తున్నాయి. ఎందుకంటే రాజకీయాలు కేవలం అధికారాన్ని గెలుచుకోవడానికి మాత్రమే పోరాడవు.ఒక సామూహిక రాజకీయ ప్రతీకాత్మను నిర్మించడానికి కూడా పోరాడుతాయి. ప్రతి రాజకీయ భావజాలం తన అనుచరులను ఒక నిర్దిష్ట గుర్తింపు చుట్టూ సమీకరిస్తుంది అందుకే ఆ రాజకీయ సమీకరణకు కొన్ని ప్రతీకలు అవసరం అవుతాయి.

రాజకీయ మనోవిజ్ఞాన శాస్త్రం ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెబుతుంది. సమస్యలు మనుషులను ఆలోచింపజేస్తాయి. ప్రతీకలు ప్రజలను సమీకరిస్తాయి. నిరుద్యోగం, విద్యానాన్యత,పాఠశాల మౌలిక వసతులు,ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలు విశ్లేషణను కోరుతాయి. కానీ బొట్టు, దుస్తులు,గుర్తింపులు భావోద్వేగాలను రేకెత్తిస్తాయి. అందుకే రాజకీయాలు చాలాసార్లు వాస్తవాల భాష కంటే ప్రతీకల భాషను ఎక్కువగా ఆశ్రయిస్తాయి. ఎందుకంటే వాస్తవాలు మెదడుతో సంభాషిస్తే ప్రతీకలు అంతర్మనసుతో సంభాషిస్తాయి. అయితే ప్రతీకల రాజకీయాలను కేవలం ఎన్నికల వ్యూహంగా మాత్రమే అర్థం చేసుకుంటే సరిపోదు. అధికారం ముందుగా భూభాగాలను ఆక్రమించదు. మానసిక భూభాగాలను ఆక్రమిస్తుంది. చట్టాలు,పరిపాలన తర్వాత వస్తాయి. ముందుగా ఒక ఆలోచనా చట్రం ఏర్పడుతుంది ఆ చట్రంలో కొన్ని ప్రతీకలు సహజమైనవిగా, కొన్ని విలువలు పవిత్రమైనవిగా, కొన్ని గుర్తింపులు సహజ సత్యాలుగా కనిపించడం ప్రారంభమవుతుంది. ప్రతి అధికారం తనను తాను కేవలం చట్టాల ద్వారా కాకుండా చిహ్నాత్మక అధికారాల ద్వారా కూడా పునరుత్పత్తి చేసుకుంటుంది.

అందుకే ప్రతి రాజకీయ భావజాలం పాఠశాలను తన భవిష్యత్తు ప్రయోగశాలుగా చూస్తోంది. పాఠశాల అనేది కేవలం విద్యాసంస్థ కాదు.సమాజం తన భవిష్యత్తును నిలువచేసే మానసిక గిడ్డంగి.నేటి పిల్లల మనసుల్లో నాటిన ఊహలే రేపటి రాజకీయ సంస్కృతిగా, సామాజిక విలువలుగా, పౌర చైతన్యంగా రూపాంతరం చెందుతాయి. అందువల్ల విద్య గురించి జరిగే ప్రతి చర్చ వాస్తవానికి భవిష్యత్తు గురించి జరిగే చర్చే.

ఇక్కడే విద్యపై రెండు తత్వాలు ఎదురుగా నిలుస్తాయి. విద్య ఒక్క పిల్లవాడిని ప్రపంచానికి మరింత తెరువాలా? లేక ఒక నిర్దిష్ట గుర్తింపులో మరింత బలంగా నిలబెట్టాలా?గొప్ప విద్య సమాధాలను బోధించదు. ప్రశ్నలను పుట్టిస్తుంది.విధేయతను తయారు చేయదు.స్వతంత్ర ఆలోచనను పెంచుతుంది. ఎందుకంటే విద్య యొక్క అసలు లక్ష్యం ఒక సిద్ధమైన ప్రపంచాన్ని అంగీకరించడం కాదు. ప్రపంచాన్ని కొత్తగా చూడగలిగే మానసిక స్వేచ్ఛను కల్పించడం.

పిల్లల నుదుటిపై ఏమీ ఉండాలి అనే ప్రశ్న అడిగే ముందు వారి మనసులో ఏమీ ఉండాలి అనే ప్రశ్న అడగాలి. ఎందుకంటే ఒక సమాజం యొక్క భవిష్యత్తును నిర్ణయించేది బాహ్య గుర్తింపులు కావు. అంతర్గత చైతన్యం. నుదుటిపై కనిపించేది సంస్కృతి కావచ్చు. కానీ మనసులో పెరిగేది వ్యక్తిత్వం. విద్య యొక్క అసలు పని ఒక గుర్తింపును కాపాడడం కాదు. ఒక మనిషిని నిర్మించడం. అందుకే ఈ చర్చ చివరికి బొట్టు గాజుల గురించి కాదు. విద్యకు సంబంధించిన అసలు ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని ఏ వైపుకు మళ్లిస్తున్నారు అనేదాని గురించి. ఒక సమాజం తన పిల్లలకు ఏమి ధరించాలో చెప్పడం సులభం. ఏమి ఆలోచించాలో చెప్పడం కూడా సులభం. కానీ ఎలా ఆలోచించాలో నేర్పడమే విద్య యొక్క అసలు బాధ్యత. నుదుటిపై కనిపించే గుర్తులు ఒక కాలానికి చెందినవి.ప్రశ్నించే చైతన్యం కాలాలను దాటుతుంది.అందుకే చరిత్ర చివరికి మనుషులు ఏమి ధరించారు అని కాదు. వారు ఎలా ఆలోచించారు అని గుర్తుంచుకుంటుంది.



**ఆయిరబోయిన బిక్షపతి. (అగల్ జోయా).**
**7993248717.**

# చట్టాన్ని అతిక్రమించి ఇంటర్నెట్ నిలిపివేత: భద్రత పేరుతో స్వేచ్ఛకు తాళం?

పజాస్వామ్యంలో చట్టబద్ధమైన శాంతియుత నిరసన ఎంత ముఖ్యమో, సమాచార ప్రసారం కూడా అంతే ప్రాథమికమైనది. ఆధునిక కాలంలో ఇంటర్నెట్ కేవలం వినోద సాధనం కాదు. అది భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాచార హక్కు, విద్య, ఉపాధి, వ్యాపారం, బ్యాంకింగ్, అత్యవసర సేవలు, పౌర భాగస్వామ్యానికి వెన్నెముకగా మారింది. అలాంటి పరిస్థితిలో ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నిరసనల సందర్భంగా ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, దాని చట్టబద్ధత, అవసరం, నిష్పాక్షికతపై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. భద్రత అవసరమే అయినప్పటికీ, దానికి ఎంచుకునే మార్గం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉందా అనే ప్రశ్న మరింత కీలకమైంది.

భారత రాజ్యాంగం భావ ప్రకటనా స్వేచ్ఛ, సమావేశ స్వేచ్ఛ, సమాచార హక్కును పౌరులకు కల్పించింది. డిజిటల్ యుగంలో ఈ హక్కులు ఇంటర్నెట్‌తో విడదీయరాని సంబంధాన్ని ఏర్పరచుకున్నాయి. అందుకే ఇంటర్నెట్‌ను నిలిపివేయడం అనేది కేవలం సాంకేతిక నిర్ణయం కాదు. అది పౌర హక్కులపై ప్రత్యక్ష ప్రభావం చూపే పరిపాలనా చర్య. అందువల్ల అలాంటి నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రభుత్వం అత్యంత జాగ్రత్త, పారదర్శకత, చట్టబద్ధమైన సమర్థన చూపాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది.

భారతదేశంలో ఇంటర్నెట్ నిలిపివేతకు చట్టపరమైన ఆధారం ప్రధానంగా 2017లో రూపొందించిన టెలికాం సేవల తాత్కాలిక నిలిపివేత నిబంధనలు. ప్రజా భద్రత లేదా అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే ఈ అధికారాన్ని వినియోగించాలని చట్టం చెబుతుంది. అయితే "ప్రజా భద్రత" లేదా "అత్యవసర పరిస్థితి" అనే పదాలకు స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల వాటిని ఎవరి ఇష్టానికి వారు సొంత అర్థాలు చెప్పుకొని విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. ఫలితంగా అసాధారణ పరిస్థితుల కోసం ఉద్దేశించిన అధికారాలు కొన్నిసార్లు సాధారణ నిరసనల సందర్భాల్లో కూడా ఉపయోగిస్తున్నారనే విమర్శలు కనిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు 2020లో అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పు అత్యంత ప్రాధాన్యమైనది. నిరవధికంగా ఇంటర్నెట్ నిలిపివేయడం చట్టబద్ధం కాదని, ప్రతి ఆదేశం అవసరం, అత్యవసర కారణాలతో, పరిమిత కాలవ్యవధి వంటి ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, ప్రభుత్వం జారీ చేసే నిలిపివేత ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వాటిపై న్యాయపరమైన సమీక్షకు అవకాశం ఉండాలని కూడా పేర్కొంది. అంటే ఇంటర్నెట్ నిలిపివేత ప్రభుత్వ విచక్షణాధికారంగా కాకుండా రాజ్యాంగపరమైన పరీక్షకు లోబడి ఉండాల్సిన చర్యగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే ఆచరణలో ఈ ప్రమాణాలు అమలవుతున్నాయా అనే ప్రశ్నకు లేదు అనే సమాధానం ఎదురవుతోంది. చాలా సందర్భాల్లో ఉత్తర్వులు ఆలస్యంగా బయటకు రావడం, కారణాలు స్పష్టంగా వెల్లడించకపోవడం, ప్రభావిత ప్రాంతాల పరిమితిని ఖచ్చితంగా వివరించక పోవడం వంటి అంశాలు పారదర్శకత లోపాన్ని సూచిస్తున్నాయి. సమాచార ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయడం కొన్నిసార్లు సమస్యను తగ్గించకుండా మరింత సంక్లిష్టం చేసే అవకాశమూ ఉంటుంది.

ఇంటర్నెట్ నిలిపివేత ప్రభావం కేవలం నిరసనకారులపైనే ఉండదు. ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ చెల్లింపులు, ఆసుపత్రుల సేవలు, అత్యవసర సమాచార మార్పిడి, చిన్న వ్యాపారాలు, ఫ్రీలాన్సర్లు, గిగ్ వర్కర్లు, ఈ-కామర్స్ వ్యవస్థలు అన్నీ దెబ్బతింటాయి. డిజిటల్ ఇండియా లక్ష్యాలను ప్రకటిస్తున్న దేశంలో, అదే సమయంలో తరచూ ఇంటర్నెట్ నిలిపివేతలను ఆశ్రయించడం విధానపరమైన వైరుధ్యాన్ని బయటపెడుతోంది.

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ నిలిపివేతల విషయంలో భారతదేశం తరచూ అత్యధిక సంఖ్యలో నమోదవుతున్న దేశాలలో ఒకటిగా స్వతంత్ర పరిశీలనా సంస్థలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా "యాక్సెస్ నౌ " వంటి సంస్థల నివేదికలు భారతదేశంలో ఇటువంటి చర్యలు ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోలిస్తే అధికంగా నమోదవుతున్నాయని సూచించాయి. ప్రతి నిలిపివేతతో ఆర్థిక వ్యవస్థకు కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాదు, దేశం పెట్టుబడులకు అనుకూలమైన డిజిటల్ గమ్యస్థానమనే ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుంది.నిజానికి ప్రజా శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వ బాధ్యతే. కానీ ఆ బాధ్యత పేరుతో మొత్తం ప్రాంత ప్రజలను డిజిటల్ చీకటిలోకి నెట్టడం చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి. ప్రమాదం ఉన్న నిర్దిష్ట ప్రాంతాలు, నిర్దిష్ట సేవలు లేదా నిర్దిష్ట కాలవ్యవధికి మాత్రమే పరిమితమైన లక్ష్యం కోసం, పరిమిత ద్దేశ్యం కోసమే చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి మరింత అనుకూలమైన మార్గం.

ఢిల్లీ ఘటన మరోసారి ఒక మౌలిక ప్రశ్నను ముందుకు తెచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి అసమ్మతిని నియంత్రించే అధికారం ఉందా, లేక శాంతియుతంగా వ్యక్తమయ్యే అసమ్మతిని రక్షించే బాధ్యత ఉందా? భద్రత, స్వేచ్ఛ రెండూ పరస్పర విరుద్ధ అంశాలు కావు. ఒకటి కోసం మరొకటి త్యాగం చేయాల్సిన అవసరం లేదు. చట్టబద్ధమైన, పారదర్శకమైన, ప్రతిపాధిత నిర్ణయాల ద్వారానే ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధ్యమవుతుంది. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్‌ను ఇష్టం వచ్చినట్టు పోలీసుల సూచనతో నిలిపివేయడం అనేది కేవలం ఒక సాంకేతిక బటన్ నొక్కడం కాదు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

## హమ్ దేకేంగే

మా కూలిన ఆశలు
చినిగిపోయిన యే పుస్తకంలో
యే పుటలో ఉన్నాయో!!
అక్షరాలమై వెతుకుతున్నము

మా కలల కోరికల సౌధాల విలువను
యే తరాజులో వేసి
తూకం వేస్తారు?
బలైన విద్యార్థుల మనోవేధనకు
తల్లిదండ్రుల ఆక్రందనలకు
మూల్యం ఎవరు చెల్లిస్తారు?
ఆగిపోయిన బతుకు మాటేమిటి?

అచ్చే దిన్ యాడ అగుపడ్తలేదు
ప్రతీ పరీక్షలో జరుగుతున్న విలువల దోపిడీనీ
యెంతకని యేండగడ్తం?

దేశాన్ని పట్టి పీడిస్తున్న
అవినీతి చీడ పురుగులకు
యే మందులు వెయ్యాలో
మేమే చెప్పాలా ?
సరైన సమయంలో
ఒక్క కుట్టు వేస్తే
మానిపోయే గాయాన్ని
రాజకీయ ఉపేక్షలతో
అధికార దాహంతో పెంచింది
నాయకులు కదా??

చివ్వున చిందిన మా రక్తం
న్యాయం కోసం ఆక్రోశిస్తుంది
బ్యారికెడ్ల మధ్య చిరిగిన మా చొక్కాలు
రాజ్యం అమానుషత్వాన్ని
తేటతెల్లం చేస్తున్నాయి
మా గుండెల పై పడిన
ఇనుప పాదాలముద్రలు
ఏలికల నిరంకుశత్వాన్ని
చెప్పకనే చెప్తున్నాయి

చెల్లాచెదురైన మా భవితకు
న్యాయం జరిగే వరకు
మా నిరసనగరాలు
దేశం నలుమూలల
ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి

**అనిత కృష్ణ గండమళ్ళ**

# ప్రజాస్వామ్యం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయా!

"ప్రజల గొంతు మూగబోతే.. ప్రజాస్వామ్యం కూడా మౌనమవుతుంది."

ప్రజాస్వామ్యం అనేది ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల పండుగ మాత్రమే కాదు. ఓటు వేసిన తర్వాత ప్రజల గొంతుకు విలువ లేకపోతే, ప్రశ్నించే హక్కు బలహీనపడితే, అధికారాన్ని నిలదీసే వేదికలు క్రమంగా మూతపడితే, ప్రజాస్వామ్యం రూపం మాత్రమే మిగులుతుంది; ఆత్మ కనుమరుగవుతుంది. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన స్వేచ్ఛలు, హక్కులు, సమానత్వం, న్యాయం కేవలం పుస్తకాలకే పరిమితమైతే ప్రజాస్వామ్య వ్యవస్థ తన అసలు ఉద్దేశాన్ని కోల్పోతుంది.

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతిపక్షాలపై విచారణ సంస్థల చర్యలు, మీడియాపై పెరుగుతున్న ఒత్తిళ్లు, సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేసిన వారిపై నమోదవుతున్న కేసులు, నిరసనలకు పరిమితులు, ప్రజా ఉద్యమాలపై కఠిన వైఖరి, ప్రజా సమస్యలపై ప్రశ్నించే స్వరాలను దేశద్రోహం లేదా శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరించే ధోరణి వంటి పరిణామాలు ప్రజాస్వామ్య ఆరోగ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అధికారంలో ఎవరున్నా, అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు అనే విషయాన్ని మరువరాదు.



### ప్రజాస్వామ్యానికి ఐదు మూలస్తంభాలు

ప్రజాస్వామ్యం నిలబడేది కేవలం ప్రభుత్వం మీద కాదు. ప్రజల విశ్వాసం, రాజ్యాంగం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, బాధ్యతాయుతమైన మీడియా, బలమైన ప్రతిపక్షం అనే ఐదు మూలస్తంభాల మీద అది ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం ప్రజల విమర్శలను వినాలి. ప్రతిపక్షాలకు అడ్డంకులు కాకుండా అవకాశాలు కల్పించాలి. మీడియా భయపడకుండా ప్రశ్నించగలగాలి. పోలీసులు చట్టానికి మాత్రమే విధేయులుగా ఉండాలి. న్యాయస్థానాలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరించాలి. ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక గొప్ప సత్యం ఏమిటంటే-ప్రజాస్వామ్యాలు ఒక్కరోజులో కూలిపోవు; సంస్థలు ఒక్కొక్కటిగా బలహీనపడినప్పుడు అవి లోపల నుంచే క్షీణిస్తాయి. అందుకే రాజ్యాంగ వ్యవస్థలను బలోపేతం చేయడం ప్రతి ప్రభుత్వానికీ మొదటి బాధ్యత కావాలి.


### అధికారం శాశ్వతం కాదు- ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు

చరిత్రను తిరగేస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. అధికారాన్ని శాశ్వతమని భావించిన ఎన్నో ప్రభుత్వాలు ప్రజల తీర్పు ముందు నిలవలేకపోయాయి. అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) నుంచి ప్రపంచంలోని అనేక దేశాల రాజకీయ పరిణామాల వరకు ఇదే పాఠం చెబుతున్నాయి. అధికారం ఎంత బలంగా కనిపించినా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే అది ఎక్కువకాలం నిలవదు. నేటి యువత సమాచార యుగంలో జీవిస్తోంది. ఒక సంఘటన దేశంలోని ఒక మూలలో జరిగినా క్షణాల్లో ప్రపంచానికి చేరుతోంది. ఆలోచనలను, అభిప్రాయాలను, ప్రశ్నలను శాశ్వతంగా అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదు. అధికారంతో గొంతులను కొంతకాలం నొక్కివేయొచ్చు; కానీ ఆలోచనలను బంధించలేరు. ప్రతి నిరోధం ఒక కొత్త ప్రశ్నను పుట్టిస్తుంది. ప్రతి అన్యాయం ఒక కొత్త ఉద్యమానికి విత్తనమవుతుంది.

### ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సింది అందరి బాధ్యత

ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కేవలం న్యాయస్థానాలదీ, మీడియాదీ, ప్రతిపక్షాలదీ మాత్రమే కాదు. ప్రతి పౌరుడిది కూడా. ఓటు వేయడం మాత్రమే ప్రజాస్వామ్య బాధ్యత కాదు; ప్రశ్నించడం, చట్టాన్ని గౌరవించడం, విభిన్న అభిప్రాయాలను సహించడం, అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం, రాజ్యాంగ విలువలను కాపాడడం కూడా అంతే ముఖ్యమైనవి.

ప్రజల మౌనం కొన్నిసార్లు అధికార దుర్వినియోగానికి బలం ఇస్తుంది. అదే ప్రజల చైతన్యం ప్రజాస్వామ్యానికి కవచంగా నిలుస్తుంది. ప్రజాస్వామ్యంలో విభేదాలు శత్రుత్వం కాదు; అవి అభివృద్ధికి అవసరమైన చర్చకు నాంది. విమర్శలను అణచివేయడం కన్నా వాటిని వినడం ప్రభుత్వాలకు బలం చేకూరుస్తుంది.ప్రజాస్వామ్యానికి అతిపెద్ద శత్రువు విమర్శ కాదు; మౌనం. అధికారానికి అతిపెద్ద బలం భయం కాదు; ప్రజల విశ్వాసం. అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే రాజ్యాంగాన్ని గౌరవించే పాలకులు,ప్రశ్నించే ప్రతిపక్షం, నిర్భయమైన మీడియా,స్వతంత్ర న్యాయవ్యవస్థ,చైతన్యవంతమైన పౌర సమాజం:ఈ ఐదూ సమానంగా బలపడాలి.ఎన్నికల్లో గెలవడం పాలనకు అర్హతనిస్తే..ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకో వడమే ప్రజాస్వామ్యానికి అసలైన విజయపతాకం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది అధికారం మాత్రమే కాదు..అప్రమత్తమైన ప్రజలే.



**మేకిరి దామోదర్**
**సామాజిక విశ్లేషకులు**
**వరంగల్ 9573666650**

# వార్తల వెనుక దాగున్న సత్యం

ఏదైనా ఒక దేశం ప్రజాస్వామ్య మార్గంలో పయనిస్తోందో లేదో చెప్పడానికి అక్కడి పత్రికా స్వేచ్ఛ, ప్రజా సమస్యల పట్ల మీడియా స్పందించే తీరే ప్రధాన సూచిక. పాలకవర్గాల తప్పులను ఎండగడు తూ, సామాన్య పౌరుడి గొంతుకగా నిలవాల్సిన బాధ్యత ప్రసార మాధ్యమాలపై ఉంది. అయితే, నేడు భారతదేశంలో క్షేత్రస్థాయిలో ఐదు ప్రధానమైన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చుతున్నప్పటికీ, వాటిని ప్రజాబాహుళ్యానికి చేరవేయడంలో ప్రధాన స్రవంతి మీడియా దృష్టి సారించలేకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే ముప్పుగా పరిణమిస్తోంది. దేశరాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపడుతున్న నిరసనలు మన విద్య వ్యవస్థలోని లోపాల ను బహిర్గతం చేస్తున్నాయి. దేశంలో అత్యంత కీలకమైన 'నీట్'

పారదర్శకత లోపించడం, విద్యా వ్యవస్థ వైఫల్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడింది. ఈ క్రమంలో విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని విద్యార్థులు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నప్పటికీ, వారి ఆక్రోశం వార్తా కథనాల్లో సరిపడా చోటు చేసుకోకపోవడం శోచనీయం. మరొకవైపు, పారిశ్రామికంగా ముందంజలో ఉన్న గుజరాత్‌లో రైతుల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం తమ సారవంతమైన భూముల గుండా పెద్ద ఎత్తున విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయడాన్ని రైతులు వ్యతిరేకిస్తు న్నారు. తమ ఉపాధిని, జీవనాధారమైన భూములను బలిపెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న తీరుపై గుజరాత్ రైతులు తిరగబడుతున్నారు. పారిశ్రామికాభివృద్ధి పేరిట గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు. పర్యావరణం దృష్ట్యా చూస్తే, ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్వర్ ప్రాంతంలో మౌలిక వసతుల విస్తరణ పేరిట ప్రకృతి విధ్వంసం జరుగుతోంది. కేవలం 19 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ కోసం దాదాపు 4,369 సాల్ వృక్షాలను నరికివేసేం దుకు సిద్ధమయ్యారు. ఇక్కడ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు లేకపోయి నా చెట్లను కూల్చివేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేత వల్ల అకస్మాత్తుగా వచ్చే వరదలు పెరగడ మే కాకుండా, ఏనుగుల సంరక్షణ కారిడార్ ధ్వంసమై మానవ-మృగ వివాదాలు పెరిగే ప్రమాదం ఉంది. అభివృద్ధి పేరిట ప్రకృతి సమతు ల్యతను దెబ్బతీయడం భావి తరాలకు శరాఘాతంగా మారనుంది.

ఇక సాంస్కృతిక, సామాజిక కోణంలో పరిశీలిస్తే, మధ్యప్రదేశ్‌లో చేపడుతున్న 'కేన్-బెత్వా' నదుల అనుసంధాన ప్రాజెక్టు వల్ల పదుల సంఖ్యలో గిరిజన గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. నివసించడానికి ప్రత్యామ్నాయం చూపకుండా, జీవనోపాధిని దెబ్బతీస్తూ తమను నిర్వాసితులను చేయడంపై గిరిజనులు గళమెత్తుతున్నారు. తరతరా లుగా వస్తున్న వారి సంస్కృతిని, జీవన విధానాన్ని ధ్వంసం చేయడం తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. అదేవిధంగా, ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో సుదీర్ఘకాలంగా అశాంతి వాతావరణం నెలకొని ఉంది. అక్కడ ప్రజలు కాగడాల ప్రదర్శనలతో తమ నిరసన ను వ్యక్తం చేస్తూ శాంతిభద్రతల పునరుద్ధరణను కోరుకుంటున్నారు. స్థానిక, రాష్ట్ర, కేంద్ర స్థాయుల్లో ఒకే కూటమి పరిపాలన ఉన్నప్పటికీ, ఒక చిన్న రాష్ట్రంలో నెలకొన్న సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడం పరిపాలనా లోపాలకు స్పష్టమైన నిదర్శనం. ఈ పరిణామాలన్నీ పరిశీలిస్తే, దేశంలోని విద్యార్థులు, రైతులు, పర్యావరణవేత్తలు, గిరిజనులు తమ మనుగడ కోసం, ప్రాథమిక హక్కుల కోసం రోడ్డెక్కి పోరాడుతున్న వైనం స్పష్టమవు తోంది. అయితే, ప్రజా సమస్యలను విస్తృతంగా వెలుగులోకి తేవలసిన బాధ్యత ప్రసార రంగంపై ఎంతైనా ఉంది. క్షేత్రస్థాయి యదార్థాలు వెలుగులోకి వచ్చినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పునర్వైభవం పొందుతుంది.



**రాజేందర్ దామెర (దారా) జర్నలిస్ట్**
rajenderdamera@
mail.com

# వసతి లేక గిరిజన విద్యార్థినుల డ్రాపౌట్స్

## హాస్టల్ ఏర్పాటు చేయాలంటూ వినతి



గద్వాల, జులై, 24(జనంసాక్షి) : జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన ట్రైబల్ బాలికల హాస్టల్‌ను తక్షణమే మంజూరు చేయాలని పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి ఆయన ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీరెల్లి దానయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి పాఠశాల, కళాశాల విద్య కోసం గద్వాలకు వచ్చే గిరిజన విద్యార్థినులకు సురక్షితమైన వసతి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి లేకపోవడం వల్ల చాలా మంది బాలికలు తమ చదువును మధ్యలోనే మానివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ చదువుకోవడం తీవ్ర భారంగా మారిందని పేర్కొన్నారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అన్ని మౌలిక వసతులతో కూడిన ట్రైబల్ బాలికల హాస్టల్‌ను తక్షణమే మంజూరు చేసి, ఈ విద్యా సంవత్సరంలోనే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ నాయకులు జమ్మిచేడు కార్తీక్, గంజిపేట కోళ్ల ఆంజనేయులు, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# శామీర్‌పేటలో చోళ గోల్డ్ లోన్ బ్రాంచ్ ప్రారంభం

## బ్రాంచ్‌ను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హెడ్ కూరపాటి వెంకట మురళీధర్



శామీర్ పేట్, జులై 24(జనం సాక్షి ) : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ 300 డివిజన్ శామీర్‌పేటలో చోళ గోల్డ్ లోన్ బ్రాంచ్ ను ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హెడ్ కూరపాటి వెంకట మురళీధర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శామీర్‌పేటలో తమ నూతన బ్రాంచ్ ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు గోల్డ్ లోన్ లో నమ్మకమైన సేవలు అందించడం చోళ లక్ష్యం అని అన్నారు. శామీర్‌పేట చుట్టుపక్కల ప్రజలకు గోల్డ్ లోన్ లో త్వరితగతిన మెరుగైన సేవలు అందించేందుకు చోళ గోల్డ్ లోన్ అందుబాటులో ఉంటుందన్నారు. వీలైన ప్రజలు బ్రాంచ్ ని సందర్శించి చోళ గోల్డ్ లోన్ సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చోళ గోల్డ్ లోన్ ఆర్.బి.ఎం డి. వెంకట రెడ్డి, ఏ.ఆర్.బి.ఎం అరుణ్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఆపరేషన్ మేనేజర్ శ్రీకాంత్, రిలేషన్షిప్ మేనేజర్ రాఘవాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమించిన స్థలంలో షెట్టర్లు

# ప్రభుత్వ భూమిలో ప్రైవేటు పెత్తనం

## రూ.20 కోట్ల భూమికి బొక్కపెట్టిన ‘బొబ్బల’ • యథేచ్ఛగా కబ్జా చేసి షెడ్లు, మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం

- గత కొన్నేళ్లుగా అద్దెల వసూళ్లతో భారీ వ్యాపారం
- బోడుప్పల్ సర్కిల్ 262 సర్వే నెంబర్‌లో ఇష్టారాజ్యం
- హైడ్రాకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు


*పదేళ్లుగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి షెడ్లు, దుకాణాలు, మినీ ఫంక్షన్ హాల్ నిర్మించి లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్న భారీ భూ బాగోతం బోడుప్పల్‌లో వెలుగుచూసింది. సుమారు రూ.20 కోట్ల విలువైన సర్కారు స్థలాన్ని ఆక్రమించి కుటుంబ సభ్యుల పేర్లపై ఇంటి నంబర్లు కూడా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ పలుకుబడి, అధికారుల మౌనం అండగా అక్రమ నిర్మాణాలు ఒక్కొక్కటిగా పెరిగినా ఏ శాఖా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా హైడ్రాకు ఫిర్యాదు చేరడంతో దశాబ్దకాలంగా సాగుతున్న ఈ కబ్జా దందా వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు హైడ్రా, రెవెన్యూ శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.*


**బోడుప్పల్-జనంసాక్షి**

బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని సర్వే నెంబర్ 262లో గతంలో ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసింది. శ్రీ బంగారు మైసమ్మ, వీరాంజనేయ స్వామి, నల్లపోచమ్మ దేవాలయాల కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి మాత్రం సర్వే నెంబర్ 31, 32, 33, 34లో గల తన స్థలానికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై దృష్టిపెట్టాడు. మల్లికార్జున దేవాయాలయం ఎదుట రెండువైపులా రోడ్డు వెళ్లడంతో పక్కనే తన భూమికి ఆనుకుని ఉన్న సర్కారు భూమిని ఇదే అదనుగా చెరిపేయడం మొదలు పెట్టాడు. బోడుప్పల్ గ్రామం నుంచి చర్లపల్లికి వెళ్లే రహదారిని పూర్తిగా ఆక్రమించి తన భూమిలో కలుపుకొని ప్రహరీ గోడ నిర్మించాడు. కొన్ని సంవత్సరాల క్రితం నుంచే ఆ భూమిలో వరుసగా నిర్మాణాలు చేపట్టాడు. ప్రస్తుతం తాత్కాలికంగా రేకులతో షెడ్లు, షాపులు ఏర్పాటు చేశాడు. ఓ మినీ ఫంక్షన్ హాల్ నిర్మించి కిరాయిలకు ఇచ్చి లక్షలు పొందాడు. ఈ నిర్మాణాలకు కుటుంబ సభ్యుల పేర్ల మీద ఇంటి నెంబర్లు తీసుకున్నాడు. నాడు వార్డు మెంబర్‌గా ఉండటం, గ్రామ పంచాయతీ కావడంతో సులువుగా ఇంటి నెంబర్లు పొందినట్టు తెలిసింది.

**నాయకుల ప్రోద్బలం.. అధికారుల చేతి‘వాటం’**


ఈ కబ్జాకు కారకుడైన బొబ్బల లక్ష్మారెడ్డి గతం నుంచి రాజకీయ నాయకుడు కావడంతో సర్కారు స్థలాన్ని మింగేస్తున్నా ఎవరూ కిమ్మనలేదు. నిర్మాణాల విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరించారు. స్థానిక కొంతమంది నాయకుల ప్రోద్బలంతో యథేచ్ఛగా కబ్జాల పర్వం కొనసాగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ కొంతమంది అధికారులు కూడా సదరు వ్యాపారి నుంచి ఆమ్యామ్యాలు అందుకుంటున్నట్టు సమాచారం. అందుకే ఈ అక్రమ షెడ్ల విషయంలో ‘సైలెంట్’ మోడ్ నడుస్తోందని టాక్. ఈ నేపథ్యంలో బొబ్బల లక్ష్మారెడ్డితో రాజకీయ వైరం ఉన్న కొందరు నాయకులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లడంతో దశాబ్దకాలం దందా వెలుగులోకి వచ్చింది. తాజా ఫిర్యాదు నేపథ్యంలో హైడ్రా, రెవెన్యూ శాఖలు ఎలాంటి చర్యలు చేపడతాయన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే 262 సర్వే నెంబర్‌లోని కబ్జాలను తొలగించి లైబ్రరీకిగానీ, సర్కిల్ కార్యాలయానికిగానీ, పోలీస్ స్టేషన్‌కుగానీ వినియోగించాలనే డిమాండ్లు కూడా వ్యక్తమవుతున్నాయి.





లేఅవుట్ లో కబ్జాకు గురైన స్థలం

### రెవెన్యూ రికార్డులు పరిశీలించాలి : పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డి



సర్వే నంబర్ 262లోని సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బొబ్బల లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులు అక్రమంగా కబ్జా చేశారని, పదేళ్లుగా ఆ స్థలంలో షెడ్లు నిర్మించి అద్దెలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోగుల వీరారెడ్డి, పులకండ్ల బాల్‌రెడ్డి ఆరోపించారు. హైడ్రా కమిషనర్‌కు ఇటీవలే ఫిర్యాదు చేసి, శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ఆక్రమించి వాణిజ్య అవసరాలకు వినియోగించడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ సర్వే నెంబర్‌కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, ఇతర అధికారిక పత్రాలను పరిశీలిస్తే ఆక్రమణల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించడంతో పాటు అద్దెలు వసూలు చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌ను కోరినట్టు వీరారెడ్డి, బాల్‌రెడ్డి చెప్పారు.

# వివాదాస్పద స్థలంపై నిర్మాణం ఆపాలి

## భీమ్రావునగర్‌లో కాలనీవాసుల ఆందోళన • నిర్మాణ అనుమతి రద్దుకు డిమాండ్ • మైనంపల్లి మద్దతు.. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



**అల్వాల్, జులై 24 (జనంసాక్షి):** ఓల్డ్ అల్వాల్ భీమ్రావునగర్‌లో వివాదాస్పద స్థలంలో చేపట్టిన నిర్మాణాన్ని నిలిపివేసి, జారీ చేసిన భవన నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. పార్కు కోసం కేటాయించినదిగా తాము పేర్కొంటున్న స్థలంలో నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. నిరసనకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మద్దతు తెలపగా.. అనంతరం రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాంగ్రెస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి తోట లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో మైనంపల్లి పాల్గొన్నారు. కాలనీ లేఅవుట్‌లో సదరు స్థలాన్ని పార్కు కోసం కేటాయించినట్లు తనకు తెలుసని ఆయన పేర్కొన్నారు. అల్వాల్ వాసిగా 20-25 ఏళ్లుగా ఈ ప్రాంత పరిస్థితులు తనకు తెలుసని, ఇన్నేళ్లుగా స్థానికులు పరిరక్షించుకుంటున్న స్థలంలో నిర్మాణానికి అనుమతి ఎలా జారీ అయిందనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**రికార్డులు పరిశీలించి తేల్చండి**

అక్కడి నుంచే అల్వాల్ తహసీల్దార్, మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌తో మైనంపల్లి ఫోన్‌లో మాట్లాడారు. స్థలానికి సంబంధించిన లేఅవుట్, రెవెన్యూ రికార్డులు, నిర్మాణ అనుమతి పత్రాలను పరిశీలించి వాస్తవాలను తేల్చాలని కోరారు. అధికారులు స్వయంగా స్థలాన్ని పరిశీలించి కాలనీవాసులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**రంగంలోకి రెవెన్యూ అధికారులు**

నిరసన అనంతరం అల్వాల్ తహసీల్దార్ రాములు, డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ భీమ్రావునగర్‌కు చేరుకుని వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులు, స్థల పరిస్థితులను పరిశీలించి కాలనీవాసుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పత్రాలు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నిరసనలో మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్, నిమ్మ అశోక్‌రెడ్డి, శేఖర్, బొబ్బిలి సురేందర్‌రెడ్డి, దేవేందర్, సూర్యకిరణ్, బలవంతరెడ్డి, నాగేశ్వరరావు, రాజసింహారెడ్డి, వెంకటేష్ యాదవ్, బబిత, వీనస్ మేరీ, జ్యోతి యాదవ్, లావణ్య, శశిరేఖ, గాయత్రి, విజయలక్ష్మి, సుకన్యతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఐవిఫ్ దినోత్సవం

## ఈరయా ఫెర్టిలిటీలో ‘ది ఫెర్టిలిటీ ఎడిట్’ మాస్టర్‌క్లాస్



**ఖైరతాబాద్, జూలై 24 (జనంసాక్షి) :** సంతాన చికిత్సలో శాస్త్రీయ అవగాహనతో పాటు రోగుల శారీరక, మానసిక శ్రేయస్సుకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈరయా ఫెర్టిలిటీ సహ-వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డా.ఐశ్వర్య ను పూర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఐవిఫ్ దినోత్స వం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఈరయా ఫెర్టి లిటీ కేంద్రంలో ‘ది ఫెర్టిలిటీ ఎడిట్’ పేరుతో రెండు రోజుల వెల్‌నెస్ మాస్టర్‌క్లాస్ నిర్వహించారు. సం తాన సమస్యలు ఎదుర్కొంటున్న జంటలకు వైద్య అవగాహన, జీవనశైలి మార్పులు, ఒత్తిడి నిర్వహ ణ, స్వీయ సంరక్షణ, ఐవిఫ్ ప్రక్రియపై స్పష్టత కల్పించారు. కార్యక్రమం ముగింపులో ప్రపంచ ఐవిఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోగులు, వైద్యులు, ప్రయోగశాల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

# మందిపల్లి పాఠశాల వంట ఏజెన్సీకి షోకాజ్ నోటీసు

## మధ్యాహ్న భోజన మెనూ పాటించకపో వడంపై కలెక్టర్ ఆగ్రహం

**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 24(జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం మంది పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నిర్దేశిత మెనూను పాటించ కపోవడంపై జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆ రోజు మెనూ ప్రకారం వెజిటేబుల్ కర్రీ,గుడ్డు, సాంబారు వడ్డించాల్సి ఉండగా, వంట ఏజెన్సీ నిర్వాహకులు కేవలం గుడ్డు, సాంబారు మాత్రమే తయారు చేసినట్లు గుర్తించారు. వెజిటేబుల్ కర్రీ ఎందుకు తయారు చేయలేదని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, వంట ఏజెన్సీ నిర్వాహకులకు వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయున్నీ ఆదేశించారు. పాఠశాలలో 4 వ తరగతి విద్యార్థులకు ఉపా ధ్యాయుడు చెబుతున్న గణితం పాఠ్యాంశాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో, కూడికలు తీసివేతలను బోర్డుపై చేయించి వారి సామా ర్థ్యాన్ని గుర్తించి అభినందిం చారు.



ఫ్రైడే డ్రై డేను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

ధన్వాడ మండలం మందిపల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. గ్రామంలోని పలు నివాసాలను సందర్శించి నీటి తొట్టెలు, కుండీలు, నీరు నిల్వ ఉండే ప్రదేశా లను తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్ర మాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారా లేదా అని ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, తొట్టెలు, కుండీల్లో ఎక్కువ రోజుల పాటు నీటిని నిల్వ ఉంచడం వల్ల దోమల లార్వా పెరిగి దోమల సంఖ్య అధికమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు.

**పంచాయతీ కార్యాలయ రికార్డుల పరిశీలన**

మందిపల్లి గ్రామ పంచా యతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కార్యాలయ రికార్డులు, జనన-మరణ ధ్రువపత్రాల నమోదులు, వివాహ రిజిస్ట్రేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ కి ఉన్న ఆర్థిక వనరులు, ఆస్తి పన్ను, ఇతర ఆదాయ వనరులపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. బీఎల్‌వోలు, వారి ఎపిక్ నంబర్లను పరిశీలించిన తర్వాతే జాబితా నుంచి పేర్లు తొలగించిన ట్లు, మరో రెండు రోజుల్లో గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రి య పూర్తవుతుందని తెలిపారు. గ్రామంలోని బీసీ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సురేందర్ రెడ్డి, గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, రోడ్డు సమస్యకు పరిష్కారం చూపేలా తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ధన్వాడ మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాల యాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

# చాకలి ఐలమ్మ మహిళ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** చాకలి ఐలమ్మ మహిళ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 24 ఏళ్ల బోధన, పరిశోధన, పరిపాలనా, పారిశ్రామిక అనుభవం కలిగిన ఆయన ఉన్నత విద్యా రంగంలో విశిష్ట సేవలందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొల్లేపల్లి గ్రామానికి చెందిన ప్రొఫెసర్ మల్లేశం, ఓయూలో బీఈ పూర్తి చేసి, ఐఐటీ ఢిల్లీలో ఎంఈ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని యేల్ యూనివర్సిటీలో పోస్ట్-డాక్టరల్ ఫెలోషిప్ చేశారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, జాతీయ స్థాయి అథ్లెట్‌గా గుర్తింపు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డీన్ (డెవలప్‌మెంట్ అండ్ యూజీసీ అఫైర్స్), యూనివర్సిటీ ఎలక్ట్రికల్ డివిజన్ డైరెక్టర్, విద్యుత్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, స్టూడెంట్ అడ్వైజర్ తదితర కీలక బాధ్యతలను నిర్వహించారు. కృత్రిమ మేధస్సు, అడ్వాన్స్‌డ్ ఆప్టిమల్ కంట్రోల్, పవర్ ఇంజినీరింగ్ రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. 85కిపైగా పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు రెండు పేటెంట్లు నమోదు చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పీహెచ్‌డీలు, 25 మంది మాస్టర్స్ విద్యార్థులు పరిశోధనలు పూర్తి చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కూడా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం మల్లేశం మాట్లాడుతూ, మహిళా విశ్వవిద్యాలయాన్ని విద్యా, పరిశోధన, పరిపాలనా రంగాల్లో మరింత అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నాణ్యమైన విద్య, మహిళా సాధికారత, పరిశోధన, పారదర్శక పరిపాలనకు ప్రాధాన్యతనిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.

# ఓయూలో నిరసన ర్యాలీ

## పరీక్షల నిర్వహణ చేతగాని ప్రధాని మోడీ రాజీనామా చేయాలి



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడంలో తీవ్రంగా విఫలమై విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని తెలంగాణ రక్షణ సేన విద్యార్థి విభాగం నాయకులు విమర్శించారు. ‘నీట్’ ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు మద్దతుగా శు క్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో టీఆర్ఎస్-వి నాయకులు కందుల మధు, బొడ్డుపల్లి లింగం, అశోక్ యాదవ్ ల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆవరణ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు చేపట్టిన ఈ నిరసన ర్యాలీలో విద్యార్థులు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని, లీకేజీల సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఎన్‌టీఏ నిర్లక్ష్యం వల్లే ఈ అక్రమాలు జరుగుతున్నాయని, దీనివల్ల మనస్తాపానికి గురై విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నా ప్రధానికి పట్టింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఉగ్రవాద కేసులు మోపడం దారుణమని, భాజపా పాలనలో జాతీయ స్థాయి అర్హత పరీక్షలకు లీకేజీలే కేరాఫ్ అడ్రస్‌గా మారాయని మండిపడ్డారు. ఇప్పటికైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రభుత్వంపై నేరుగా పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థి నాయకులు గుమ్మడి క్రాంతి, సీహెచ్ భగత్ యాదవ్, కొప్పుల అర్జున్, రాజ్ కుమార్, కశ్యప్ యాదవ్, సాయి నేత, అఖిల్ రెడ్డి, మల్లిక్ తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- డీవై సీఈఓ గోపాల్ నాయక్

**తెల్కపల్లి, జూలై 24 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీవై సీఈఓ/పీడీ హౌసింగ్ గోపాల్ నాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని లక్నారం, గొల్లగుండం, కమ్మరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలను సందర్శించి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన, ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే స్లాబ్ పూర్తి చేసిన వారు ఈ నెలలోనే మిగిలిన పనులు పూర్తి చేస్తే తుది ఫోటో క్యాప్చర్ చేసి బిల్లు త్వరగా మంజూరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట్, హౌసింగ్ డీఈఈ హరినాయక్, ఏఈ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

- విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, జూలై 24 (జనం సాక్షి) :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ.. ప్రశ్నించిన వారిపై దమనకాండ కొనసాగిస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి లోకానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా శుక్రవారం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ధర్నా చౌక్ లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాదిమంది విద్యార్థులు, యువకులు ద్విచక్ర వాహనాలు, 300 పైగా కార్లలో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని



జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని విమర్శించారు. గత 12 సంవత్సరాల ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 158 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొన్నారు. నీట్ వంటి కీలకమైన జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం మూలంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరులో పారదర్శకత కరువైందని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో న్యాయం చేయాలంటూ లక్షలాదిమంది విద్యార్థులు ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా శాంతియుత నిరసన ప్రదర్శనలు చేపడుతుంటే.. అత్యంత పాషవికంగా లాఠీచార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగిస్తూ కేంద్ర ప్రభుత్వం నియంత పరిపాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రశ్నించడమే నేరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి విభాగం కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**నాగర్‌కర్నూల్, జూలై 24 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో ఈరోజు ఏబీవీపీ నాయకులు కార్యక్రమం నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ అంబేద్కర్ చౌరస్తాలో కలవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న మొత్తం స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దహనం చేయడానికి విద్యార్థులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను ఆర్పి ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ శాంతన్ మాట్లాడుతూ, నీట్ విద్యార్థుల సమస్యలపై కొడంగల్‌లో ముఖ్యమంత్రి ధర్నా నిర్వహించడం స్వాగతించదగిన విషయమే అన్నారు. అయితే, అదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర విచారకరం అని విమర్శించారు. ప్రభుత్వానికి నీట్ విద్యార్థుల బాధలు కనిపిస్తున్నప్పుడు, తెలంగాణలోని ప్రభుత్వ, ఎయిడెడ్, డిగ్రీ, యూనివర్సిటీ, గురుకుల విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు కళాశాలల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరీక్షలు, అడ్మిషన్లు, సర్టిఫికెట్లు వంటి అంశాల్లో తీవ్ర సమస్యలు



ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పదివేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి తక్షణమే జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయాలి టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి, పెండింగ్‌లో ఉన్న మొత్తం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు. నీట్ విద్యార్థులకు చూపుతున్న చొరవనే తెలంగాణ పేద విద్యార్థులపైనా చూపించండి.స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయండి. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, భరత్, సందీప్, రెహ్మాన్,మార్కండేయ, మురళి ఏబీవీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యతనిస్తోంది

- సర్వే, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూలై 24 (జనం సాక్షి) :** ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంను పూర్తిచేసి రైతులకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఆ దిశగా అధికారులు జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జిల్లాలోని నెట్టెంపాడు,గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ప్రైమరీ డిక్లరేషన్ పూర్తయి అవార్డు స్థాయిలో ఉన్న భూముల వివరాలను అడిగారు. అనంతరం వివిధ మండలాల వారీగా ఆయా గ్రామాల పరిధిలో చేయాల్సిన భూ సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన జాయింట్ ఇన్స్పెక్షన్ పూర్తి చేయాలన్నారు. మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు కావలసిన భూసేకరణకు సంబంధించి తనగల గ్రామస్తులతో మరోసారి గ్రామ సభ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సేకరణ విషయంలో ఇరిగేషన్ ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి అధికారులతో తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆర్ అండ్ ఆర్ గ్రామాల్లో



పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టుల చుట్టుపక్కల ఉన్న ఇరిగేషన్ రహదారులను అభివృద్ధి చేసేందుకు ఆర్ అండ్ బి శాఖ ముందుకొచ్చిందని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. భూ సేకరణపై తరచు సమీక్ష సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తామని, అధికారులు ఎప్పటికప్పుడు పురోగతి సాధిస్తూ కావాల్సిన భూసేకరణ లక్ష్యాలను సాధ్యమైనంత తొందరగా చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈలు సంజీవ్ ప్రసాద్, శ్రీనివాసులు, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండపాకలోనే యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా
- జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం



**కొండపాక, జూలై 24 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్‌ను మండలంలోనే ఏర్పాటు చేసి, నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కొండపాక మండల యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు అనంతరం నరేందర్ రాగల దుర్గయ్య తదితరులతో కలిసి మాట్లాడుతూ కొండపాక మండల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్‌ను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొండపాకలోనే ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, మండల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యంగ్ ఇండియా స్కూల్‌ను కొండపాకలోనే ఏర్పాటు చేసి, పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు సామాజిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గుతాయి

- లోటు వర్షాలకు రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి
- మండల వ్యవసాయ అధికారి దీపిక

**నర్సాపూర్, జూలై 24 (జనం సాక్షి) :** నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట, జక్కపల్లి గ్రామాల్లో శుక్రవారం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి దీపిక మాట్లాడుతూ, రెండు గ్రామాల్లో ఎంపిక చేసిన 125 మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతం పెరగడంతో పాటు సాగు వ్యయాలు తగ్గి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. టీఆర్‌వీకే హెడ్ డా. సతీష్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికతో పాటు తేమ సంరక్షణ చర్యలను తప్పనిసరిగా



పాటించాలని రైతులకు సూచించారు. లీవ్ పామ్ డైరెక్టర్ డా. రంగనాయకులు మాట్లాడుతూ, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు మంచి ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాగు విధానాలు, మార్కెటింగ్ సౌకర్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జక్కపల్లి సర్పంచ్ భాస్కర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ట్రైనీ డీటీ సాయికుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు తేజస్విని, రాజశేఖర్ గౌడ్, లీవ్ పామ్ అధికారి శ్రీధర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ బ్యూరో, జులై 24 (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.



శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ నమోదు పై మెదక్ నియోజకవర్గ స్థాయి తాసిల్దారులు, సూపర్వైజర్లు , బిఎల్ఓ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఎస్.ఐ.ఆర్ నమోదు పై సూపర్వైజర్లు, బిఎల్‌వోలు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని వారికి ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు 97% శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మొత్తాన్ని నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బీఎల్‌వోల నుంచి ప్రతిరోజూ పురోగతి నివేదికలు సేకరించాలని, ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని, బీఎల్ఏలు కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రం వారిగా మ్యాపింగ్ కానీ జాభితా బిఎల్ఏలకు ఇవ్వాలని, వారిని భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డిఓ రమాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు . గఫార్ మెదక్ డివిజన్ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక నైపుణ్యమే విజయానికి కీలకం

- డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్




**వనపర్తి బ్యూరో, జూలై 24 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,ఆదేశాల మేరకు డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సైబర్ వారియర్స్‌కు సైబర్ పోర్టల్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ, సైబర్ నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో గ్రీవెన్స్ రెడ్రెసల్ మాడ్యూల్ (జి.ఆర్.ఎమ్) మనీ రీస్టోరేషన్ మాడ్యూల్ (ఎం.ఆర్.ఎం) వినియోగంపై సైబర్ క్రైమ్ ఎస్సై రవిప్రకాష్ శిక్షణ ఇచ్చారు. జీఆర్‌ఎమ్ ద్వారా సంబంధం లేకుండా ఫ్రీజ్ అయిన బ్యాంకు ఖాతాలను నిబంధనల ప్రకారం డి-ఫ్రీజ్ చేసే ప్రక్రియ వేగవంతమవుతుందని, ఎంఆర్‌ఎమ్ ద్వారా సైబర్ మోసాలకు గురైన బాధితులకు ముఖ్యంగా రూ.50 వేల లోపు ఫ్రీజ్ అయిన నగదును కోర్టు ఉత్తర్వులు లేకుండానే నిబంధనల మేరకు తిరిగి అందించే అవకాశం ఉందని వివరించారు. సైబర్ ఫిర్యాదులపై అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, సీఐలు, ఎస్సైలు, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

- టీయూడబ్ల్యూజేహెచ్-143 సభ్యత్వ నమోదు ప్రారంభం
- హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలి

**నారాయణపేట, జూలై 24 (జనం సాక్షి) :** జర్నలిస్టుల హక్కులు,సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే హెచ్-143) నాయకులు పేర్కొన్నారు. జిల్లాలోయూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు.జిల్లా అధ్యక్షుడు కాలాల్ ఆనంద్ కుమార్ గౌడ్,ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వారధి నవీన్ కుమార్,టెంజూ జిల్లా అధ్యక్షుడు అవుటి రాజశేఖర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

### సంఘటితంగా ముందుకు..

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ప్రతినిధులు నిరంతరం పనిచేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను సంఘం పరిధిలోకి తీసుకువచ్చి వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

### సంక్షేమం.. హక్కుల పరిరక్షణ

జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ పథకాల అమలు, అక్రిడిటేషన్, ఆరోగ్య భద్రత, ఇళ్ల స్థలాలు, వృత్తిపరమైన భద్రత తదితర అంశాలపై నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి



వాటి పరిష్కారానికి యూనియన్ తరఫున కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

### సభ్యత్వ నమోదుకు పిలుపు

అర్హులైన జర్నలిస్టులు యూనియన్ సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి. నారాయణ, లింగం మహ్మద్ రఫీ, హర్షద్ పైసల్, జహీర్ సోఫీ, మోహన్ రాజ్, తాటి మధు, హుసేన్ పాషా, మహ్మద్ హుసేన్, సంతోష్, వెంకట్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం

**నిజాంపేట, జూలై 24 (జనం సాక్షి) :** రీ- సర్వేతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. నిజాంపేట మండలం నందిగామ లో శుక్రవారం భూముల రీ సర్వే పై ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న రమేష్ ఆర్డీవోను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మాట్లాడారు.. ఏళ్ల తరబడి మోకపై ఉన్న రైతులకు ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందని, అక్రమంగా పట్టాలు పొందిన వారికి సంక్షేమ పథకాలు రద్దయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ ఆకుల స్వప్న రమేష్, డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐ ప్రీతి తదితరులు ఉన్నారు.



# కస్టమర్ల వద్దకే వెళ్లి రీ-కేవైసీ

- బాసర ఎస్‌బీఐ వినూత్న చర్య



**బాసర, జూలై 24 (జనం సాక్షి) :** కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు బాసర ఎస్‌బీఐ బ్రాంచ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బ్రాంచ్ మేనేజర్ జి. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది మండల వ్యాప్తంగా పర్యటించి ప్రజలకు రీ-కేవైసీపై అవగాహన కల్పిస్తున్నారు. ఖాతాదారుల ఇళ్లకు, దుకాణాలకు స్వయంగా వెళ్లి రీ-కేవైసీ ప్రక్రియను అక్కడికక్కడే పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది వాట్సాప్ బ్యాంకింగ్ సేవల వినియోగం, బ్యాంకు యాప్ ద్వారా లావాదేవీల సౌలభ్యంపై కూడా కస్టమర్లకు వివరించారు. అదే సమయంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరికీ ఓటీపీలు, ఏటీఎం పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డ్లు చెప్పవద్దని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు.బ్యాంకు సిబ్బంది ఇంటింటికీ వచ్చి సేవలు అందిస్తున్న తీరును స్థానికులు అభినందించారు. రీ-కేవైసీ గడువులోపు పూర్తి చేయకపోతే ఖాతాలు నిలిచిపోయే అవకాశం ఉందని, కావున ప్రతి ఒక్కరూ సహకరించాలని మేనేజర్ అశోక్ కుమార్ కోరారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అవకాశమివ్వొద్దు

- రోడ్డుపై లారీల పార్కింగ్ నివారించాలి
- ధాబా యజమానులకు ఎస్పీ హెచ్చరిక



**గుడిహత్నూర్, జూలై 24 (జనంసాక్షి) :** జాతీయ, అంతర్రాష్ట్ర రహదారుల వెంట ఉన్న ధాబాల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం ఇవ్వొద్దని, రోడ్డుపై లారీలు, వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ధాబా యజమానులు, నిర్వాహకులకు స్పష్టం చేశారు. గుడిహత్నూర్‌లో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన సమావేశంలో పలు కీలక సూచనలు చేశారు. ధాబాల్లో మద్యం సేవించడం, మద్యం విక్రయించడం పూర్తిగా నిషేధమని ఎస్పీ పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ఘటనలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ధాబాల్లో గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, అవసరమైతే ధాబాలను తాత్కాలికంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి ధాబాలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ధాబాకు వచ్చే వాహనాలన్నీ పార్కింగ్ స్థలాల్లోనే నిలపాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై లారీలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, దీనిపై యజమానులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని, ప్రజల సహకారంతో ప్రమాదరహిత ఆదిలాబాద్ జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఇచ్చోడ ఎస్‌హెచ్‌వో కె. నరేష్ కుమార్, ఎస్‌ఐ ఎల్. శ్రీకాంత్, ధాబా యజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు

# మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల తనిఖీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 24(జనంసాక్షి):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హరిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధనా తీరును, ఉపాధ్యాయుల పనితీరును కలెక్టర్ సమీక్షించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారి అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. నాణ్యమైన భోజనం, పరిశుభ్రత తప్పనిసరి అని అనంతరం పాఠశాల వంటశాలను, భోజన వసతులను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. వంటశాలలో నిరంతరం పరిశుభ్రతా ప్రమాణాలు పాటించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నాటిన ప్రతి మొక్కనూ దత్తత తీసుకొని అది పెరిగే వరకు జాగ్రత్తగా సంరక్షించాలన్నరు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులను వెంటనే మెరుగుపరచాలని, విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం తనిఖీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 24(జనంసాక్షి ):** వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ నితికా పంత్ సందర్శించారు. మొదట పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, మొక్కలు నాటారు. డిఎస్పి కార్యాలయంలోని రికార్డ్ లను, పరిసరాలను తనిఖీ చేశారు. సంబంధించిన ఇన్ఫర్మేషన్ బుక్ , క్రైం రికార్డు, రిజిస్టర్ లను పరిశీలించారు. సబ్ డివిజన్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్, ట్రాయల్ లో ఉన్న సిడి ఫైళ్లను, పరిశీలించారు. గ్రేవ్ కేసులలో, ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని డిఎస్పీ అశోక్ కు సూచించారు. ఎస్ ఓ పి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. 5ఎస్ ఇంప్లిమెంటేషన్ ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని,5ఎస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల పరిరక్షణకు ఆయా సి.ఐలు, ఎస్సై ల ద్వారా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచుగా సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. సబ్ డివిజన్ పరిదిలోని రౌడీ షీటర్లు, అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయ చేసే వారిపై నిగా ఏర్పాటు చేసి తరచూ తనిఖీలు నిర్వహించి గంజాయి ని సమూలంగా రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పొలిసింగ్ లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్ , సర్కిల్ ఇన్స్పెక్టర్స్ సంజయ్, వేణుగోపాల్, బాలాజీ వరప్రసాద్, రమేష్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా
# రైతులు పంట మార్పిడి చేసుకోవాలి

- తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం కిషన్ కుమార్
- మామునూరు కెవికెలో కిసాన్ మేళా, ఎల్నినో పరిస్థితుల పై అవగాహన



**వరంగల్ బ్యూరో, జూలై 24 (జనం సాక్షి) :** ఎల్నినో పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంట మార్పులు చేసుకోవాలని తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం కిషన్ కుమార్ అన్నారు. వరంగల్ జిల్లా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై కిసాన్ మేళా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి పి.వి.నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం. కిషన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆయన వివిధ శాఖలు, రావెప్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ ఆర్. అరుణ్‌జ్యోతి, అతిథులు , రైతులకు స్వాగతం పలికారు. ఎల్‌నినో కారణంగా ఏర్పడే వాతావరణ పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావాన్ని వివరించారు. ఎల్‌నినో ప్రభావం, దానిని అధిగమించడానికి రైతులు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు.డాక్టర్ ఎం. కిషన్‌కుమార్ మాట్లాడుతూ కేవీకే చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. రైతులు కేవీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యవసాయ పద్ధతులను వివరించారు. రైతులు ఎల్ నినో పరిస్థితులకు అనుగుణంగా పంట మార్పులు చేసుకోవాలని సూచించారు.డాక్టర్ చి. సౌమ్య ఎల్‌నినో పరిస్థితుల్లో వాతావరణం, వర్షపాతానికి అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ వ్యూహాలపై అవగాహన కల్పించారు. టీఆర్‌వీకే అధిపతి డాక్టర్ నర్సయ్య మాట్లాడుతూ తక్కువ నీటితో పంటలు సాగుచేయాలని, అంతరాయ నీటిపారుదల పద్ధతులతోపాటు వ్యవసాయ రంగంలోని నూతన ఆవిష్కరణలను రైతులు స్వీకరించాలని సూచించారు.వరంగల్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి శ్రీ శ్రీనివాసరావు రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ అనుబంధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. అనంతరం రైతులు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్-ఎస్సీఎస్పీ, ఐసీఏఆర్-టీఎస్పీ పథకాల కింద రైతులకు వివిధ రకాల ఉపకరణాలు, వ్యవసాయ ఉత్పాదకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు 2 వెట్ గ్రైండర్లు,30 స్ప్రేయర్లు,14 టార్పాలిన్లు,15 ట్రైకోడెర్మా ప్యాకెట్లు ఐదుగురు మహిళలకు 5 యూనిట్ల కింద 15 మేకలు పంపిణీ చేశారు. 94 మంది రైతులకు10 మంది మహిళలకు కుట్టు యంత్రాలు,ఒక వెట్ గ్రైండర్14 టార్పాలిన్లు,50 కొడవళ్లు, కొంకీలు,15 ట్రైకోడెర్మా ప్యాకెట్లు,నలుగురు మహిళలు నాలుగు యూనిట్ల కింద 12 మేకలు పంపిణీ చేశారు.చివరగా డాక్టర్ రాజు వందన సమర్పణ చేశారు. వివిధ శాఖల అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రావెప్ విద్యార్థులు, రైతులు, ఇతర ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా




**తాండూర్, జులై 24(జనం సాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ దేవయ్య పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు.కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ,వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది విధి నిర్వహణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు.భూ వివాదాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా, నిజాయితీతో విచారించి, చట్టబద్ధంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తులపై అనవసరంగా బలప్రయోగం చేయరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకే చట్టబద్ధమైన బలాన్ని వినియోగించాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో ప్రివెంటివ్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలని, సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు.ప్రతి సర్కిల్‌లో సమస్యలు తలెత్తకముందే వాటిని గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు.నేరాల దర్యాప్తులో వస్తున్న తాజా పరిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని, ముఖ్యంగా ఎస్ఐ స్థాయి నుంచి పైస్థాయి అధికారులందరూ సీసీటీఎన్ఎస్, సమాచార సాంకేతికత (ఐటీ),ఆధునిక పోలీసింగ్‌లో వినియోగిస్తున్న సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతికత వినియోగం మరింత పెరుగుతుందని, ప్రమోషన్లతో బాధ్యతలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి తమ సాంకేతిక నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుల వివరాలను సమగ్రంగా ధృవీకరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషనర్‌తో మర్యాదపూర్వకంగా, ఓర్పుతో వ్యవహరించి, చట్ట పరిధిలో సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు. విధి నిర్వహ ణలో ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించి, చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.



# బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటాపోటీగా నినాదాలు

**నర్సంపేట జూలై 24 (జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం దగ్గర ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, బీజేపీ ఇరు వర్గాలు పోటాపోటీ నినాదాలు చేసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ముందుగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున వరంగల్ రోడ్డు వైపున గల కాకతీయ తోరణం దగ్గర ధర్నా చేపట్టారు. జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేసినందుకు నిరసనగా పెద్ద ఎత్తున గుమికూడి నినాదాలు చేశారు. అనంతరం బీజేపీ శ్రేణులు సైతం అక్కడికి చేరుకుని దేశ సమగ్రతను దెబ్బ తీస్తున్నారు అంటూ నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఇరు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తతగా మారుతుండటంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను శాంతిపజేసి అక్కడ నుండి పంపించేశారు.

# బల్క్ ల్యాండ్ సమస్యల సర్వే తొందరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బల్క్ ల్యాండ్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో బల్క్ ల్యాండ్, రీ సర్వే, సర్ ప్రక్రియపై భూపాలపల్లి రెవెన్యూ డివిజన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బల్క్ ల్యాండ్ ఇష్యూస్‌ను గ్రామాల వారీగా సర్వే నిర్వహించి నివేదికలు అందచేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. సర్వే నివేదికల ఆధారంగా సంబంధితులకు నోటీసులు జారీ చేసి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రీ-సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో బల్క్ ల్యాండ్ ఇష్యూస్ ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే రీ-సర్వే నిర్వహించిన పైలెట్ గ్రామాల నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. రీ-సర్వే పనుల్లో మండలాల వారీగా జీపీఓలతో సమన్వయం చేసుకుని సర్వే నిర్వహించాలని, సర్వే విధులు నిర్వహించని లైసెన్స్ సర్వేయర్లకు నోటీసులు జారీ చేయాలని, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడిని ఆదేశించారు. భూ సర్వే జరుగుతున్న గ్రామాలలో రైతులు సర్వేకు సహకరించాలని సూచించారు. సర్వే జరుగుతున్న సమాచారం గ్రామంలో టామ్ టామ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో సాధాబైనామా కింద మొత్తం 39,300 దరఖాస్తులు అందగా, ప్రస్తుతం 26,698 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించిన కలెక్టర్, జిల్లాలో ఇప్పటివరకు 83 శాతం ఆన్లైన్ పూర్తి అయ్యిందని తెలిపారు. టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో 99 శాతం పూర్తికాగా, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 70 శాతం మాత్రమే జరిగిందని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్‌వోల నుంచి ప్రతిరోజూ పురోగతి నివేదికలు సేకరించాలని, ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని, బీఎల్‌ఏలు కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బిఎల్ఏలు, బిఎల్ఓలతో సమావేశం నిర్వహించాలని, పోలింగ్ కేంద్రం వారిగా మ్యాపింగ్ కానీ జాబితా బిఎల్ఏలకు ఇవ్వాలని, వారిని భాగస్వాములను చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, సర్వే కండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, ఈ సెక్షన్ పర్యవేక్షకులు హరి హర ప్రసాద్, భూపాలపల్లి డివిజన్ లోని ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# మహితపురం జలపాతం సందర్శన నిషేధం



**నూగూర్ వెంకటాపురం జూలై 24 (జనంసాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం లోని నిషేధిత జలపాతలపై బర్లగూడెం సర్పంచ్ ఆదిలక్ష్మి, సెక్రటరీ మౌనిక ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఎస్సై తిరుపతి రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జిల్లాలో గల బర్లగూడెం పంచాయతీ పరిధిలోని మహితపురం జలపాతాన్ని సందర్శన తాత్కాలికంగా నిషేదించడం జరిగిందని అన్నారు. తెలంగాణ ప్రాంతం లో కొన్ని జలపాతాలు పర్యాటకుల భద్రత, ప్రమాదాలు, దట్టమైన అడవి వంటి కారణాల వల్ల ప్రభుత్వం నిషేధిత జలపాతలుగా ప్రకటించచింది. ముఖ్యం గా వర్షకాలంలో వరదఉధృతం పెరగడం వలన అధికారిక అనుమతి లేని ప్రదేశాలకు వెళ్లడం చట్ట రీత్యా నేరం అని అన్నారు.సహకరించని వారిపై జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వెంకటాపురం పరిధిలో ని ఈ జలపాతం ఎంతో అందంగా ఉన్నప్పటికీ, ఇక్కడికి వెళ్లే దారి ప్రమాదకరం కావడం వలన దీన్ని నిషేడించారు. గతం పర్యాటకులు చిక్కుకొని పోవడం వలన దీన్ని నిషేదించారు. దట్ట మైన అడవి, లోతైన నీటి కొండలు ప్రమాద కరమైన రాళ్లు కారణంగా పర్యాటకులకు అనుమతి నిరకరించరాని తెలిపారు. గతంలో ప్రమాదాలు జరగడం వలన భారీ వర్షాల సమయంలో ఈ జలపాతాన్ని పర్యాటకుల కోసం పూర్తి మూసి వేస్తారని అన్నారు.ప్రజలు భద్రత దృష్ట్యా అధికారుల చూచనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఉత్తర్వులు వేలువడె వరకు మహితపురం వాటర్ పాల్స్ వెళ్ళ వద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పారెస్ట్ అధికారులు, ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- టీబీ వ్యాధికి చికిత్స పొందుతున్న వారికి పోషకాహార కిట్లు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి జూలై 24 (జనంసాక్షి) :** టీబీ ముక్త్ భారత్ అభయాన్ -2.0లో భాగంగా ఈ రోజు మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నిక్షయ్ మిత్రల గుర్తింపు మరియు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీజిల్లాలో క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సమీక్ష సమావేశం నిర్వహించారు. నిక్షయ్ మిత్రల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, బ్యాంకులు మరియు ఇతర దాతృత్వ సంస్థల నిధులను సమీకరించి, నిక్షయ్ మిత్రల భాగస్వామ్యంతో టీబీ రోగులకు పోషకాహార కిట్లను అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అర్హులైన టీబీ రోగులను గుర్తించి, వారికి చికిత్స కాలమంతా క్రమం తప్పకుండా పోషకాహార కిట్లు అందేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమ అధికారులు సంబంధిత శాఖలు, పరిశ్రమలు, బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసి నిక్షయ్ మిత్రల నమోదు, భాగస్వామ్యాల విస్తరణ మరియు పోషకాహార కిట్ల పంపిణీపై నెలవారీ పురోగతిని సమీక్షించాలని సమావేశంలో నిర్ణయించబడింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య,రాష్ట్ర నిక్షయి మిత్ర ప్రోగ్రామ్ అధికారి వేము కుమార్ కారంపూడి,ఇంచార్జ్ జిల్లా క్షయనియంత్రణ అధికారి డిప్యూటీ డీఎంఎచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 జూలై 2026

# సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం

- డీఏవీ పాఠశాలను ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి



**మణుగూరు, జూలై 24 (జనంసాక్షి) :** రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి కీలక సంస్థ అని, సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని సింగరేణి బీటీపీఎస్, ప్రకాశం ఖని (పీకేఓసీ) ఓపెన్‌కాస్ట్ గనిని ఆయన సందర్శించారు. మొదట భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు వినియోగం, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. అనంతరం భద్రాద్రి పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డీఏవీ పాఠశాలను భట్టి విక్రమార్క ప్రారంభించారు. పాఠశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర మౌలిక వసతులను పరిశీలించారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన చర్యలను అభినందించారు.

### పీకేఓసీ గని పరిశీలన

మణుగూరు ప్రకాశం ఖని (పీకేఓసీ) ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి గనిలో జరుగుతున్న తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, యంత్రాల పనితీరు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. 1976లో ప్రారంభమైన గని చరిత్ర, ఇప్పటివరకు జరిగిన బొగ్గు ఉత్పత్తి, అందుబాటులో ఉన్న నిల్వలు, గని జీవితకాలం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వలను పెంచడంతో పాటు ఉత్పత్తి విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.

### పర్యటనపై కార్మికుల్లో అసంతృప్తి

అయితే డిప్యూటీ సీఎం పర్యటనపై స్థానికంగా కొంత అసంతృప్తి వ్యక్తమైంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఉదయం 9.30 గంటలకు డీఏవీ పాఠశాల ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కావాల్సి ఉండగా, కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైందని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతరులు సుదీర్ఘంగా వేచి చూడాల్సి వచ్చిందని తెలిపారు. మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు కార్యక్రమానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పాఠశాల భవనాన్ని ప్రారంభించి పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడకపోవడం నిరాశ కలిగించిందని పలువురు పేర్కొన్నారు.
అదేవిధంగా పాఠశాల కార్యక్రమం అనంతరం సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో జరగాల్సిన సమావేశానికి కూడా డిప్యూటీ సీఎం హాజరుకాలేదని సమాచారం. తమ సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైన కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయన రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. ప్రజాప్రతినిధులు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల షెడ్యూల్‌ను పాటించి ప్రజలు, విద్యార్థులు, కార్మికుల సమయానికి విలువ ఇవ్వాలని స్థానికులు కోరారు. కాగా, పీకేఓసీ డిప్‌సైడ్ కోల్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌సీసీఎల్ సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, టీఎస్‌జెన్‌కో సీఎండీ హరీష్, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ గౌతమ్ పొట్రూ, ఐటీడీఏ పీఓ రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, సింగరేణి జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఏజీఎం రమేష్, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ




**చింతపల్లి, జూలై 24 (జనంసాక్షి) :** చింతపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను దేవరకొండ డీఎస్పీ శ్రీనివాస రావు శుక్రవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల నిర్వహణ, స్టేషన్ పరిపాలన, ఆయుధాగారం, మాల్ఖానా, సిబ్బంది హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించిన డీఎస్పీ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కృషి చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి సీఐ రాజు, ఎస్సై రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్లాక్‌స్పాట్లలో భద్రతా పనులు త్వరగా పూర్తి చేయాలి



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 24 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో రోడ్డు భద్రతా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాణాంతక ప్రమాదాలకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ట్రక్కుల అక్రమ పార్కింగ్‌ను అరికట్టి ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలని తెలిపారు. బెల్ట్ షాపులు, బార్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. జాతీయ రహదారులపై అక్రమ ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధమైన యాక్సెస్ రోడ్లను తొలగించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, రెడ్‌జోన్ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలను నియంత్రించి ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని తెలిపారు. ఖమ్మం, కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో నో-వెండింగ్/రెడ్‌జోన్ ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బెంగళూరు తరహా శాస్త్రీయ పార్కింగ్ విధానాన్ని జిల్లాలో అమలు చేసి మూడు నుంచి ఆరు నెలల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

## చేపల చెరువు సమస్యపై స్పష్టత ఇవ్వాలి

- సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు



**నర్వ, జూలై 24 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని చేపల చెరువు వివాదం మంత్రి దాకా చేరింది,ప్రజలకు ఇబ్బంది కలిగితే తక్షణమే చర్యలు తీసుకోవాలని చాపల చెరువు నిర్మాణం వల్ల గ్రామప్రజలకు,రైతులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నర్వ గ్రామపెద్దలు, యువకులు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు చాపల చెరువు నిర్మాణం వల్ల నర్వ పెద్ద చెరువుకు వచ్చే సహజ నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని వివరించారు.ఈప్పటికే వానలులేక ప్రజలు ఇబ్బందులకు గురవుతుంటే మళ్ళీ చెరువు సమస్య ఒకటాని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు,దీనివల్ల నర్వ ఉంధ్యేకోడ్,యాంకి గ్రామాల రైతులకు కూడా ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు.గ్రామస్తుల సమస్యను విన్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పందిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా నిర్మాణం చేపట్టినట్లయితే సంబంధిత వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ మురళికి సూచించారు.అనంతరం గ్రామ ప్రజలు మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు.చాపల చెరువు నిర్మాణం వల్లకలిగే ఇబ్బందులను వివరించారు.దీనిపై స్పందించిన అదనపు డైరెక్టర్ మురళి సమస్యపై తక్షణమే చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.ఒక్కరి ప్రయోజనం కోసం మూడు గ్రామాల ప్రజలు,రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపెద్దలు,యువకులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో నర్వ గ్రామ సర్పంచ్,హన్మంత్ రెడ్డి శంకర్ దండు అయ్యప్ప,కృష్ణరెడ్డి,వెంకట్రాంరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్, కదుమూర్ జగన్మోహన్ రెడ్డి,చెంద్రశేఖర్ రెడ్డి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## వైటీపీఎస్ ప్రైవేటీకరణ ప్రతిపాదనలను నిలిపివేయాలి

- డిప్యూటీ సీఎం భట్టికి విద్యుత్ జేఏసీ నాయకుల వినతి



**కొత్తగూడెం క్రైమ్, జూలై 24 (జనం సాక్షి) :** వైటీపీఎస్ (యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్)లోనే యాష్ ప్లాంట్,కోల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదన లను నిలిపివేయాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను (తెలంగాణ పవర్ ఎంప్లాయిస్) నాయకులు కోరారు. మణుగూరు లోని బీటీపీఎస్ సందర్శనకు శుక్రవారం వచ్చిన ఆయనను జేఏసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు హీూ. వజీర్, బీటీపీఎస్ రీజినల్ కన్వీనర్ యస్. శ్రీనివాసరెడ్డి, నాయకులు రవి ప్రసాద్, నరేష్, తదితరులు కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు సమస్యలు భట్టి దృష్టికి తీసుకుని వెళ్లారు. విద్యుత్ ఉద్యోగులకు ఈ ఏప్రిల్ నుంచి ౹ా=జ ( పే-రివిజన్ కమిటీ )పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న ౹ా=జ ని వెంటనే అమలు చేయాలని కోరారు. సింగరేణి నుంచి బొగ్గు సరఫరా కోసం నిర్మాణం అవుతున్న రైల్వే లైన్, ఉద్యోగుల క్వార్టర్స్ ని వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. జెన్కోవ్యాప్తంగా ఉన్న ఇంజనీర్స్ ని రేషనలైజ్ చేసి జనరల్ ట్రాన్స్ఫర్ చేయాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో కార్మికుల కోసం శాంక్షన్డ్ పోస్టు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన ఏఈ లకు ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్‌ని పెంచాలని కోరారు.

### ఎనర్జీ సెక్రెటరీ,జెన్కో సిఎండిలకు వినతిపత్రం

బిటిపిఎస్ పర్యటనకు వచ్చిన ఎనర్జీ సెక్రెటరీ నవీన్ మిట్టల్,జెన్కో సిఎండి హరీష్ లకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.౹ా=జ అమలు చేయాలని, వైటిపిఎస్ పాక్షిక ప్రైవేటీకరణ ప్రతిపాదనలను నిలిపివేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జేఏసీ నాయకులు,కార్మిక సంఘం-1535 జెనకో ప్రెసిడెంట్ యం. శ్రీధర్, బిటిపిఎస్ ప్రెసిడెంట్ వి.ప్రసాద్, కార్మిక సంఘం- 327 అధ్యక్షులు కృష్ణ ఏఐటియుసి నాయకులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు, మంజీరా ఎల్ఐఎస్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 24 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు మరియు మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పరిధిలో చేపడుతున్న భూసేకరణ పనులు, ప్రాజెక్టుల అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధ్యక్షతన శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత గల సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన ప్రతి దశను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భూ యజమానులకు సంబంధించిన సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని, పరిహారం చెల్లింపులు నిబంధనల మేరకు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పనులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేసి, ప్రజలకు సాగునీటి ప్రయోజనాలు త్వరగా అందేలా కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (నీటిపారుదల శాఖ), కామారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, భూసేకరణ సూపరింటెండెంట్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

- సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్



**సూర్యాపేట, జూలై 24 (జనంసాక్షి) :** జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు, రాత్రి వేళల్లో భద్రతను మరింత బలోపేతం చేయడానికి సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్ శుక్రవారం సూర్యాపేట పట్టణంలో ఎఫ్సిఐ గోదాం జంక్షన్ వద్ద బ్లాక్ స్పాట్ పరిశీలించారు. అనంతరం డిఎస్పీ కార్యాలయం నందు ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, సూర్యాపేట టౌన్ పోలీసులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ హైవేలపై రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత తీవ్రతరం చేయాలని ఆదేశించారు.వాహనదారులు తమ వాహనాలను రహదారిపై నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, అలాంటి వారిపై తక్షణమే చలాన్లు విధించడానికి ఒక ప్రత్యేక వాట్సాప్,కమ్యూనికేషన్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు పక్కన వాహనాలను ఆపకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు.అనంతరం డిఎస్పీ సూర్యాపేట హైవే పరిధిలోని పలు ప్రమాదకర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన కొన్ని గుంతలను గుర్తించారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఆ గుంతలను 24 గంటల్లోగా పూడ్చివేసి, సమస్యను పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట టౌన్ పోలీస్ సిబ్బంది, హైవే అథారిటీ ప్రతినిధులు, హైవే పెట్రోలింగ్ బృందం పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనాలను తనిఖీలు చేసిన అదనపు కలెక్టర్ నర్సింగరావు

**మల్దకల్, జూలై 24 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాఅదనపు కలెక్టర్ నర్సింగ్ రావు సందర్శించారు.అనంతరం కార్యాలయంలో మిషన్ భగీరథ వాటర్ సప్లై చేసే వారి వివరాలు గట్టు, మల్దకల్,అయిజ మండలం చెందిన వారితో సమావేశం నిర్వహించి వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. బిజ్వారం,గ్రామ పంచాయతీ కార్యదర్శిని రికార్డ్స్ అడుగగా కొన్ని రికార్డ్స్ వేరేదగ్గర ఉన్నవి అని సమాధానం చెప్పినందుకు అతనికి మెమో ఇవ్వాలని ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం మేకలసొంపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ



నూతనంగా నిర్మాణం జరుగుతున్న గ్రామ పంచాయతీ భవనం, మహిళా భవనం,స్కూల్ టాయిలెట్ లను తనిఖీలు చేశారు.పాఠశాల తనిఖీ చేసి విద్యార్థులు గదిలోని పాఠాలను బోధించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనము అందించాలని సంబంధిత హెడ్మాస్టర్ కు ఆదేశించారు. ఈయన వెంట ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఎంపీఓ జాకీర్ భాష తదితరులు ఉన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించే వరకు బీజేవైఎం పోరాటం



**మక్తల్, జూలై 24 (జనంసాక్షి) :** బిజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో బిజెవైఎం ఆధ్వర్యంలో పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలకై శుక్రవారం ఉద్యమ కార్యాచరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫీజుల బకాయి - బీజేపీ లడాయి పేరిట రూపొందించిన పోస్టర్‌ను బిజెవైఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### రేపటి నుంచి విస్తృత ఉద్యమం

పెండింగ్ బకాయిలు విడుదల చేసేంత వరకు తమ ఉద్యమాన్ని రోజువారీగా కొనసాగిస్తామని భరత్ స్పష్టం చేశారు. శనివారం నుండి అన్ని కళాశాలలను సందర్శించి ప్రతీ విద్యార్థిని కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం నాయకులు పి.కె. నరసింహా, మహేష్ సాగర్, మంజునాథ్, వన్నవాడ శ్రీకాంత్, గోవర్ధన్, రాజా గౌడ్, నాగరాజు గౌడ్, బ్యాటరీ రాజు, ప్రవీణ్, అంజి, నవీన్, పాపి రెడ్డి, జావేద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

- జిల్లాలో 92.69 శాతం పూర్తయిన డిజిటలైజేషన్
- తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 24 (జనంసాక్షి) :** జిల్లాలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ శరవేగంగా సాగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాను పారదర్శకమైన, తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందని పేర్కొన్నారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా, డిజిటలైజేషన్ పురోగతిపై పలు అంశాలను వెల్లడించారు.

92.69 శాతం డిజిటలైజేషన్ పూర్తి

జిల్లా వ్యాప్తంగా సర్ ప్రక్రియ ఓటర్ల వివరాలను ఆన్‌లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని వివరించారు. జిల్లాలో మొత్తం 1008252 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 934581 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. దాదాపు 92.69 శాతం పని పూర్తయిందని, మిగిలిన 73671 మంది ఓటర్ల డేటాను కూడా త్వరలోనే సిస్టమ్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సరిగ్గా ఉండేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలోని 1205 పోలింగ్ కేంద్రాలకు గానూ ప్రతి బీఎల్ఓ తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు చనిపోయిన వారు, శాశ్వతంగా ఇళ్లు మారిన వారి వివరాలను ఒకటి కంటే ఎక్కువ చోటూ ఓటు ఉన్నవారిని ఎప్పటికప్పుడు గుర్తించి నమోదు చేస్తున్నారని వివరించారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా ఓటరు కార్డుల్లో తప్పులు దొర్లకుండా, డూప్లికేట్ ఓట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.సాంకేతికతను ఉపయోగించుకుని ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నామని వెల్లడించారు.




# చమురు మంటలు

## మెర్సిడెస్ బెంజ్ హైబ్రిడ్ ఈవీ

**దిల్లీ:** మెర్సిడెస్ బెంజ్ ఇండియా, ఏఎంజీ ఇ53 ప్లగ్ ఇన్ హైబ్రిడ్ విద్యుత్ వాహనాన్ని (ఈవీ) రెండు ఎడిషన్లలో విడుదల చేసింది. వీటి ధరలు వరుసగా రూ.1.45 కోట్లు, రూ.1.48 కోట్లు (ఎక్స్-షోరూమ్, దేశం అంతటా). పూర్తిస్థాయి ఈవీల కొనుగోలుకు ఇంకా సిద్ధంగా లేని వినియోగదార్లకు హైబ్రిడ్ ఒక వారధి వంటదని కంపెనీ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు. వినియోగదార్లు తమ అవసరాలకు అనుగుణమైన పవర్‌ట్రెయిన్‌ను ఎంచుకోవచ్చని వివరించారు. హైబ్రిడ్ ప్లగ్-ఇన్ సాంకేతికతకు ఇక్కడ విధానపరమైన మద్దతు లేకపోయినా, వినియోగదార్ల అభిరుచికి అనుగుణంగా తీసుకొస్తున్నామని సంతోష్ వివరించారు. ఈ హైబ్రిడ్ కార్లు 3.0 లీటర్ ట్విన్ టర్బో ఇన్‌లైన్-సిక్స్ 28.6 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో రూపొందాయి. 9-స్పీడ్ ఆటోమేటిక్ విత్ 4మేటిక్+ఆల్‌వీల్ డ్రైవ్‌తో తయారయ్యాయి. 3.8 సెకన్లలో 100 కి.మీ. వేగాన్ని అందుకుంటాయి. గంటకు గరిష్ఠంగా 280 కి.మీ. వేగంతో ప్రయాణించొచ్చు. పూర్తి విద్యుత్తు బ్యాటరీతో 100 కి.మీ.కు పైగా ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. లెవల్-2 అడాస్, 360 డిగ్రీ కెమెరా, 4-జోన్ క్లైమేట్ కంట్రోల్, పవర్డ్ మెమొరీ ఫ్రంట్ సీట్లు, ఫ్యూచరిస్టిక్ స్క్రీన్ హెవీ డ్యాష్‌బోర్డు లేఅవుట్, బర్మెస్టర్ 4డి సరౌండ్ సౌండ్, మల్టిపుల్ ఎయిర్‌బ్యాగుల వంటి సదుపాయాలు ఈ కార్లలో ఉన్నాయి.



## క్షణాల్లో రూ.4లక్షల కోట్ల సంపద ఆవిరి

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో కొనసాగు తున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మళ్లీ కొండెక్కడం.. పశ్చిమాసియాలో ఉద్రిక్తత లు కొనసాగుతుండటంతో సూచీలు పతనమయ్యాయి. ఈ ఉదయం సెన్సెక్స్ 700 పాయింట్లు దిగజారగా.. నిఫ్టీ 23,700 మార్క్ దిగువకు పడిపోయింది. దీంతో క్షణాల వ్యవధిలో దాదాపు రూ.4లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ (ావనిబవలీ) 715 పాయింట్ల నష్టంతో 75,675 వద్ద, నిఫ్టీ (ఔతిటబిఎ) 198 పాయింట్లు పతనమై 23,671 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు పెరిగి 96.58గా కొనసాగుతోంది. నిఫ్టీలో సిప్లా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఓఎన్జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా షేర్లు స్వల్ప లాభాల్లో ఉండగా.. ఇన్ఫోసిస్, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, రెడ్డీస్ ల్యాబ్స్, హిందాల్కో, ఇండిగో షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.



### మార్కెట్ల పతనానికి కారణాలివే..

వరుసగా ఆరో సెషన్‌లో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు దాటింది. ఈ ఒక్క నెలలోనే ముడి చమురు ధర దాదాపు 40శాతం పెరగడం గమనార్హం. ఎర్ర సముద్రంలో నౌకలపై హూతీల దాడుల నేపథ్యంలో ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇవ్వడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. వరుసగా 13వ రోజు ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలపై యూఎస్ దాడులు చేసింది. వాణిజ్య భాగస్వాములపై అమెరికా మరోసారి టారిఫ్‌లతో విరుచుకుపడింది. వెట్టి చాకిరీని కారణంగా చూపి భారత్ సహా 60 దేశాలపై 10-12.5శాతం సుంకాలు విధించింది. ఇది మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది.


### వృద్ధి భయాలు..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టటీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు

**దిల్లీ:** దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.2 వేలు తగ్గుముఖం పట్టి రూ.1.47 లక్షలకు చేరింది. వెండి సైతం కిలోకు రూ.5 వేలు తగ్గి రూ.2.24 లక్షలకు చేరింది. గరిష్ఠాల వద్ద ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో రెండు లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయని అనలిస్టులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 10 గ్రాముల పసిడి ధర రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4063 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. వెండి ఔన్సు 58.59 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దేశీయంగా బంగారం కొనుగోళ్లు నెమ్మదించడంతో వీటి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ పరిణామాలను గమనించినప్పుడు.. ఇరాన్‌పై అమెరికా దాడులు చేస్తుండడంతో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఆయిల్ ధరల్లో స్థిరత్వం వచ్చి, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ రాబడులు కాస్త తగ్గుముఖం పడితే బంగారం మళ్లీ 4100, వెండి 60 డాలర్లు దాటొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.






## 29 నుంచి మణిపాల్ హెల్త్ రూ.9275 కోట్ల ఐపీఓ

**దిల్లీ:** ప్రముఖ హాస్పిటల్ చైన్ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ.9,275 కోట్లు సమీకరించే లక్ష్యంతో జులై 29 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.560-590గా నిర్ణయించింది. రూ.77,600 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ చేపట్టనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.8000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 2.16 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ప్రమోటర్లు అయిన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు టీపీజీ ఎస్‌జీ మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మర్ ఎస్‌డీఎన్ బీహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఆసియా, ఫోనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాలు విక్రయించనున్నాయి.

### ఐపీఓ నిధులు వీటికే

ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.5,378 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణాలు తిరిగి/ ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరో అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటాల కొనుగోలుకు రూ.574 కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. జులై 28న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకోనుంది. జులై 31న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. క్యూఐబీలకు 75 శాతం, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. ఉద్యోగులకు రూ.15 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. ఒక్కో షేరుపై రూ.56 డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇన్వెస్టర్లు కనీసం 25 ఈక్విటీ షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి.




### దేశవ్యాప్తంగా హాస్పిటల్స్

మణిపాల్ హెల్త్ సంస్థకు దేశవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 38 హాస్పిటల్స్ (ప్రోఫార్మా బేసిస్‌లో 48) కలిగి ఉంది. 10,761 లైసెన్స్‌డ్ బెడ్లు నిర్వహిస్తోంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సేవలందిస్తోంది. 2025 నవంబర్‌లో 49వ హాస్పిటల్‌ను బెంగళూరులో ప్రారంభించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి తొలి ఆరు నెలల్లో రూ.4,713 కోట్ల ఆదాయాన్ని, రూ.571.8 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆగస్టు 5న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం గ్రే మార్కెట్‌లో 4 శాతం ప్రీమియం పలుకుతోంది.

## హోండా ధమాకా..

**ఒకేసారి 10 మోడళ్ల ఆవిష్కరణ**



**న్యూఢిల్లీ:**ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (ఊటూఎ) తన టూవీలర్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. దేశీయ మార్కెట్‌లోకి కొత్తగా 10 మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఏడు పూర్తిగా కొత్తవి కాగా.. మూడు మోడళ్లను అప్‌డేట్ చేసింది. స్కూటర్లు, రోడ్‌స్టర్, క్రూయిజర్, అడ్వెంచర్ విభాగానికి చెందిన టూవీలర్లు ఇందులో ఉన్నాయి. ఎఅఇ, ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఫ్లెక్స్ ఫ్యూయల్ ఆప్షన్‌తో లభించనున్నాయి. దేశీయ వాహనదారుల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా వీటిని తయారుచేయనున్నట్లు కంపెనీ తెలిపింది. వీటిని దశలవారీగా మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ధర, మార్కెట్‌లో అందుబాటు వంటి వివరాలు ఆయా మోడళ్లను లాంచ్ చేసినప్పుడు కంపెనీ వెల్లడించనుంది. హోండా ంఆఎ160: హోండా తీసుకొస్తున్న అడ్వెంచర్ స్కూటర్ ఇది. 160 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానుంది. ఇ85 ఇథనాల్ ఫ్యూయెల్‌కు సపోర్ట్ చేస్తుంది. 8.1 లీటర్ల ఫ్యూయెల్ ట్యాంక్, 27 లీటర్ల అండర్-సీట్ స్టోరేజ్ కలిగి ఉంటుంది. సీబీ 350 రేంజ్‌లో 501 సీసీ వేరియంట్‌లో సింగిల్-సిలిండర్, ఎయిర్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న రెట్రో రోడ్‌స్టర్ బైక్ ఇది. రెట్రో లుక్, మంచి రైడింగ్ అనుభవం కోరుకునే వారి కోసం ఈ బైక్‌ను తీసుకురానుంది.
హోండా రెబెల్ 300: 286 సీసీ లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో రానున్న ఎంట్రీ-లెవల్ క్రూయిజర్ బైక్ ఇది. స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యమవుతుంది.
రెబల్ 500: 471ఇఇ పారలల్-ట్విన్ ఇంజిన్‌తో దేశీయ మార్కెట్‌లోకి మరోసారి రీ ఎంట్రీ ఇస్తున్న మోడల్ ఇది. గతంలో పరిమిత సంఖ్యలో హోండా వీటిని విక్రయించింది. ఇది కూడా స్టాండర్డ్, ఇ-క్లచ్ వేరియంట్లలో లభ్యం కానుంది. హోండా నుంచి వస్తున్న ఆన్-రోడ్, ఆఫ్-రోడ్ బైక్. 293.5 సీసీ కెపాసిటీతో రానుంది. దూరపు ప్రయాణాల కోసం టూరింగ్, అడ్వెంచరస్ బైక్. గ్లోబల్‌గా విక్రయిస్తున్న ర్యాలీ బ్రాండ్ డిజైన్‌తో ఈ బైక్‌ను తీసుకురానున్నారు. హోండా తన ఈవీ పోర్ట్ ఫోలియోను మరింత విస్తరిస్తోంది. 3 ఎచిప్త్ర బ్యాటరీ సామర్థ్యంతో ఒక్కసారి ఛార్జ్ చేస్తే 151 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణిస్తుంది. 2.40 గంటల్లో 0-80 శాతం ఛార్జ్ అవుతుంది. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, స్మార్ట్ కీ వంటి ఫీచర్లు ఉన్నాయి. హోండా కొత్తగా ఇ-క్లచ్ లీవర్ టెక్నాలజీని పరిచయం చేస్తోంది. ట్రాఫిక్‌లో వాహనాన్ని నడపడం సులభతరం చేయడం కోసం క్లచ్ లీవర్‌ను ఉపయోగించకుండానే గేర్లు మార్చే సదుపాయం తీసుకొస్తోంది. ఈ సిస్టమ్ ఆటోమేటిక్‌గా క్లచ్ ఆపరేషన్స్‌ను నిర్వహిస్తుంది. మాన్యువల్‌గా ఆపరేట్ చేసే అవసరం ఉండదన్నమాట.

## హర్మూజ్‌లోనే నిలిచిన నౌకలు

- అందులోనే చిక్కుకుపోయిన 6వేల మంది నావికులు

ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సదుపాయం, కరెంటు లేకపోవడం, వారి కుటుంబాలతో మాట్లాడలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. అమెరికా-ఇరాన్‌ల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినప్పటికీ.. కొన్ని వారాల్లోనే దాని నుంచి వైదొలిగినట్లు ఇరుపక్షాలు ప్రకటించాయి. మరోవైపు చర్చలకు సిద్ధమంటూనే దాడులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో హర్మూజ్‌లో నౌకలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ దాడులకు పాల్పడటాన్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. నౌకలపై దాడులు చేస్తే ప్రతీకారంగా ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ మౌలిక సదుపాయాలపై విరుచుకుపడతామని హెచ్చరిస్తోంది.

## సిక్కింలో ఘోర విషాదం

సిమ్లా,జూలై24(జనంసాక్షి):హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లా గిరిజన ప్రాంతం పాంగిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కిలాడ్-ఉదయ్‌పూర్ రహదారిపై కదు నాలా సమీపంలో వెళ్తున్న టాటా సుమో వాహనంపై అకస్మాత్తుగా కొండ చరియలు విరిగిపడ్డాయి. భారీగా మట్టితో వాహనం పూర్తిగా కూరుకుపోవడంతో అక్కడికక్కడే 13 మంది మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు భర్మౌర్-పాంగా ఎమ్మెల్యే డాక్టర్ జనక్ రాజ్ ధ్రువీకరించారు. జిల్లా యంత్రాంగం, సహా యక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాల నేపథ్యంలో పర్వత ప్రాంతాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## ఇండిగో నష్టం రూ.238 కోట్లు

**జనంసాక్షి:**పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అధిక ఇంధన ధరల ప్రభావం దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి రూ.238 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల వివిధ దేశాల గగనతల ఆంక్షలతో విమాన సర్వీసులకు ఏర్పడిన అంతరాయాలు, విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ క్షీణించడం లాంటి అంశాలు ఇందుకు కారణమయ్యాయి. 2025-26 ఏప్రిల్-జూన్‌లో ఇండిగో రూ.2,176.30 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.21,542.60 కోట్ల నుంచి రూ.25,614.21 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలూ 34% అధికమై రూ.25,852.50 కోట్లుగా నమోదయ్యాయి. అధిక ఇంధన ధరలు, రూపాయి విలువ క్షీణత కారణంగానే ఏప్రిల్- జూన్‌లో సుమారు రూ.200 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఇండిగో తెలిపింది. ఇంధన వ్యయాలు 86% పెరిగి రూ.10,832.90 కోట్లుగా నమోదయ్యాయి. జూన్ త్రైమాసికం చివరికి ఇండిగో వద్ద 432 విమానాలు ఉన్నాయి. మొత్తం నగదు నిల్వలు రూ.52,884.60 కోట్లుగా నమోదయ్యాయి. జులై- సెప్టెంబరు త్రైమాసికంలోనూ తమ ఆర్థిక పనితీరు స్తబ్దుగానే ఉండొచ్చని ఇండిగో పేర్కొంది. ఏడాదిక్రితంతో పోలిస్తే సీట్ల సామర్థ్య వినియోగానికి ప్రామాణికమైన అవైలబుల్ సీట్ కిలోమీటర్స్ (ఏఎస్‌కే)లో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని తెలిపింది. గిరాకీ తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ప్రయాణికుల విపణిలో అత్యధిక వాటా ఉన్న ఇండిగో గత డిసెంబరులో ఒక్కసారిగా సర్వీసులు రద్దు చేయడం వల్ల.. లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడగా, ఇతర విమానాల్లో ఛార్జీలు భారీగా పెరిగాయి. విశ్రాంతి నిబంధనలకు అనుగుణంగా తగినంతమంది సిబ్బందిని ఇండిగో నియమించుకోకపోవడమే ఈ పరిస్థితికి కారణమని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పేర్కొంది. ప్రయాణికుల ఫిర్యాదు ఆధారంగా 'ఇండిగో అనుచిత వ్యాపార పద్ధతులను అనుసరించిందనే ఆరోపణలపై' సమగ్ర విచారణకు ఈ ఏడాది ఫిబ్రవరిలో సీసీఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణ ముగింపు కోసం 5 ప్రతిపాదనలను ఇండిగో సమర్పించింది. భారీ స్థాయిలో విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు.. 15 నిమిషాల్లో వర్చువల్‌గా, ఒక గంటలోగా కమాండ్ సెంటర్‌లో అందుబాటులోకి వచ్చేలా ఉన్నతాధికార్లతో సంక్షోభ నిర్వహణ బృందం ఏర్పాటు. రోజువారీ సామర్థ్యంలో 30% కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయితే ఈ బృందం రంగంలోకి దిగుతుంది. విమానాలు రద్దయితే, ప్రయాణికులకు సాయం చేయడానికి ఎల్లవేళలా అందుబాటులో ప్రత్యేక సహాయ కేంద్రం భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయినప్పుడు, వినియోగంలో లేని విమాన స్లాట్‌లను తాత్కాలికంగా విమానాశ్రయ అధికారులకు అప్పగించడం. దీనివల్ల ఇతర విమానయాన సంస్థలు అదనపు సర్వీసులను నడిపి, ప్రయాణికులను గమ్యాలకు చేరవేసే వీలుంటుంది. ప్రభావిత ప్రయాణికులకు 48-72 గంటల వ్యవధిలో, ఉచితంగా ప్రత్యామ్నాయ విమానాల్లో రీబుకింగ్ సౌకర్యం. ప్రత్యామ్నాయం లభించని ప్రయాణికులకు పూర్తి రిఫండ్‌తో పాటు డీజీసీఏ నిబంధనల ప్రకారం పరిహారం. సంక్షోభ సమయంలో ప్రయాణికుల నుంచి విపరీతమైన ఛార్జీలు వసూలు చేయకుండా, టికెట్ ధరలపై స్వచ్ఛంద పరిమితి. విమానాశ్రయాల్లో నిలిచిపోయిన ప్రయాణికులకు ఆహారం, మంచినీరు, రవాణా సౌకర్యాలు సరిగ్గా అందేలా చూడటానికి అదనపు వెండర్‌లను ఏర్పాటు చేసుకోవడం. ఈ ప్రతిపాదనలపై సాధారణ ప్రజలు, ప్రయాణికులు, పరిశ్రమ నిపుణుల నుంచి సీసీఐ అభిప్రాయాలను కోరింది. అవన్నీ సమీక్షించాక, ఈ ప్రతిపాదనలకు సీసీఐ అంగీకరిస్తే.. ఇండిగోపై విచారణ జరిమానా లేకుండా ముగుస్తుంది.




## లగ్జరీ హోటల్‌లో సౌదీ రాకుమారుడి మృతి

**లండన్:**లండన్‌లోని ఓ లగ్జరీ హోటల్‌లో సౌదీ రాకుమారుడు మృతి చెందాడు. ఆయన మృతిపై దర్యాప్తు చేసిన అధికారులు మద్యం, డ్రగ్స్, ఔష ధాలు ఒకేసారి తీసుకోవడం వల్లే మరణించినట్లు దర్యాప్తులో వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో ఈ ఘటన చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సౌదీ రాజకుమారుడు అబ్దుల్లా బిన్ ఫహద్ బిన్ అబ్దుల్లా బిన్ అబ్దుల్ అజీజ్ బిన్ జలావి అల్ సౌద్ గతేడాది నవంబర్‌లో లండన్‌లోని ఓ లగ్జరీ హోటల్‌లో బస చేశారు. నవంబరు 25న హోటల్ గదిలో స్పృహ కోల్పోయి కనిపిం చారు. సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే ఆయన ప్రాణా లు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాకుమారుడి(29) మృతిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు తాజాగా పలు కీలక విషయాలు వెల్లడించారు. అబ్దుల్లా పెద్ద మొత్తంలో మద్యం, డ్రగ్స్ తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అయితే అదే సమయంలో అతడు మద్యం మానేయడానికి ఔషధాలు కూడా వాడుతుండడం గమనార్హం. మద్యం, డ్రగ్స్, వైద్యులు సూచించిన మందులు అన్నీ ఒకేసారి తీసుకోవడంతో అవన్నీ కలిసి గుండెపోటుకు దారితీశాయని అధికారులు వెల్లడించారు. రాజకుమారుడి మృతిని సౌదీ రాయల్ కోర్టు అధికారికంగా ధ్రువీకరించింది. రియాద్‌లోని వీఐపీ ఇమామ్ తుర్కీ బిన్ అబ్దుల్లా మసీదులో అంత్యక్రియలు నిర్వహించినట్లు ప్రకటించింది. ఇదీ చదవండి: అన్ని దేశాల్లో మితిమీరిన వాచ్ ఔషధాల వినియోగం



## బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా

ఢాకా(జనంసాక్షి):బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షాబుద్దీన్ రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతోనే ఆయన తన పదవికి రాజీనామా చేశారని పేర్కొంటూ స్థానిక మీడియా వెల్లడించింది. మాజీ న్యాయవాది, అవామీ లీగ్ పార్టీకి చెందిన షాబుద్దీన్ ఏప్రిల్ 2023లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నాటి నుంచి అదే స్థానంలో కొనసాగుతున్నారు. పదవీ కాలం 2028 ఏప్రిల్ వరకు ఉన్నప్పటికీ ముందుగానే అధ్యక్ష పదవి నుంచి దిగిపోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. షేక్ హసీనా పదవీచ్యుతురాలైనప్పటి నుంచి షాబుద్దీన్ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలనుకుంటున్నట్లు పలుమార్లు బహిరంగంగానే వెల్లడించారు. హసీనా దేశం విడిచి వెళ్లిపోయాక యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేసిందని షాబుద్దీన్ గతంలో పేర్కొన్నారు. దేశ తాత్కాలిక ప్రభుత్వం తనకు తగిన గౌరవం ఇవ్వట్లేదని.. ఫిబ్రవరిలో బంగ్లా ఎన్నికలు జరిగిన అనంతరం పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. అదే నెలలో బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ క్రమంలోనే షాబుద్దీన్ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగినట్లు తెలుస్తోంది.

## విమానయాన సేవల్లోకి రావడంలేదు

**ఊహాగానాలపై స్పష్టతనిచ్చిన అదానీ సంస్థ**

దిల్లీ: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది. ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (ఒఇచిడఅ-ఓఐఎఎ) వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఓ ఒప్పందంపై సంతకం చేశాయి.

# నగరాభివృద్ధిలో జవాబుదారీతనంతో పనిచేయాలి

- సీఎంసీ స్టాండింగ్ కమిటీలో కీలక ప్రతిపాదనలకు ఆమోదం
- రోడ్లు, డ్రైన్లు, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి
- 32 ప్రాంతాల్లో ఇందిరమ్మ క్యాంటీన్లకు గ్రీన్ సిగ్నల్
- పౌరులకు నాణ్యమైన జీవన సౌకర్యాలే లక్ష్యం: జయేష్ రంజన్




**శేరిలింగంపల్లి, జూలై 24 (జనంసాక్షి):** నగర పౌరులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఇందుకు జవాబుదారీతనం, అంకితభావంతో పని చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) 6వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సేవల విస్తరణ, ప్రజా సేవల మెరుగుదల, సుస్థిర పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ముంబై జాతీయ రహదారిపై అమీన్‌పూర్ వరకు మోడల్ రోడ్ విస్తరణకు అవసరమైన విద్యుత్ లైన్లు, డీటీఆర్‌ల మార్పిడి, ఖైతలాపూర్ ఫ్లైఓవర్ నుంచి ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వరకు ట్విన్ బాక్స్ బ్యారెల్, సీసీ రోడ్డు నిర్మాణం, అంబీర్ చెరువు నుంచి శ్రీనివాస కాలనీ వరకు, మయూరినగర్‌లో బాక్స్ డ్రెయిన్ నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. చందానగర్ పీజేఆర్ స్టేడియం అభివృద్ధి, అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణంతో పాటు శేరిలింగంపల్లిలోని అశోకవనం పార్కులో సైబరాబాద్ అర్బన్ బయోడైవర్సిటీ సెంటర్ ఫర్ అవేర్‌నెస్, రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ బలోపేతం, స్వచ్ఛ సర్వేక్షణ్-2027 సన్నద్ధత, బల్క్ వేస్ట్ జనరేటర్ నిబంధనల అమలు, ఐఈసీ కార్యక్రమాలు, మూడో పక్ష పర్యవేక్షణకు సాంకేతిక మద్దతు, కన్జర్వెన్సీ సామగ్రి కొనుగోలు, ఫీల్డ్ సిబ్బందికి శిక్షణ, మెకనైజ్డ్ రోడ్ స్వీపింగ్ వాహనాల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నాలెడ్జ్ సెంటర్ అభివృద్ధి, డిజిటల్ స్టాండీలు, ఇంటరాక్టివ్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలు, కంపోస్ట్ యూనిట్లు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, మెటీరియల్ రికవరీ సెంటర్ల ఏర్పాటు, ఆస్పిరేషనల్ టాయిలెట్ల నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ లభించింది. శానిటేషన్, ఎంటమాలజీ, వెటర్నరీ విభాగాల్లో ఖాళీల భర్తీ, సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కొనుగోలు, అలాగే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32 ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ క్యాంటీన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్, జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆద్య కళ మ్యూజియంకు స్థలం కేటాయించాలి

- ఆద్య కళ పరిరక్షణ కమిటీ కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు
- ఆద్య కళ అభ్యంతరాలకు జవాబుగా బహిరంగ లేక విడుదల



**ముషీరాబాద్, జూలై 24 (జనం సాక్షి):** తెలంగాణ, దేశ ఆదివాసి జానపద కళాఖండాలను, వస్తు సంస్కృతిని కాపాడేందుకు ప్రత్యేకంగా ఆద్య కళా మ్యూజియంకు స్థలం కేటాయించాలని ఆద్య కళ పరిరక్షణ కమిటీ కన్వీనర్ వేనేపల్లిపాండురంగారావు డిమాండ్ చేశారు. 18 సంఘాల ఆధ్వర్యంలో ఆద్య కళ పై అభ్యంతరాలకు జవాబుగా మాజీ ఎమ్మెల్సీ విద్యావేత్త చుక్క రామయ్య సమక్షంలో హైదరాబాద్ విద్యానగర్ లోని వారి నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖ సంపాదకులు రామచంద్రమూర్తి, కవి రచయిత రాంప్రసాద్ రెడ్డి, రచయిత ప్రముఖ పాత్రికేయులు తాడి ప్రకాష్, ప్రొఫెసర్ మనోజ ,ఆద్య కళకు మద్దతు తెలుపుతున్న సాహిత్య సంస్కృతిక సంస్థల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆద్య కళ మ్యూజియంపై వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, ఆరోపణలపై బహిరంగ లేక విడుదల చేస్తున్నామన్నారు. తద్వారా సాహిత్య, సాంస్కృతిక సామాజిక రంగ మిత్రులు పాఠకులకు పాఠకులకు వాస్తవాలను స్పష్టం చేసేందుకు ఈ లేఖలో వివరణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్థలం లేదా భవనం కేటాయిస్తూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపణపై ఇది పూర్తిగా అవగాహన లోపమని అన్నారు. యువజన, అభ్యుదయ , పర్యాటక శాఖలో మ్యూజియం విభాగం ఉన్నందున ఆ శాఖే ఫైళ్లను నడిపిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి సంబంధిత శాఖమాత్యులు, ముఖ్య కార్యదర్శి అంగీకారంతో సంతకాలు చేశాక యుఓ నోట్ 238ని పంపడం జరిగిందన్నారు. అందులో అవసరమైన ఆర్డర్స్ జారీ చేయవచ్చని స్పష్టంగా పేర్కొన్నారన్నారు అని అన్నారు. అయితే ఉన్నత విద్యాశాఖ అధికారులు విదేశీ పర్యటనలో బిజీగా ఉండటంవల్ల అడ్మినిస్ట్రేషన్ ఆర్డర్ జారీ కాక సాంకేతికంగా ఆగింది తప్ప, ప్రభుత్వం వైపు నుండి రాజకీయ నిర్ణయంతో పాటు పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేయడం కూడా జరిగిందన్నారు. రెండు శాఖల మధ్య నడిచే ఫైలు స్వభావం వల్ల వచ్చిన ఈ సాంకేతిక సమస్యను కొందరు లోపంగా భావించి భూతద్దంలో చూపించడం సరైనది కాదన్నారు. అరుదైన జానపద ఆదివాసి కళావస్తులను భద్రపరచుకోవడానికి తగిన భవనానికి కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆద్య కళ అనేది సామాన్యమైన ప్రజల సంపద అని దీన్ని కాపాడుకోవడం కోసం ఎటువంటి పోరాటాలు ఐన చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆద్య కలలకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పిజెఆర్ స్టేడియం అభివృద్ధికి నిధుల మంజూరు పట్ల అరికెపూడి హర్షం



**శేరిలింగంపల్లి, జూలై 24 (జనంసాక్షి) :** చందానగర్ పరిధి పిజెఆర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో మౌలిక వసతుల కల్పనకై 10 కోట్ల 67 లక్షల నిధులు మంజూరుపట్ల రాష్ట్ర ప్రజాబద్ధల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గాంధీ మాట్లాడుతూ పిజెఆర్ స్టేడియం అభివృద్ధి కి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి, ఎంఏయుడి విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తోపాటు సిఎంసి కమిషనర్ డాక్టర్ జి సృజనకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పిజెఆర్ స్టేడియంకు మహర్దశ లభించనుందని, స్టేడియం అభివృద్ధి మరియు సుందరీకరణ పనులకోసం 10 కోట్ల 67 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతిరోజు 5వేల మందికి పైగా సందర్శకులు, క్రీడాకారులు, వాకర్స్, యోగ కోసం వస్తున్నారని, వారందరిని దృష్టిలో ఉంచుకొని పిజెఆర్ స్టేడియం అభివృద్ధి, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనకు ఈ నిధులు ఎంతగానో తోడ్పడుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పిజెఆర్ స్టేడియంలో ఎందరో శిక్షణపొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన గొప్ప చరిత్రగల స్టేడియం అని, తిలక్ వర్మ మరియు పుల్లెల గోపిచంద్ వంటి ప్రముఖ క్రీడాకారులు ఇక్కడే శిక్షణపొంది అంతర్జాతీయ స్థాయిలో రాణించిన విషయాన్ని అరికపూడి ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలో స్టేడియం ముఖద్వారం నిర్మాణం కొరకు 50 లక్షల రూపాయల నిధులు, స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం కొరకు 4 కోట్ల రూపాయలు, అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణంకొరకు 4 కోట్ల 67 లక్షలు మరియు వాకింగ్ ట్రాక్, కర్బ్ మరమ్మతుల కొరకు కోటి 50 లక్షల రూపాయల నిధులను కేటాయించినట్లు అరికపూడి వివరించారు.

# ఇంకా 10 రోజులే.. ఓటు హక్కును కాపాడుకోండి

- ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బీఎల్‌వోకు అందజేయండి
- నిర్లక్ష్యం చేస్తే ఓటు కోల్పోయే ప్రమాదం
- ప్రతి కుటుంబం ఫారాల సమర్పణను నిర్ధారించాలి
- ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరి భాగస్వామ్యం అవసరం



**రంగారెడ్డి, జూలై 24 (జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ముగియడానికి కేవలం 10 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ప్రతి ఓటరు వెంటనే స్పందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది అని, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో కొనసాగడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.
భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ఓటర్ల వివరాలను మరోసారి ధృవీకరిస్తున్నారు. పేరు, చిరునామా, కుటుంబ వివరాలతో పాటు ఇతర సమాచారాన్ని సరిచూసి, ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిచేసి సంతకంతో గడువులోగా సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో)కు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. గడువులోగా ఫారాలు సమర్పించకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సంబంధిత ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒకసారి పేరు తొలగితే తిరిగి నమోదు కోసం ప్రత్యేక ప్రక్రియను అనుసరించాల్సి రావడంతో పాటు మధ్యలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంట్లోని అర్హులైన ఓటర్లందరూ ఫారాలు సమర్పించారా లేదా ఒకసారి నిర్ధారించుకోవాలని, బంధువులు, స్నేహితులు, పొరుగు వారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ 57.70 శాతం పూర్తయింది. నియోజకవర్గాల వారీగా ఇబ్రహీంపట్నం 66.31 శాతం, ఎల్‌బీనగర్ 45.95 శాతం, మహేశ్వరం 50.18 శాతం, రాజేంద్రనగర్ 51.94 శాతం, శేరిలింగంపల్లి 50.88 శాతం, చేవేళ్ల 76.37 శాతం, కల్వకుర్తి 83.84 శాతం, షాద్‌నగర్ 81.82 శాతం నమోదు కాగా, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో స్పందన మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. చివరి రోజుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఆలస్యం చేయకుండా ఈ రోజే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రతి ఓటు విలువైనదని, ఓటు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు.




## హయత్‌నగర్ కోర్టు పరిసరాలలో మౌలిక వసతుల

**సమస్యల పరిశీలన చేసిన కళ్లెం నవజీవన్ రెడ్డి**

**హయత్‌నగర్, జూలై 24 (జనం సాక్షి):** హయత్‌నగర్ కోర్టు పరిసర ప్రాంతంలో డ్రైనేజీ అవుట్‌లెట్లు సరిగా లేకపోవడం, రైన్‌వాటర్ అవుట్‌లెట్లు మూసుకుపోవడం, పలు ప్రాంతాల్లో స్ట్రీట్‌లైట్లు పనిచేయకపోవడంతో ప్రజలు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చే సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం సమస్యలను పరిశీలించారు. పలువురు న్యాయవాదులు ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన నవజీవన్ రెడ్డి, జలమండలి అధికారులు, స్ట్రీట్‌లైట్ విభాగం సిబ్బందితో కలిసి కోర్టు పరిసర ప్రాంతాన్ని సందర్శించి డ్రైనేజీ, రైన్‌వాటర్ అవుట్‌లెట్లు, స్ట్రీట్‌లైట్ల పరిస్థితిని పరిశీలించారు.
ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించి, రైన్‌వాటర్ అవుట్‌లెట్లను శుభ్రపరచడంతో పాటు పనిచేయని స్ట్రీట్‌లైట్లను వెంటనే మరమ్మతులు చేసి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత అని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటానని కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రియాంక, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పంతులు, ప్రధాన కార్యదర్శి ఎ. రామ్ మోహన్, లేడీ ప్రతినిధి భార్గవి, స్పోర్ట్స్ సెక్రటరీ మసీదు శివ, కార్యవర్గ సభ్యులు సాయి కృష్ణ, గోపి శంకర్, మాధురి, పద్మ, సతీష్ రాజా, సాంబశివుడు, బార్ సభ్యులు కె. సురేందర్ రెడ్డి, హేమంత్ ప్రవీణ్, శంకర్ మంచాల, మేకల సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ విద్యార్థుల పోరాటానికి సంఘీభావం

**ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్ జులై 24 (జనం సాక్షి) :** ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన అణచివేతను ఖండిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భారీ ర్యాలీగా నిరసన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తపరిచే హక్కును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. నిరుద్యోగులు, యువత సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శిస్తూ, యువత న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# వన్ డే-వన్ వార్డ్'లో పౌర సమస్యలపై కమిషనర్ సమీక్ష

- శేరిలింగంపల్లి వార్డులో క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల పరిశీలన
- డ్రైనేజీ, రోడ్లు, పార్కులు, ట్రాఫిక్ సమస్యలపై స్థానికుల వినతి
- ప్రాధాన్యంగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలే లక్ష్యం



**శేరిలింగంపల్లి, జూలై 24 (జనంసాక్షి):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వన్ డే-వన్ వార్డ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శేరిలింగంపల్లి వార్డులో కమిషనర్ డాక్టర్ జి. సృజన క్షేత్రస్థాయిలో పర్యటించి పౌర సమస్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, డిప్యూటీ కమిషనర్‌తో కలిసి వార్డులోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు.
పర్యటన సందర్భంగా డోయెన్స్ టౌన్‌షిప్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ వార్డు పరిధిలోని సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, నాలాలు, చెరువుల పునరుద్ధరణ, సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు, చెట్ల కొమ్మల తొలగింపు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు, ట్రాఫిక్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, అక్రమ నిర్మాణాల నియంత్రణ, దోమల నివారణ, మార్కెట్ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలన్నింటినీ అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని శాఖల మధ్య సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల అమలును క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు కంప్లయన్స్ నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను సమీక్షించడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి మెరుగైన మున్సిపల్ సేవలు అందించడమే 'వన్ డే-వన్ వార్డ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కమిషనర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, యూబీడీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పవిత్ర వస్తువులను నీటి వనరుల్లో వేయొద్దు

- 'ప్రాజెక్ట్ ఉద్వాసన-దైవిక డ్రైవ్'కు ప్రజల సహకారం అవసరం
- పవిత్ర వస్తువులకు గౌరవప్రదమైన వీడ్కోలు కల్పించాలి
- విశ్వాసాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
- ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పిలుపు




**ఉప్పల్, జూలై 24 (జనంసాక్షి):** పాత దేవుళ్ల చిత్రాలు, ఫోటోలు, ఫ్రేములు, విగ్రహాలు వంటి పవిత్ర వస్తువులను చెరువులు, కాలువలు, కుంటలు లేదా బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా బాధ్యతాయుతంగా అప్పగించాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా (ఐఏఎస్) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ ఉద్వాసన--దైవిక డ్రైవ్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.
పాతబడి వినియోగానికి పనికిరాని పవిత్ర వస్తువులను సాధారణ చెత్తలో కలపడం లేదా నీటి వనరుల్లో వేయడం వల్ల ప్రజల ఆధ్యాత్మిక భావాలు దెబ్బతినడంతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అందుకే వాటిని ప్రత్యేకంగా సేకరించి సంప్రదాయాలకు అనుగుణంగా గౌరవప్రదంగా నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.
విగ్రహాల తయారీలో ఉపయోగించే రంగులు, రసాయనాలు నీటిలో కలవడం వల్ల చెరువులు, కాలువలు, సరస్సులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. అందువల్ల పవిత్ర వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్రత్యేక సేకరణ వ్యవస్థకు అప్పగించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఒకవైపు ప్రజల విశ్వాసాలకు గౌరవం లభించడంతో పాటు మరోవైపు నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందుతుందని రాధిక గుప్తా తెలిపారు. ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములై పాత దేవుళ్ల చిత్రాలు, విగ్రహాలు, ఫ్రేములు తదితర పవిత్ర వస్తువులను బాధ్యతాయుతంగా అప్పగించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. "పవిత్రతను గౌరవిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం.. పరిశుభ్రమైన ఉప్పల్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పిలుపునిచ్చారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. భవిష్యత్తును కాపాడుకోవాలి

### యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడడం అందరి బాధ్యత

- స్నేహితుల ఒత్తిడికి లొంగొద్దని విద్యార్థులకు సూచన
- రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు
- విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

**ఉప్పల్/రామంతాపూర్, జూలై 24 (జనంసాక్షి):** యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప్పల్ పోలీస్ స్టేషన్ డీఐ రవికుమార్ అన్నారు. విద్యార్థి దశలోనే మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు. రామంతాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీస్తుందని డీఐ పేర్కొన్నారు. సరదా కోసం లేదా స్నేహితుల ఒత్తిడితో మొదలయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు ప్రయత్నించాలని ప్రోత్సహించినా వెంటనే తిరస్కరించాలని, "ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదు" అనే భావనతో వాటి వైపు వెళ్లవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై ఆసక్తి తగ్గి లక్ష్యాలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.
కుటుంబ సంబంధాలు దెబ్బతినడం, ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిడి, నేరాల వైపు మళ్లే పరిస్థితులు కూడా తలెత్తవచ్చని వివరించారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని, మంచి స్నేహితులను ఎంచుకోవడంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించి అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థుల చేత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. యువత ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడుపుతూ దేశానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని డీఐ రవికుమార్ పిలుపునిచ్చారు.

# జూలై 30లోగా ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి

**హయత్‌నగర్, జూలై 24 (జనం సాక్షి) :** జూలై 30వ తేదీలోగా అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యూమరేషన్ ఫారం నింపి సమర్పించేలా కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. బీఎల్ఏల నుంచి ప్రతిరోజూ ఎన్యూమరేషన్ పురోగతి నివేదికలను సేకరించి టీపీసీసీకి పంపాలని సూచించారు. హయత్‌నగర్ టీ నగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారం నింపి బీఎల్ఓ లకు అందజేసేలా నాయకులు బాధ్యతగా పని చేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పేదల ఓట్ల తొలగింపుతో బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి బూత్‌ల వారీగా రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు. ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 44 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమే తిరిగి వచ్చాయని తెలిపారు. ఈఆర్ వో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు హెల్ప్ డెస్క్‌లను ప్రజలు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో సమర్థవంతంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ ప్రతినిధులను అభినందించి సన్మానించారు.

# విద్యార్థుల స్వరాన్ని అణచలేరు: కేటీఆర్

- ఢిల్లీలో విద్యార్థులపై చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ ధర్నా
- యువత ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్
- పేపర్ లీకులు, నిరుద్యోగంపై కేంద్రాన్ని నిలదీసిన కేటీఆర్
- విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్



**ముషీరాబాద్, జూలై 24 (జనంసాక్షి):** ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు చర్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, న్యాయమైన ప్రశ్నలు అడుగుతున్న విద్యార్థులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. "యువత స్వరం మారుతోంది.. నవతరం మేల్కొంటోంది.. ఈ స్వరాన్ని అణచివేయడం ఎవరి వల్లా కాదు" అంటూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పేపర్ లీకులు, నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీలో జాప్యం, విద్యా వ్యవస్థలో సమస్యల కారణంగా యువత ఆందోళన చెందుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. "మేక్ ఇన్ ఇండియా" పేరుతో హామీలు ఇచ్చి చివరకు "లీక్ ఇన్ ఇండియా"గా మార్చేశారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై నమోదైన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, పోలీసు చర్యలపై కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా కోరారు. పేపర్ లీకుల అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల ఉద్యమానికి రాజకీయ రంగు పులమవద్దని, బీఆర్ఎస్ విద్యార్థుల న్యాయమైన పోరాటానికి మద్దతు తెలిపేందుకే వచ్చిందని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని విమర్శించారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి కూడా విద్యార్థుల తరపున పోరాడుతామని, యువత ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు ప్రజలకు చేరాలి

- ప్రత్యేక వైద్య సేవలపై విస్తృత ప్రచారానికి కలెక్టర్ ఆదేశం
- ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులకు బదులు ప్రభుత్వ సేవల వినియోగంపై అవగాహన
- రామగుండం జీజీహెచ్‌లో ప్రత్యేక విభాగాల ఆకస్మిక తనిఖీ
- నాణ్యమైన వైద్యంతో ప్రజల విశ్వాసం పెంచాలని సూచన



**గోదావరిఖని, జూలై 24 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ప్రత్యేక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, వాటిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ప్రత్యేక వైద్య విభాగాలు, రోగులకు అందుతున్న చికిత్స, వైద్యుల అందుబాటు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలతో అనేక ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తి సమాచారం లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అధిక ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన పెంచేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రత్యేక వైద్య విభాగానికి సంబంధించిన సేవలు, వైద్యుల అందుబాటు రోజులు, చికిత్సల వివరాలను ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా న్యూరో సర్జరీ, ఫిజియోథెరపీ, 2డీ ఎకో, అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్), పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో ఫిజీషియన్ విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. న్యూరో సర్జన్ ప్రతి బుధ, శుక్రవారాల్లో, యూరాలజీ నిపుణులు ప్రతి మంగళ, గురువారాల్లో సేవలు అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. గుండె సంబంధిత 2డీ ఎకో పరీక్షలు సోమవారం నుంచి శనివారం వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యసన విముక్తి కేంద్రంలో మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వ్యసనానికి చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు అవసరమైన శస్త్రచికిత్సలు, నరాల సంబంధిత వ్యాధుల చికిత్సలు నిరంతరాయంగా కొనసాగాలని, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రధాన ఆధారంగా నిలవాలంటే నాణ్యమైన సేవలతో పాటు ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలో మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డా. హిమబిందు సింగ్, సీఎస్ ఆర్ ఎంఓ డా. కృపాబాయి, డా. అప్పారావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో ఘనంగా సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీలు ప్రారంభం

- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వకడే
- చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి
- ఏపీ, తెలంగాణ నుంచి భారీగా తరలివచ్చిన జట్లు
- ఉత్సాహంగా సాగిన తొలి రోజు పోటీలు



**కరీంనగర్ బ్యూరో, జూలై 24 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో సీబీఎస్ఈ పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వకడే, అసిస్టెంట్ కలెక్టర్ పి. హరిప్రసాద్, రీజనల్ ఆఫీసర్ జంగం సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతి మాతకు పూజలు, జ్యోతి ప్రజ్వలన అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వకడే విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను కల్పిస్తాయని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తూ జాతీయ స్థాయి పోటీల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందాయని అతిథులు కొనియాడారు. సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థులకు అన్ని క్రీడా సౌకర్యాలు కల్పిస్తూ ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. అసిస్టెంట్ కలెక్టర్ పి. హరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థి జీవితంలో అంతర్భాగమని, లక్ష్యసాధనకు ఏకాగ్రత, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. రీజనల్ ఆఫీసర్ జంగం సునీల్ కుమార్ మాట్లాడుతూ సీబీఎస్ఈ ప్రతి ఏడాది నిర్వహించే క్లస్టర్ గేమ్స్ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నాయని అన్నారు.

వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అండర్-14 విభాగంలో జ్యోతి విద్యాలయం, వాసవి పీఎస్, లిటిల్ స్కాలర్స్ జట్లు విజయం సాధించగా, అండర్-17 విభాగంలో శ్లోక బిర్లా స్కూల్, సంఘమిత్ర స్కూల్, సెయింట్ ఆండ్రూవ్స్ స్కూల్ జట్లు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, సాంకేతిక అధికారులు, కోచ్‌లు, మేనేజర్లు, తల్లిదండ్రులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాల బాట

- మేడిపల్లి, భీమారం మండలాల్లో తొలిసారి కోతలు
- 26 మంది రైతులకు 50 టన్నుల దిగుబడి
- టన్నుకు రూ.24 వేల ధరతో రైతుల్లో ఆనందం
- వరికి బదులు ఉద్యాన, ఆయిల్ పామ్ పంటలపై దృష్టి పెట్టాలి: లత



**ఉమ్మడి మేడిపల్లి, జూలై 24 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మేడిపల్లి, భీమారం మండలాల్లో తొలిసారిగా సాగు చేసిన ఆయిల్ పామ్ పంట కోతలు ప్రారంభమయ్యాయి. తొలి విడతలో 26 మంది రైతులకు సుమారు 50 టన్నుల గెలల దిగుబడి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. టన్నుకు రూ.24 వేల ధర లభిస్తుండటంతో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో మరింత ఆసక్తి పెరిగింది.

పంట కోత కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి లత, హెచ్‌వో మంజువాణి, హెచ్‌ఈవో అనిల్ కుమార్, లోహియా కంపెనీ ప్రతినిధి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందిస్తోందని తెలిపారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం సాధ్యమవుతుండటంతో రైతుల విశ్వాసం ఫలించిందన్నారు.

అనంతరం భీమారం మండలం వెంకట్రావుపేటలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న లత, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించాలని రైతులకు సూచించారు. ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు డ్రిప్ ఇరిగేషన్, మొక్కలపై భారీ సబ్సిడీలు అందిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్ తోటల ప్రారంభ దశలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. నీటి లభ్యతకు అనుగుణంగా ఉద్యాన శాఖ అధికారుల సూచనలు పాటించి లాభదాయకమైన పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట సర్పంచ్ శ్రీనివాస్, హెచ్‌వో మంజువాణి, హెచ్‌ఈవో అనిల్ కుమార్, ఏఈవో నరేందర్, లోహియా కంపెనీ ప్రతినిధి భరత్, రైతులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశికి గోదావరి తీరంలో పకడ్బందీ ఏర్పాట్లు

**మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్**



**మంథని, జూలై 24, (జనంసాక్షి) :** ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంథని గోదావరి తీరానికి పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల సౌకర్యంకోసం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి ఆయన గోదావరి తీరంలో ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదావరి పుణ్య స్నానాల కోసం మంథని మండలం నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు గోదావరి పుణ్య స్నానాలు ఆచరించడానికి వస్తారని అన్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సాన ఘట్టాలను ఏర్పాటు చేయడంతో పాటు, షవర్లు,మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను సైతం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గోదావరి తీరంలో పరిశుభ్రంగా ఉండే విధంగా తీర ప్రాంతమంతా శుభ్రంగా చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లించడం జరిగిందన్నారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించి శుభ్రపరచడం జరిగిందన్నారు. తీరంలో విద్యుత్ లైట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రాత్రి సమయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గోదావరి ప్రాంతానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసుల సహాయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథనిలో గోదావరి తీరంలో అత్యాధునికంగా రూ. 20కోట్లతో మహా ప్రస్థానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహాప్రస్థానంలో అన్ని రకాల సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల గోదావరి తీరంలో ఉన్న మహాప్రస్థానం మాదిరిగానే మంథనిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జంబోజు సమ్మయ్య తదితరులు ఉన్నారు.



## నారాయణపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**గంగాధర, జనంసాక్షి :** మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బండి రాజేశ్వరి పరిశీలించారు. రిజర్వాయర్ చెరువు కట్టపైకి వెళ్ళి పరిశీలించి కట్ట ఎత్తు వెడల్పు ఎక్కడి వరకు ఉంటుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు, నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి గ్రామంలోని మొత్తం ఇండ్లకు నష్టపరిహారం అందించి అదుకోవాలని గ్రామస్తులు వినతి పత్రం అందించగా సమస్యను పరిశీలించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట తహశీల్దార్ రజిత, ఆర్ఐ సంతోష్, గ్రామ సర్పంచ్ దీకొండ బాబా లక్ష్మీ మధు, ఇరిగేషన్ ఈఈ బాలకృష్ణ, డిఈ భాస్కర్, బందోబస్త్ నిమిత్తం సిఐ, ఎస్ఐ వంశీకృష్ణ, జిపిఓ, మరియు గ్రామస్తులు ఉన్నారు.

# గిఫ్ట్ ఎ స్మైల్ పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ

**సిరిసిల్ల ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో జూలై 24 (జనం సాక్షి) ;**
కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయితీ పారిశుద్ద కార్మికులకు బట్టలను ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలినో ప్రభావం వల్ల వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులపై జరుగుతున్న దాడికి నిరసిస్తూ వారికి సంఘీభావంగా స్థానిక శాసనసభ్యులు కేటీఆర్ తన 50వ జన్మదిన వేడుకలను రద్దు చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు కూడా తన జన్మదిన వేడుకలను ఆర్భాటలకు పోకుండా ఎక్కడివారు అక్కడ నిరుపేదలకు సహాయం చేసినప్పుడే నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్టు అని పిలుపునిచ్చారు. వారి పిలుపునందుకొని తంగళ్ళపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులకు గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగంగా మొత్తం మందికి బట్టలు పంపిణీ కార్యక్రమం చేయడమైనది, కరోనా కష్టకాలంలో ప్రజలంతా లాక్ డౌన్ లో ఉంటే ప్రాణాలను పణంగా పెట్టి సేవలు చేసిన వీరికి ఏమిచ్చినా రుణం తీరదని, కేటీఆర్ బర్త్ డే సందర్భంగా ఇచ్చే ఈ చిరుకానుక చంద్రుని కోక నులిపోగు లాగా అనే సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, ప్యాక్స్ చేర్మెన్ బండి దేవదాస్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గజబింకార్ రాజన్న, మాజీ ఎంపీపీలు పడిగల మానస, పూస పెల్లి సరస్వతి, మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య, మాజీ సర్పంచ్లు అహంకారపు రవీందర్, వల్లం కొండ వేణుగోపాలరావు, శివజ్యోతి, గుగ్గిళ్ళ అంజయ్య, సురభి నవీన్ రావు, మాజీ ఎంపీటీసీలు బుస స్వప్న లింగం, ఉప సర్పంచ్ అసాని శ్రీకాంత్ రెడ్డి, వార్డు సభ్యులు సద్దరోజ, ఎగుమామిడి సరిత విజయేందర్ రెడ్డి, గంగ హన్మంత రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కందుకూరి రామా గౌడ్, గణప మదన్ రెడ్డి ,కర్నె బాలయ్య, జంగా పెల్లి శేఖర్, బిక్షపతి మహేందర్ తదితర నాయకులు గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## వరికి బదులు ఆరుతడి పంటలపై దృష్టి సారించండి

**నిజాంసాగర్ కెనాల్ వదలడం కుదరదు**
**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి**

**ఎడపల్లి, జూలై 24 ( జనంసాక్షి ) :** వరికి బదులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి కోరారు. శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి మాట్లాడుతూ, ఎల్నీనో ప్రభావం కారణంగా వరికి బదులు కంది, పెసర, మినుము పంటలు వేయాలన్నారు. వరి వేసుకున్న రైతులకు జాగ్రత్తగా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించడం జరిగింది. నిజాంసాగర్ కెనాల్ త్రాగునీటికి, పశువులకు సరిపోతుంది కాబట్టి పంటలకు ఇవ్వడం కుదరదని చెప్పడం జరిగింది. యూరియా ఇతర ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి నరసింహ మాట్లాడుతూ, రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కూరగాయలను సాగు చేసుకోవాలని సూచించారు. కూరగాయలకు సబ్సిడీపై విత్తనాలు మరియు డ్రిప్పు అందుబాటులో ఉందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా ఉద్యానవన అధికారి నరసింహ, రవి, గంగారాం పాల్గొన్నారు.

# భూ వివాదాల పరిష్కారానికే భూభారతి రీసర్వే కార్యక్రమం

- భూభారతి రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..
- ఉల్లంపల్లి అవగాహన సదస్సులో ఆర్డీవో షర్మిల



**చిగురుమామిడి జూలై 24(జనంసాక్షి):** భూ వివాదాల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రీ సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని కరీంనగర్ ఆర్డిఓ షర్మిల, ఏడి కిషన్ రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి ప్రస్తుతం అక్కడ కొనసాగుతున్న భూ భారతి భూముల రీసర్వేను రైతులు, భూయజమానులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో పిలుపునిచ్చారు. ఉల్లంపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే రికార్డులను తనిఖీ చేసి, అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల మధ్య ఉన్న భూవివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక భూభారతి రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తరం రైతులకు ఉన్న సందేహాలపై ఆర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలువాల శంకర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తహసిల్దార్ కనకయ్య, డిప్యూటీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవో రామ్మోహన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలి

- ప్రభుత్వ రాయితీలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లాకు మరిన్ని మొక్కలు తెప్పిస్తాం: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 24 (జనంసాక్షి):** దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం అందించే ఆయిల్ ఫామ్ సాగును జిల్లాలో మరింత విస్తరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సంబంధిత శాఖల అధికారు లతో కలిసి ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాలు, ప్రస్తుత పురోగతిపై ఆమె సమీక్షించారు. రైతువేదికలు, గ్రామపంచాయతీల ద్వారా ఆయిల్ ఫామ్ సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు, సాగుకు ఆసక్తి ఉన్న రైతుల వివరాల ను సిద్ధం చేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్ సాగు రైతులకు లాభదాయకమని పేర్కొన్న కలెక్టర్, ఇప్పటికే లాభాలు పొందుతున్న రైతుల తోటలకు ఇతర రైతులను తీసుకెళ్లి ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైతే జిల్లాలోనే ఆయిల్ ఫామ్ నర్సరీ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ప్రతి ఏఈవోకు 25 ఎకరాల సాగు లక్ష్యాన్ని నిర్దేశించి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాకు అవసరమైన మరిన్ని మొక్కలను ఉన్నతాధికారులతో చర్చించి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం మొక్కలపై 90 శాతం వరకు సబ్సిడీతో పాటు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, సన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 450 ఎకరాల్లో కోత పూర్తికాగా 850 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎలినో ప్రభావం.. అడుగంటిన ఆశలు

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో విలవిలలాడుతున్న 'సాగు' రంగం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 24 (జనంసాక్షి) :**
జులై 24 వచ్చింది.. వర్ష కాలం సగం రోజులు గడిచి పోయాయి. గతంలో ఈపాటికి జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లి, వరినాట్లతో పొలాలు పచ్చదనంతో కళకళలాడయి. ప్రస్తుత వర్ష కాలంలో ఎలినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ సంక్షోభంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతాంగం విలవిల్లాడుతోంది. ఆకాశంలో మేఘాలు కనువిందు చేస్తున్నాయే తప్ప చుక్క నీరు కురవడం లేదు. పత్తి విత్తనాలు వేసే సమయం దాటిపోగా, వరి సాగు సైతం తీవ్ర ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 శాతం వర్షపాతం లోటు నమోదైంది. కాలువల్లో నీరు లేక, ప్రాజెక్టు అడుగంటి, బోర్లలో నీళ్లు పడిపోయి అన్న దాతల కళ్లలో కన్నీరే మిగులుతోంది.

నైరుతి రుతుపవనాలు ముఖం చాటేయడంలో జిల్లా అంతటా వర్షాలు కురవక రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మొత్తం 13 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయింది. జిల్లాలోని మధ్య మానేరు ప్రాజెక్టు నిర్మాణ ప్రాజెక్టులో అడుగంటుతున్న నీరు.. జిల్లాలోని ప్రధాన నీటి వనరులు డెడ్ స్టోరేజీకి చేరుకునే పరిస్థితులు రానున్నాయి. శ్రీ రాజరాజేశ్వర జలాశయం మధ్య మానేరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 27.54 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.43 టీఎంసీల పైచిలుకు నీరు నిల్వ ఉంది. దీనితో పాటు కొనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్, ఇల్లంతకుంట మండలంలో అన్నపూర్ణ రిజర్వాయర్, గంభీరావుపేట మండలం నర్మాలలో అప్పర్ మానేరు ఉన్నాయి. వీటిలోనూ సామర్థ్యానికి మించి తక్కువ మొత్తంలో నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాల సైతం అడుగంటిపోయి ఉన్నాయి. దీంతో వర్షాకాలంలో పంటలకు సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలంటూ జిల్లాలో గ్రామాల వారీగా వ్యవసాయ శాఖ, ఇతర శాఖ అధికారులు గ్రామసభలు నిర్వహించి రైతులను చైతన్య పరుస్తూ పంటల సాగుకు సమయత్తం చేస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం వర్షాకాలంలో వరి ధాన్యం1,50 వేల ఎకరాలు వేయగా, పత్తి పంట 47 వేల ఎకరాలు వేశారు. ఈ వర్షాకాలంలో వరి పంట 62 వేల ఎకరాలు, పత్తి పంట 47 వేల ఎకరాలు వేసినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఏలినో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆరు తడి పంటలు వేసేందుకు రైతులను సమన్వయం చేసేందుకు వ్యవసాయ అధికారులు గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

# వీటీఏడీఏ అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

- వేములవాడలో అభివృద్ధి పనులపై కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయి పరిశీలన
- ఎఫ్‌సీఐ గోదాములు, ఆర్డీఓ కార్యాలయాలకు స్థలాల పరిశీలన
- ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, రహదారి పనులపై సమీక్ష
- అధికారుల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని సూచన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 24 (జనంసాక్షి):** వేములవాడలో ప్రతిపాదిత ఎఫ్‌సీఐ గోదాముల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలాల పరిశీలనతో పాటు వీటీఏడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం అన్ని పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం సమీపంలోని తెట్టకుంట, మారుపాక ప్రాంతాల్లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన గోదాముల నిర్మాణానికి అనువైన స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. గోదాముల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. అనంతరం చింతలఠాణ ఆర్అండ్ఆర్ కాలనీ వద్ద ప్రతిపాదించిన ఆర్డీఓ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించి సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ప్రక్రియలను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. తదుపరి వీటీఏడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాజన్న ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, గుడి చెరువు బండ్ పార్కు అభివృద్ధి, సుందరీకరణ, శ్రీ బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గుడిచెరువు అభివృద్ధి పనుల్లో ఆర్చ్‌తో పాటు తుది దశ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. బ్రిడ్జి నుంచి ఆలయం వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ భీమ్లా, ఈఈ నరసింహచారి, పర్యాటక శాఖ ఎస్ఈ సరిత, ఆలయ ఈఈ రాజేష్, నీటిపారుదల ఈఈ దయాకర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
25 జూలై 2026

# ఐపీఎస్ అధికారుల సతీమణులూ దేశసేవలో భాగస్వాములే

- సమాజ సేవ, మహిళా సాధికారతకు మరింత కృషి చేయాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, జూలై 24 (జనంసాక్షి) : ఐపీఎస్ అధికారులు దేశానికి అంకితభావంతో సేవలందించగలుగుతున్నారంటే వారి వెనుక కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వారి సతీమణుల త్యాగం, సహకారం ఎంతో కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఆ దృష్ట్యా ఐపీఎస్ అధికారుల సతీమణులు కూడా పరోక్షంగా దేశసేవలో భాగస్వాములేనని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌భవన్‌ను సందర్శించిన తెలంగాణ ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం (ఐపీఎస్ ఆఫీసర్స్ వైవ్స్ అసోసియేషన్ -ఐపీఎస్ఓడబ్ల్యూఏ) సభ్యులతో గవర్నర్ దర్బార్ హాల్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఐపీఎస్ అధికారుల కుటుంబాల సంక్షేమంతో పాటు సమాజ సేవ, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లోనూ సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలని గవర్నర్ సూచించారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకొచ్చే కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. అంతకుముందు గవర్నర్ సతీమణి జానకి శుక్లా తో 50 మంది ఐపీఎస్ అధికారుల సతీమణులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ, సామాజిక సేవా కార్యక్రమాలను ఆమెకు వివరించారు. అనంతరం లోక్‌భవన్‌లోని మెయిన్ హౌస్, దర్బార్ హాల్, ఉద్యానవనాలను సందర్శించారు. ఈ సందర్భంగా లోక్‌భవన్ విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని గవర్నర్ ఉప కార్యదర్శి జి. పల్లవి వారికి వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ సతీమణి జానకి శుక్లా ,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, డిజిపి (ప్రిజన్ అండ్ జైల్స్) సౌమ్య మిశ్రా, ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం అధ్యక్షురాలు లలితా ఆనంద్, ప్రధాన కార్యదర్శి రీతూ జైన్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరాణాచారి, గవర్నర్ ఉప కార్యదర్శి జి. పల్లవి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లింపుదారులే దేశ అభివృద్ధికి వెన్నెముక

### 167వ ఆదాయపు పన్ను దినోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

పన్ను చెల్లించడం కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు చేసే గొప్ప భాగస్వామ్యమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పన్ను చెల్లింపు దారులు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర అన్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన 167వ ఆదాయపు పన్ను దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిజాయితీగా పన్నులు చెల్లించే వారే దేశ అభివృద్ధికి నిజమైన నిశ్శబ్ద శిల్పులని గవర్నర్ పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో పన్నుల విధానానికి శాస్త్రీయమైన, ప్రజాహిత దృక్పథం ఉందని గవర్నర్ చెప్పారు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నును మౌలిక సదుపాయాలు, భద్రత, సంక్షేమ కార్యక్రమాల రూపంలో ప్రభుత్వం తిరిగి ప్రజలకే అందిస్తుందన్నారు. ఆధునిక భారత అభివృద్ధిలో పన్ను చెల్లింపుదారుల పాత్ర కీలకమని, సరిహద్దుల్లో సైనికుల ఆధునిక ఆయుధాల నుంచి గ్రామీణ రహదారులు, చంద్రయాన్, గగన్‌యాన్ వంటి అంతరిక్ష విజయాల వరకు ప్రతి అభివృద్ధి వెనుక పన్ను చెల్లింపుదారుల సహకారం ఉందన్నారు. కాలానుగుణంగా ఆదాయపు పన్ను శాఖ తన పనితీరును పూర్తిగా మార్చుకుందని గవర్నర్ ప్రశంసించారు. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్, ఈ-ప్రొసీడింగ్స్, వేగవంతమైన రీఫండ్ వ్యవస్థతో పారదర్శకత పెరిగి, పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. 'వివాద్ సే విశ్వాస్' వంటి కార్యక్రమాల ద్వారా శాఖ విశ్వాసపూర్వక భాగస్వామ్యాన్ని పెంపొందిస్తోందన్నారు. హైదరాబాద్ దేశంలో ఆవిష్కరణలు, ఐటీ, ఫార్మా, స్టార్టప్‌లకు కేంద్రంగా ఎదిగిందని, తెలంగాణ యువత ప్రతిభ దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడుతోందని పేర్కొన్నారు. "వికసిత్ భారత్--2047" లక్ష్య సాధనకు పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడంతో పాటు స్వచ్ఛంద పన్ను చెల్లింపు సంస్కృతి బలోపేతం కావాలని గవర్నర్ ఆకాంక్షించారు. పన్ను చెల్లింపుదారుల గౌరవం, విశ్వాసాన్ని కాపాడాలని అధికారులకు సూచించిన గవర్నర్, దేశ పౌరులు పన్నులు చెల్లించడాన్ని గర్వంగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రతి రూపాయి సశక్త, ఆత్మనిర్భర్ భారత నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆదాయ పన్ను ను అధికంగా వసూలు చేసిన ఆదాయపన్ను శాఖ అధికారులకు అవార్డులు అందించి అభినందించారు. ఆదాయపన్ను శాఖ మ్యాగజైన్ టాక్స్ స్పార్క్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తినీ, పూర్వ ఎపిఎస్ చైర్మన్ కేవి చౌదరి, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారుల సంఘాల ప్రతినిధులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణి చొరవతో ల్యాబ్ టెక్నీషియన్స్‌కు పోస్టింగ్స్

- చిన్నారెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన ల్యాబ్ టెక్నీషియన్స్



హైదరాబాద్ (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి చొరవతో ల్యాబ్ టెక్నీషియన్స్ గా పోస్టింగ్స్ పొందిన అభ్యర్థులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన 241వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో పెద్ద ఎత్తున ల్యాబ్ టెక్నీషియన్స్ వచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్స్ ఉద్యోగాల కోసం పరీక్షలు రాసినా.. పోస్టింగ్స్ లో జాప్యం జరగడంతో అభ్యర్థులు కొంత కాలం క్రితం సీఎం ప్రజావాణిని ఆశ్రయించారు. ఈ విషయంపై చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి పోస్టింగ్స్ తొందరగా ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు వారికి పోస్టింగ్స్ వచ్చాయి.

### సీఎం ప్రజావాణిలో 233 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 241వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 233 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 96, రెవెన్యూ శాఖకు సంబంధించి 43, విద్యుత్ శాఖకు 16, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 78 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

## మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

### పోలీసు బృందాన్ని అభినందించిన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి

సంగారెడ్డి బ్యూరో,జూలై 24 (జనం సాక్షి): సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి సంగారెడ్డి ప్రత్యేక పోక్సో (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్) కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, క్రైం నంబర్ 103/2025గా బీఎన్ఎస్ సెక్షన్ 65(2)తో పాటు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ నిందితుడు సదాశివపేట కు చెందిన మహమ్మద్ కలీం పాషా అలియాస్ నవీద్ (25), దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సుర్‌రెడ్డి, బాధితురాలికి న్యాయ సహాయం అందించిన భరోసా కేంద్రం లీగల్ కౌన్సిలర్ ఎస్. అపర్ణ, ఆమె బృందం, దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్ఐ పి. రవీందర్, అప్పటి సీఐ ఎస్. క్రాంతి కుమార్, ప్రస్తుతం సంగారెడ్డి రూరల్ ఎస్‌హెచ్‌ఓ ఎస్. మధుసూదన్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ అభినందించారు.

## 10 కిలోల గంజాయితో మైనర్ అరెస్టు



తాండూరు జులై 24(జనంసాక్షి) : తాండూరు రైల్వే స్టేషన్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 10 కిలోల గంజాయితో ఒక మైనర్ బాలుడు పట్టుబడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ బాలుడిని పోలీసులు గమనించారు. ట్రైన్ దిగి చేతిలో క్లాత్ బ్యాగ్‌తో వస్తున్న అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. తనిఖీలో ఆ బ్యాగ్‌లో సుమారు 10 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు ఆ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మైనర్ కావడంతో అతడిపై తాండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం బాలుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకే పారదర్శక నిర్ణయాలు



ముషీరాబాద్, జూలై 24 (జనంసాక్షి) : టీజీఎస్ ఆర్టీసీ పరిధిలో సేవలు అందిస్తున్న అద్దె బస్సు యజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. ఆర్టీసీలో అద్దె బస్సుల కొనసాగింపు, నిర్వహణకు సంబంధించిన అన్ని నిర్ణయాలు ప్రభుత్వ ఆదేశాలకు, సంస్థ నిబంధనలకు లోబడి అత్యంత పారదర్శకంగా తీసుకోబడతాయని తెలిపింది. కాబట్టి యజమానులు ఎటువంటి అభద్రతాభావానికి గురికావాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ క్రమంలో కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అద్దె బస్సు యజమానులను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేయడంతో పాటు ప్రభుత్వం, ఆర్టీసీ లో అధికారులను మేనేజ్ చేయడానికి డబ్బు అవసరమని అద్దె బస్సు యజమానుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఇటువంటి వదంతులు, దుష్ప్రచారాల వల్ల యజమానుల ప్రయోజనాలకే తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆర్టీసీలో అన్ని నిర్ణయాలు అత్యంత పారదర్శకంగా తీసుకోవడం జరుగుతుంది. కాబట్టి అద్దె బస్సు యజమానులందరూ అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక ప్రచారాలను గానీ, సంఘాల మాటలను గానీ నమ్మి ఎవరూ మోసపోవద్దని సవినయంగా కోరుతోంది. సంస్థ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా పరిగణించాలని సూచించింది. అనవసర ప్రచారాలకు లొంగి సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే దానికి సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేస్తూ, ప్రశాంత వాతావరణంలో సంస్థతో సహకరించాలని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కోరుతోంది.

## బ్రేక్ ఫాస్ట్ స్కీంకు సీఎస్ఆర్ నిధుల అందజేత

### దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థల చేయూత



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు కలిసారు. దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థల తరఫున ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీంకు సిఎం సమక్షంలో సీఎస్ఆర్ నిధులను ఫౌండేషన్‌కు అందజేశారు. అరబిందో ఫార్మా లిమిటెడ్ తరపున రూ.10 కోట్లు, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ తరపున రూ.12.18 కోట్లు అందజేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. సెంట్రలైజ్డ్ కిచెన్‌లను ఏర్పాటు చేసిన చోట పరిసర ప్రాంతాల రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం వివరించారు. అవసరమైన కూరగాయలు, బియ్యం ఇతర సామగ్రిని నేరుగా రైతుల నుంచి తీసుకునేలా రైతులను ఆర్గానిక్ పంటల వైపు ప్రోత్సహించాలని సీఎం పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తద్వారా పంటమార్పిడి విధానాన్ని ప్రోత్సహించినట్లవడమే కాకుండా రైతులకు లాభాలను అందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సంస్థలను సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభు జీ, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ మధు బాబు, అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ సభ్యులకు నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం ప్రారంభం



ఖైరతాబాద్, జూలై 24 (జనం సాక్షి) : ప్రెస్ క్లబ్ నమోదు చేసుకున్న సభ్యులు, హెల్త్ కార్డు కలిగిన జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల కోసం నిమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్రత్యేక శిబిరా న్ని శుక్రవారం ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ డా. రాహుల్ దేవరాజ్ పరిరక్షణలో డీన్ డా.చంద్రశేఖర్, సీనియర్ ప్రొఫెసర్ డా.పరంజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చరణ్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కు మార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మాట్లాడుతూ జర్నలిస్టులు తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, వారికి ఈ మాస్టర్ హెల్త్ చెకప్ శిబిరం ఎంతో ఉప యోగకరంగా ఉంటుందని తెలిపారు. జర్నలిస్టు లు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. హెల్త్ కార్డు కలి గిన ప్రెస్ క్లబ్ నమోదు సభ్యులకు మాత్రమే ఈ శిబిరంలో మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహిస్తామని నిమ్స్ వైద్యాధి కారులు తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్య లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్.శ్రీనివాస్ రెడ్డి, వనం నాగరాజు, అశో క్ దయ్యాల, రచన ముదుంబై, నిమ్స్ మీడియా రిలేషన్స్ అధికారి సత్యగౌడ్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బాలికలు, పిల్లల భద్రతకు దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలి

- ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్
- ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో జాతీయ సదస్సు



ముషీరాబాద్, జూలై 24 (జనం సాక్షి): బాలికలు, పిల్లలపై పెరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు, అఘాయిత్యాలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమం చేపట్టాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) పిలుపుని చ్చింది. హైదరా బాద్‌లోని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బాలికలు, పిల్లలపై అఘాయి త్యాలకు వ్యతిరేకంగా జాతీయ సదస్సు లో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సదస్సును తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డా. జి. రాధారాణి ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పోక్సో, నిర్భయ, దిశ వంటి చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ సీఎస్ ఐఆర్ – నిస్కెయిర్ చీఫ్ సైంటిస్ట్ గౌ హర్ రజా, మహిళలపై వి వక్ష, చిన్నా రులపై పెరు గుతున్న అఘా యిత్యాల పట్ల సమా జంలో నిర్లక్ష్య ధోరణి ఆం దోళన కలి గిస్తోందని అ న్నారు. ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు బలహీనపడుతున్నాయని, మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇప్పటికీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఏఐడీఎస్‌వో అఖిల భారత ప్రధాన కార్యదర్శి శిబాశిస్ ప్రహరాజ్, జాయింట్ సెక్రటరీ శృతి శివహరేతో పాటు పలువురు విద్యార్థి నాయకులు ప్రసంగిస్తూ, మహిళలు, పిల్లల భద్రతను ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో బాలికలు, పిల్లలపై పెరుగుతున్న నేరాలను అరికట్టాలని, అలాగే పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్టిఏ ను రద్దు చేయాలని, విద్యార్థుల ఉద్యమాలపై పోలీసు దాడులను ఖండిస్తూ రెండు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370